
- నన్నయ, ఎఱ్ఱనల 'కారకము' - అరణ్య పర్వ శేషము
- కె.శివారెడ్డి కవిత్వం 'గాథ' - మానవ జీవన చైతన్యం
- ఉత్తర హరివంశం - సాంఘిక సాంస్కృతిక అంశాలు
- సింగమనేని కథాసాహిత్యం - రాయలసీమ వ్యవసాయ సంక్షోభం
- ఇతిహాసములు - మానవతా విలువలు
- నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త 'కందుకూరి'
- రసకేతనం ఎగురవేసిన ధర్మ 'రక్షాబంధం'
- సాహిత్యపు అస్తిత్వాన్ని చూపే దర్పణమే 'తెలుగు సాహిత్యం'

# మూసీ
# MUSI


Samputi : 26 • Sanchika : 06 • Pages : 64 • Rs. 20
April 2023

UGC Care List
Approved Journal



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 26 సంచిక : 6
ఏప్రిల్ - 2023
'శోభకృత్' చైత్ర మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**

UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

నన్నయ, ఎఱ్ఱనల 'కారకము' - అరణ్య పర్వ శేషము .. డా. మోదుగు కాశీంబాబు 7
జానపద వాఙ్మయ బ్రహ్మ - ఆచార్య బిరుదురాజు ... డా. శ్రీమంతుల దామోదర్ 11
గడీవాసం (బందారం కథలు -17) ... డా. నందిని సిధారెడ్డి 13
కె. శివారెడ్డి కవిత్వం 'గాథ' - మానవ జీవన చైతన్యం ... డా. వి. పవన్‌కుమార్ రెడ్డి 17
పద్య మనోహరం - 41 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 20
భారతీయీకరణ11 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార21
పలుకులమ్మ తోటమాలికి అభినందన చందనం (గ్రంథాంతరంగం-23) ... ఘట్టమరాజు25
'మా కొండ తల్లి' ... ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి 28
ఉత్తర హరివంశం - సాంఘిక సాంస్కృతిక అంశాలు ... ఎన్. ఈశ్వర్ రెడ్డి 33
సింగమనేని కథాసాహిత్యం - రాయలసీమ వ్యవసాయ సంక్షోభం ... ఆచార్య కె. శ్రీదేవి 37
ఇతిహాసములు - మానవతా విలువలు ... డా. పంజాల శ్రీనివాస్ 42
నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త 'కందుకూరి' ... కందాటి ధనశ్రీ 45
రసకేతనం ఎగురవేసిన ధర్మ "రక్షాబంధం" ... సూలూరి శివసుబ్రహ్మణ్యం 47
సాహిత్యపు అస్తిత్వాన్ని చూపే దర్పణమే "తెలుగు సాహిత్యం - మరోచూపు" .. 51
స్వరాభిషేకం (కె.విశ్వనాథ్ చిత్రాలు-సామాజిక అవలోకనం:31) ... టి. లక్ష్మీనారాయణ53

### కవితలు

చెడు గుణాలు చేటు ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 5; నిరుద్యోగం ... దేరంగుల శివకుమార్ - 6; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ -6; వేడుకోవడమేనా ... కొమురవెల్లి అంజయ్య - 12; నీ గుండె గుడి కావాలి ... నేదునూరి కనకయ్య - 16; లోకం గొడ్డువోయింది ... డా. వడ్డాపురం కృష్ణ - 56; మరమ్మత్తులకు వేళయింది ... డా. పొదిలి నాగరాజు - 62.

### సమీక్షలు

తెలుగు సాహిత్యం - పర్యావరణం (సిటీకళాశాల జాతీయ సదస్సు నివేదిక) ..
వర్ధ వేణు 57
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2023

## సంపాదకీయం







**వ్యక్తి శక్తి కావాలి**

**మనిషి మనీషి కావాలి**

**మానవుడు**
**మహనీయుడు కావాలి**

**ఉన్న స్థానం నుండి**
**ఉన్నత స్థానానికి చేరాలి**

**పరిమితుడు**
**అపరిమితుడు కావాలి**


**స్థాయి విస్తరించాలి**


**దైవత్వం మేల్కొనాలి**

**తనను తాను నిరంతరం**
**ఉద్ధరించుకోవాలి**

**అందరికీ ఆదర్శంగా**
**ఆమృతమూర్తిగా**
**మారాలి**

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





## స్పందన

స్పందన అన్నింటిలోనూ ఉంటుంది. మనకు కనిపించినా కనిపించక పోయినా విశ్వమంతా అన్ని విషయాల్లో ఎప్పటికీ ఏదో రూపంలో స్పందిస్తూనే ఉంటుంది. శక్తి ఉంటే స్పందన ఉంటుంది. శక్తి లేని చోట స్పందన ఉండదు. వ్యక్తి జీవించి ఉన్నాడు అనడానికి నాడీ స్పందన, హృదయ స్పందన చూస్తుండడం సంప్రదాయమే. వ్యక్తమైన వాని స్పందనలను కొన్నింటిని మనం గమనించ గలుగుతాం. వ్యక్తం కాని వాని స్పందనను గమనించలేము. అయినా అక్కడ కూడా గాఢమైన స్పందన ఉంటుంది. సాధారణ స్థాయిని దాటిన స్పందనల వల్ల ప్రకృతికి, వ్యక్తికి కూడా లోపాలు ఏర్పడుతూనే ఉన్నాయి. అతి స్పందన వల్ల అనర్థాలు అధికమే. కొన్ని సార్లు ఉపయోగ రహితం కూడా. స్పందనలు తగ్గుతూ, గాఢత పెరుగుతున్నప్పుడే స్పష్టత అధికమౌతుంది. నిండు కుండ తొణకదు కదా!

చిన్న పిల్లలకు లోపల శక్తి కావలసినంత ఉండక పోవడం వల్ల ఏదైనా విషయాన్ని విన్నా, గమనించినా, అనిపించినా వెంటనే పక్కవాళ్ళతో పంచుకుంటూనే ఉంటారు. శక్తి తక్కువగా ఉన్న వాళ్ళంతా అంతే. తొందరగా స్పందించి అలసి పోతుంటారు. భావ వ్యక్తీకరణ అవసరమే కాని అవసరానుకూలంగా, గాఢంగా వ్యక్తీకరించినపుడే అది తరువాతి తరానికి అందుతుంది. తాత్కాలిక వ్యవహార స్పందనలు అప్పటికప్పుడు వచ్చి పోయేవే. వర్షం పడినప్పుడు నీటి ప్రవాహం లాగా!

నదుల, కాలువల ప్రవాహాలను గమనిస్తే తక్కువ లోతున్న చోట ఎక్కువ పరుగెత్తినట్లు కనిపిస్తూ, ధ్వని కూడా వస్తుంది. నిజమైన లోతులున్నచోట మనకు కనిపించని వేగం చాలా ఉంటుంది. చెట్లైనా అంతే! చిన్న చిన్న చెట్లు కొద్ది గాలి రాగానే ఊగిపోతుంటాయి. మహా వృక్షాలు ఎంతో తీవ్రమైన గాలి వస్తే తప్ప కదలవు. కదిలినట్లు అనిపిస్తుంటాయి. బలహీనమైన ఆలోచనలు ఉన్నవారు తొందరగా స్పందిస్తుంటారు. ఏదో రూపంలో వ్యక్తమవ్వాలని ఆరాట పడుతుంటారు. తొందరపాటు ఎప్పటికీ ప్రమాదకరమే. శరీరంలోనూ అతి స్పందన అనారోగ్యకరమే కదా!

బలవంతుడు, జ్ఞాని స్పందించాలంటే చాలా సమయం పడుతుంది. చేసే పనులను చాలా లోతుగా చేయగల, నిర్వహించగల సమర్థత జ్ఞానికి ఉంటుంది. నిర్వహణ శక్తి క్రమంగా పెరుగుతుంది. ఏదో చదివినా, విన్నా, గమనించినా, ఆలోచించినా తాము మళ్ళీ వ్యక్తం అయ్యేటప్పుడు తగిన లోతు ఉండితీరాలి. బలవంతునికి, జ్ఞానికి మాత్రమే ఇది సాధ్యం. ఈ లోతు, గాఢత లేకుంటే వెంటవెంటనే అనవసరపు సలహాలు, సూచనలు చేస్తూ లోపలో, బయటో చేస్తూనే ఉంటాం. పరిశీలన ద్వారా చాలా అంశాలను అవగాహన చేసుకోవాలి. "విననంతనె వేగపడక వివరింపదగున్". అవసరానుకూలంగా, అవసరమైనంత మాత్రమే వ్యక్తీకరించేవారు మాత్రమే తరువాతి తరానికి మార్గదర్శకులవుతారు. లేకుంటే బుబ్బులో పుట్టి మఖలో మాడిపోతారు.

అన్నీ ఉన్నమ్మ అణిగిమణిగి ఉంటుంది, ఏమీ లేనమ్మ ఎగిరెగిరి పడుతుంది... అన్న మాట అందరికీ తెలిసిందే. ఇవన్నీ స్పందనలను తెలియజేసే అంశాలే. తగిన విషయ జ్ఞానం, సమాజ జ్ఞానం, ప్రకృతి జ్ఞానం, ఆత్మజ్ఞానం అనే వరుసలో అర్థం చేసుకుంటూ మూలాన్వేషణలు చేసేవారు అతి తక్కువ స్పందిస్తారు. వారు స్పందిస్తే మొత్తం ప్రకృతే స్పందిస్తుంది. అంతగా కదల్చగలిగిన శక్తి ఉంటుంది. పిల్ల కాలువల వేగం కాదు, మహా నదులు, సముద్రాల లోతు, గాంభీర్యం కావాలి. గులక రాళ్ళు కాదు, మహా పర్వతాలు కావాలి. స్పందనలు తగ్గించుకుంటే శక్తి బాగా పెరుగుతుంది. తపస్సు చేత శక్తివంతులైన జ్ఞానులే తరువాతి తరాలను శాసించగలుగుతారు.

# చెడు గుణాలు చేటు





కోపమిలను నీవు కోరరాదెన్నడు
పాప హేతువయ్యి పాడుచేయు
శాంతగుణమెప్పుడును సవ్యజీవికగాను
సంఘమందు కీర్తి సఫలమిచ్చు!

ఓర్పు వలన పనులు ఒనగూరు జగతిలో
నేర్పుతోడ మనసు నెమ్మదగును
ఓర్పుతీర్పులున్న ఒజ్జవై జ్ఞానమ్ము
పదుగురికిల పంచు పరమప్రజ్ఞ!

ధనము వల్ల గలుగు దర్పంబు గర్వంబు
తగిన డబ్బుతోడ తపన దీరు
కోర్కెలధికమైన కోల్పోవు శాంతిని
చక్కనైన బ్రతుకు సాధ్యపడదు!

ముదము మనిషికెపుడు మర్యాదనీయదు
మత్సరంబు కూడ మనకు చేటు
మదకరి"కల"న మరి సింహము కనబడ్డ
గజము చచ్చుననుట కల్ల కాదు!

ఈర్ష్యగుణమువల్ల నిబ్బందులెన్నియో
నరుడు నరకుడౌను నాడు నేడు
చెడ్డపనులన్ని చేటునే చేయును
హితము గూర్చువాడె హితుడు సతము

మనసు మంచిదైన మనుగడ కెదురేది?
నీచ గుణము నిన్ను నింద ముంచు
తేలుకొండి నుండి తేనెలు వచ్చునా?
మనిషివలెను బ్రతుకు మహిని నీవు!

మోసమెపుడు చేసి మొనగాడు కాలేడు
దొరకు వరకు తనది దొరతనంబె
పాము కోరలెపుడు పాలను పంచవు
నీతి లేని బ్రతుకు నిష్ఫలంబు!

దాన ధర్మములను దయతోడ చేయక
దాచిపెట్టుకొనగ ధరణిలోన
పరులపాలు గాదె పాపిష్టి ధనమంత
లోభగుణము వల్ల లోలుడౌను!

అల్పకాంక్షల కిల నారట పడబోకు
స్వల్పజీవితాన స్వార్థమేల?
కొరకొనకు పెక్కు కోర్కెల నెప్పుడు
దు:ఖమేను నీకు సుఖము లేదు!


కులమతాల చూడ కుత్సిత భావాలె
సమత మమత భావ సరణి జచ్చు
విశ్వమందునున్న విషతుల్యతలు నిల
సమసిపోవు నాడు సంతసంబు!!

డా. గన్నోజు శ్రీనివాసాచారి
ఫోన్ : 8555 899 493

# నిరుద్యోగం




డిగ్రీ కాగితాలను సంచిలో దాసుకొని,
ఆశల ఆనందాల్ని గుండెల్లో పెట్టుకొని
నౌకర్ల కోసం తపిస్తూ సం॥రాలు
గడిచిన నోటిఫికేషన్లు వేయక
నిరుద్యోగులు సంఖ్య
పెరిగే కొద్దీ గుండెల్లో గుబులైతాంది ..
ఆశ నిరాశల కల్లోలం షురవుతుంది ..
నిరాశ పూర్తిగా కాల్చేస్తుంది ..
రోజులు, నెలలు, సం॥రాలు గడుస్తున్నాయి
ఆకలి కడుపులు నిరాశలతో గుండెలు మండుతున్నాయి ..



కన్నీరు తుడిచే సేయి లేక,
తెగించే తెగువ లేక,
మనసు సేసే సావు బతుకుల సమరంలో
ఆలోచనలు సావుకు మద్దతుగా నిలిచి
గటు వైపు సాగనంపుతున్నాయి..
నా మాట..
విద్య వ్యాపారమైన వేళ
పరిణతి సెందని సదువులతో ...
ఎన్నో ఆశలతో
అంతస్తుల అందాలు ఆకర్షిస్తూ ఉంటే,
ఆ పద్మవ్యూహంలో సిక్కుకుంటున్న
నా అభిమన్యులెందరో ...?!?




అయినా ఈ లోకంలో
ఏ సమస్యకు సావు జవాబు కాదు,
అది నీ అయ్యావ్వలకు శోకం ..
జీవిత కాలం వారికి తీరని లోటు ...




సీకటి వెలుగుల సిత్రమే గదా...!
జిందగీ అలల తీరాన్ని తాకితే కాదు,
దాటితేనే ప్రశాంత ..!!
జీవిత సంద్రాన్ని సూడగలమని
తెలుసుకోవాలి మిత్రమా.. నా నిరుద్యోగ నేస్తమా ..!!

దేరంగుల శివకుమార్
నాగర్ కర్నూల్, ఫోన్ : 994 87 88 218

# తుకారాం అభంగం

మాయ నిండుకున్న జగతి
మాయ ఛాయ దాగున్నది
మాయమాయే సత్యం ధర్మం
అవిద్య ఆడుతున్నది తంత్రం

అలుముకోకు మాయామోహం
బహు చెడ్డది ఈర్ష్యల రోగం
మధము క్రోధ మత్సర కామం
మరుజన్మకు వేయును మార్గం

మనసన్నది మహా విచిత్రం
చిత్త భ్రమణ చంచలగాలం
పట్టు పట్టి చేయు ప్రయాణం
అదే యోగి జీవనయానం


తుకా పలికే రాజయోగం
నౌక దరికి చేర్చును భద్రం
విఠల పాండురంగ నామం
దాటించు భవ సాగర తీరం




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

# నన్నయ, ఎఱ్ఱనల 'కారకము' – అరణ్యపర్వ శేషము

డా. మోదుగు కాశీంబాబు, భారతీయ భాషా సంస్థ, మైసూర్. ఫోన్ : 99086 83093



ఆంధ్రమహాభారతంలోని ఆరణ్యపర్వశేషం నన్నయ రచన అని, ఎఱ్ఱయరచన అని పండితుల్లో, పరిశోధకుల్లో భిన్నాభిప్రాయా లుండటం తెలిసినదే. ఆరణ్యపర్వశేషంపై వచ్చిన మొదటివాదం శ్రీశతఘంటం వేంకటరంగశాస్త్రి 'ఉత్సన్నవాదం', తరువాత శ్రీ నడకుదుటి వీర్రాజు 'శిథిలపూరణవాదం'. ఈ రెండు వాదాలప్రకారం నన్నయ ఆది, సభా, ఆరణ్యపర్వాలను పూర్తిచేశాడని, ఆరణ్యపర్వంలో కొంతభాగాన్ని చెద తినటంవల్లనే ఎఱ్ఱన నష్టమైన భాగాన్ని పూరించాడన్నది సారాంశం. అయితే ఈ రెండు వాదాలకు శాస్త్రీయమైన ఆధారాలు లేకపోవడంవల్ల ఇవి కేవలం ఊహాజనిత మైనవని పరిశోధకులు తిరస్కరించారు. తిక్కన, మారన, అప్పకవి వంటివారి మాటల్ని ఆధారం చేసుకొని కొంతమంది పండితులు ఇప్పటికీ పై వాదాల్ని బలపరస్తూ వున్నారు. పింగళి లక్ష్మీకాంతం వంటి పండితులు, ఓగేటి అచ్యుతరామశాస్త్రివంటి పరిశోధకులు ఈ విషయంపై అధ్యయనం చేసి ఇది ఎఱ్ఱయదేనని తేల్చిచెప్పారు. అయితే ఈ అధ్యయనాలన్నీ ఎఱ్ఱన సాహిత్యాంశాల్ని ఆధారం చేసుకొన్నవే. భాషావిషయకంగా కొన్ని ఆధారాల్ని చూపినా వారిద్దరి కారకాన్ని తులనాత్మకం చేసి ప్రత్యేకంగా అధ్యయనం చేసినట్లు కనబడదు. అందువల్ల ఈవ్యాసంలో నన్నయ, ఎఱ్ఱనల కారకాన్ని పరిశీలించి, ఆరణ్యపర్వంతో పోల్చి చెప్పే ప్రయత్నం చేస్తాను.

వాక్యంలోని నామవాచకానికి, క్రియకు మధ్యగల సంబంధాన్ని దృష్టిలో పెట్టుకొని వాక్యాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడే వ్యాకరణయుక్తమైన వాక్య దోహదాన్ని కారకమంటారు. నామవాచకం ఏదో ఒక విభక్తి ప్రత్యయంతో కలవడంతో క్రియయొక్క అర్థం మారుతుంది. ఇలా నామవాచకంతో సమన్వయించబడుతూ క్రియాన్వయాన్ని కలిగించేది కారకమవుతుంది. కారకాలు కర్తృ, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణ అని ఆరు రకాలు. ఈ కారకాన్ని నన్నయ, ఎఱ్ఱనల భాష ఆధారంగా పరిశీలించడం పెద్ద పరిశ్రమే అవుతుంది. నన్నయ, ఎఱ్ఱనల కాలాలు, వారి రచనా విధానం వేరు. ఒకరిది కథాకథనశైలి, ఇంకొకరిది వర్ణనాత్మకశైలి. నన్నయ మార్గకవితను ఆరంభించి తరువాతి కవులకు మార్గనిర్దేశం చేశాడు. కావ్యభాషకు నన్నయకాలం చాలా కీలకమైంది. తరువాత వచ్చిన శివకవులది దేశికవిత. పదమూడో శతాబ్దం తిక్కన మహాకవి కాలానికి భాషలో, రచనలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. తిక్కన తరువాతి కవులకు అనుసరణీయమైనాడు. ఇలా నన్నయ కాలంలోని కావ్యభాష నడచిన తీరు, భాష విషయంలో నన్నయ చేసిన పరిశ్రమ, ఆ తరువాత వచ్చిన నన్నెచోడుడు, పాల్కురికివంటి కవులు, భాషలో నూతన ప్రయోగాలు చేసిన తిక్కనాది మహాకవులు చూపినమార్గం, ఎఱ్ఱనకాలంనాటి కావ్యభాషతీరు చాలా వైవిధ్యంతో కూడుకొన్నదని చెప్పవచ్చు. నన్నయ చేసిన సంధి, పద బంధాలతీరు, యతిమైత్రి, వర్ణోచ్చారణ విశేషాలు, ధ్వనిభేదాలు, కారకవిశేషాలు వంటి విషయాలను పరిశీలించినపుడు వైవిధ్యం కనబడుతుంది. కాబట్టి నన్నయభాషకు, ఎఱ్ఱనభాషకు అంతరం సహజంగా ఉంది. వీరిద్దరి కారకం ఆధారంగా, ఆరణ్యపర్వ శేషంలోని కారకాన్ని కూడా పరిశీలించి, రెండూ సరిపోల్చి చెప్పే ప్రయత్నం చేస్తాను.

**1. కర్తృకారకం :** నన్నయ, ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషంలోనూ 'కర్తృకారకం'లో ప్రాతిపదికార్థంలో, ఉక్తార్థంలో వ్యత్యాసం కనబడదు. కానీ సంబోధనార్థంలో స్పష్టమైన వ్యత్యాసాన్ని గమనించవచ్చు.

నన్నయభారతంలో సంబోధనార్థంలో **'ఓ', 'ఓరి', 'ఓసి'** పదాలు కనబడవు. ఆరణ్యపర్వశేషంలో, ఎఱ్ఱన రచనల్లో ఉదాహరణలు కనివిన్తున్నాయి. ఆరణ్యపర్వశేషంలో **ఓరి దురాత్మ!** (భా.ఆ.5–



179), **ఓయన్న!** (భా.ఆర.6-330) వంటివి కనబడతాయి. ఎఱ్ఱనలో **'ఓ పాపలార!'** (హరి.పూ.6-184), **ఓయి సమీర** (నృ.పు.4-147), **ఓయి విప్రజిత్త** (నృ.పు.4-171) వంటి ప్రయోగాలు కనబడుతున్నాయి. ఇక్కడ సంబోధానార్థంలో నన్నయలో లేని ప్రయోగాలు ఎఱ్ఱన ఇరత రచనలలోనూ, ఆరణ్యపర్వశేషంలోనూ కనిపిస్తున్నాయి. ఈ వ్యత్యాసాన్ని చారిత్రకమైనదిగా గుర్తించవచ్చు.

**2. కర్మకారకం :** కర్మ కారకాన్ని సూచించే ప్రత్యయాలుగా **'ను', 'ని', 'ల', 'కూర్చి', 'గుఱించి'** అని వ్యాకర్తలు చెప్పారు. కర్మార్థంలో **'ను', 'ని'** నన్నయ, ఎఱ్ఱన ఇద్దరిలోనూ, ఆరణ్యపర్వ శేషంలోనూ కనిపిస్తున్నాయి. **'కూర్చి'** నన్నయలో **'కొంద అర్థము వారిక కూర్చి యిచ్చిరి'** (భా.ఆది.7-133) అని సహాయక క్రియగా మాత్రమే కనిపిస్తుంది. ఆరణ్యపర్వశేషంలో **'ఇంతసేపు గదుట గూర్చి విలాపము సేసె'** (భా.అ.5-355) అని ఒకచోట, ఎఱ్ఱన రచనల్లో **'అందఱం గూర్చి యప్రమేయ'** (హరి.ఉ.భా.2-130) అని కొన్నిచోట్ల విభక్త్యర్థంలో కనిపిస్తుంది. నన్నయలోనేకాక, నన్నెచోడునిలో కూడా కనబడని ఈ ప్రత్యయం తిక్కన భారతంలో కనిపిస్తుంది.

'గుఱించి'కి నన్నయలో **'ఈశ్వరుగుఱించి'** (భా.అ.3-81), **'ఈశ్వరును గుఱించి'** (భా.అ.4-52) అని ప్రయోగాలు ముద్రితగ్రంథాల్లో కనబడుతున్నాయి. కానీ రాతప్రతుల్లో **'గుఱిచి'** అనే ప్రయోగాలున్నాయని చిలుకూరి నారాయణరావుగారంటారు. ఉదాహరణకు **'అంబుజసంభవు గుఱిచి'** (భా.ఆది.2-169), **అప్పాండవులను గుఱిచి** (భా.ఆది. 7-24), **తపను గుఱిచి** (భా.ఆది.7-68). నన్నెచోడుని భాషలో కూడా **'గుఱించి', 'గుఱిచి'** వంటి రూపాలతో ప్రయోగాలు కనబడవు. తిక్కనభాషలో రెండు ప్రయోగాలు కనబడుతున్నాయి. అయితే చిలుకూరివారు చెప్పినట్లు ముద్రితప్రతుల్లోనే 'గుఱించి' రూపముంటే నన్నెచోడునిలాగే నన్నయలో కూడా 'గుఱించి' లేదనే చెప్పాలి. ఎఱ్ఱన కాలంలో మాత్రం 'గుఱించి'కి ప్రయోగాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముద్రిత ప్రతుల ప్రకారం నన్నయలో 'గుఱిచి' రూపాలు మూడు. కానీ 'గుఱించి' అనే రూపాలను కూడా 'గుఱిచి' రూపాలుగానే భావించడం వలన ఈ రూపాలు అయిదు. తరువాత ఇవి తిక్కనభారతంలో, ఆరణ్యపర్వశేషంలో, ఎఱ్ఱన రచనల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎఱ్ఱన తరువాత శ్రీనాథుడు, ప్రబంధయుగంలో 'గుఱించి' తోపాటు 'గుఱియించి' అనే రూపాలు కూడా అధికంగా కనిపిస్తున్నాయి. ద్వితీయా విభక్త్యర్థంలో 'ను, ని, ల', 'కూర్చి, గుఱించి' అని ఆంధ్రశబ్దచింతామణి పేర్కొంది. 'చింతామణి' నన్నయదే నన్న వాదం కూడా ఉంది. కానీ, కర్మార్థంలో 'కూర్చి', 'గుఱించి' 11, 12 శతాబ్దాలలో విభక్త్యర్థంలో కనబడవు. 13వ శతాబ్దిలో వచ్చిన కేతన 'ఆంధ్రభాషాభూషణం' కర్మార్థంలో 'ను' 'ని' లను మాత్రమే పేర్కొన్నది.

**3. కరణ కారకం :** కరణార్థంలో నన్నయలో **చేతన, చేతను, తోడన, తోడుగ, తోడుగా, తోడ్తోన, తోడ్తేర, తోడి, తోడిది, మెయిన్, చేసి, కూడ, పజ్జన్** వంటివి కనబడుతున్నాయి. ఎఱ్ఱనలో **తోడుత, తోడుతోన్, తోడులు, తోడ్తోడ, తోడి, తోడిద** వంటివి కనబడుతున్నాయి. నన్నయ భారతంలో కనిపించే పై రూపాలు ఆరణ్యపర్వ శేషంలో కనిపించవు. ఎఱ్ఱన హరివంశంలో **'తోడుతోన్'** (హరి.ఉ.7-129), **'తోడుత'** (హరి.ఉ.7-156), **'తోడ్తోడ'** (హరి.ఉ.7-193) కనిపిస్తున్నాయి.

**'మెయి', 'చేసి' 'ఉనికి'** వంటివి కూడా ఎఱ్ఱనలోనూ, ఆరణ్యపర్వ శేషంలోనూ కనిపిస్తాయి. **'కూడ' 'పురుషుం గూడ దదాగమనంబు'** (భా.ఆది.4-86) అని కరణార్థంలో ఇద్దరిలో ఒక్కొక్క ప్రయోగం కనిపిస్తున్నది. **'పజ్జ' 'అవ్వనిత పజ్జ నరిగె'** (భా.ఆది.7-271) నన్నయలో ఒకటి, 'ఆరణ్యపర్వశేషం'లో రెండు ప్రయోగాలు కనిపిస్తున్నాయి. **'కతము'** అనేది ద్వితీయావిభక్త్యర్థంలో కూడా రావడం 'ఆరణ్యపర్వ శేషం'లో మాత్రమే ఉంది. నన్నయలో ఇది పంచమీ విభక్త్యర్థంలోనే ఉంది. **'ఎడ'** కూడా నన్నయలో సప్తమీ విభక్త్యర్థంలో ఒకటి రెండుచోట్ల మాత్రమే కనిపిస్తుంది. ఆరణ్యపర్వ శేషంలో ఇది సప్తమీ విభక్త్యర్థంతో పాటు, ద్వితీయా విభక్త్యర్థంలోనూ కనిపిస్తుంది.

**4. సంప్రదాన కారకం : కొఱకు, కయి/కై** లను సంప్రదానార్థంలో వ్యాకర్తలు చెప్పారు. 'కొఱకు'కి ప్రయోజనం అన్న అర్థం ఉంది. 'కొఱకు' ప్రయోగాలు నన్నయ భారతంలో కనబడవు. నన్నయలోనే కాక, నన్నయకు ముందు శాసనాల్లోగానీ, నన్నయ తరువాత నన్నెచోడుని కాలంలో కూడా కనిపించదు. తిక్కనలో కూడా కర్ణ పర్వం నుండి కనబడుతున్నాయి. 'ఆరణ్యపర్వశేషం'లో **'విగ్రహము కొఱక యని'** (భా.ఆర.5-353), **'నీకొఱకు గాదు'** (భా.ఆర.7-157) అని రెండు ప్రయోగాలు కనిపిస్తున్నాయి. ఎఱ్ఱనలో **'పూచుకొఱకు'** (నృ.పు.2-69), **వధించు సేతకొఱకుం** (హరి.ఉ.6-203), **బభ్రుకొఱకునై** (హరి.ఉ.6-260), **వస్తు వైహికాముష్మి వాప్తి కొఱకు** (హరి.ఉ.10-289) అని ఎక్కువగా కనిపిస్తున్నాయి. 'ఆంధ్ర శబ్ద చింతామణి' సంప్రదానార్థంలో 'కొఱకు', 'కై' లను విధించింది. కానీ నన్నయ భారతంలోగానీ, శాసనభాషలోగానీ, నన్నెచోడునిలోగానీ 'కొఱకు' కనబడకపోవడం విశేషం. 'ఆంధ్ర భాషాభూషణం' 'కు', 'కి' ప్రత్యయాలను మాత్రమే సంప్రదానార్థంలో చెప్పింది.

**కై/కయి** రూపాలు నన్నయలో చాలా తక్కువ. **'శకుని నాకై కడంగి'** (భా.సభా.1-174), ఎఱ్ఱనలో అధికంగాను **'పనికై'** (హరి.ఉ.5-176), ఆరణ్యపర్వశేషంలో **'నిర్ణయించుట కయి'** (భా.ఆర.4-363), **భిక్షకై** (భా.అ.5-110) అంటూ పదికి పైగా కనిపిస్తున్నాయి.




**'పొంటె'** వర్ణకాన్ని ప్రాచీన వ్యాకర్తలు కొందరు తృతీయా విభక్త్యర్థంలో చెప్పారు కానీ, నిజానికిది సంప్రదానార్థంలోనే సరిపోతుంది. ప్రౌఢవ్యాకర్త కూడా సంప్రదానార్థంలోనే చెప్పారు. **'కొఱవి'**శాసనంలో కూడా సంప్రదానార్థంలోనే కనిపిస్తుంది. **'పొంటె'** వర్ణకాన్ని నన్నయ ప్రాతిపదికలపై, తద్ధర్మార్థక ధాతుజ విశేషణాలపై ప్రయోగించడం కనిపిస్తుంది. **లోకహితంబు పొంటె** (భా.ఆది.2-185), **వివాహంబు సేయు పొంటె** (భా.ఆది.4-191), **ఆత్మోదయ వృద్ధి పొంటెను** (భా.ఆది.8-13). **'పొంటె'** ఎఱ్ఱనకంటే తిక్కనలో ఎక్కువగా కనిపిస్తుంది. 'ఆరణ్యపర్వశేషం'లో లేదు. ఎఱ్ఱనలో విరళంగా కనిపిస్తున్నది. **అడిగించుపొంటెన్** (హరి.ఉ.2-40), **ఈగు పొంటెన్** (హరి.ఉ.2-94). శ్రీనాథునిలో కేవలం మూడు ప్రయోగాలే కనిపిస్తున్నాయి. ప్రబంధ సాహిత్యంలో అసలు కనబడదు.

నిమిత్తార్థంలో **'అర్థంబు'** పదాన్ని సంప్రదానార్థంలో ప్రయోగించడం తిక్కనలో, ఎఱ్ఱనలో ఎక్కువగాను, నన్నయలో తక్కువగాను కనబడు తుంది. **వినోదార్థము** (భా.ఆది.3-23), **వినోదార్థము** (భా.ఆర.3-381)

**'తదర్థం'** పదాన్ని సంప్రదానార్థంలో నన్నయ మాత్రమే ప్రయోగించాడు. **నా తదర్థ మాచరింపుము** (భా.అ.3-275), **నీ తదర్థముకాగ** (భా.ఆది.2-208), **నీ తదర్థంబులై** (భా.సభా.1-259) వంటి వాటితో పాటు ఇతర విభక్త్యర్థాలలో కూడా కనిపిస్తుంది. ఇది తిక్కనలో గానీ, ఎఱ్ఱనలోగానీ, శ్రీనాథునిలో కానీ కనబడదు.

**5. అపాదానకారకం : వలన, వలని, వలనన** వంటివి పంచమీ విభక్త్యర్థంలో నన్నయ, ఎఱ్ఱనల్లో సాధారణంగా కనిపిస్తున్నాయి. **'వలన'**కు **'చేసి'** అనుప్రయుక్తంగా రావడం **'క్రోధంబు వలనంజేసి'** (భా.ఆది.2-315) నన్నయలో మాత్రమే ఒక ప్రయోగం కనిపిస్తుంది. ఎఱ్ఱనలో, ఆరణ్యపర్వశేషంలో కనబడదు.

**'కంటె'** వర్ణకం అన్యర్థాది యోగజమైన పంచమికి, నిర్ధారణ పంచమికి రావడం ఇద్దరిలో కనిపిస్తుంది. **'నుండి'** నన్నయలో నామపదాలకి, విభక్తులకి, అవ్యయాలపై రావటం కనబడుతుంది. **వారిచ్చటనుండి** (భా.ఆది.4-27), **వనంబునుండి** (భా.ఆది.4-61), **నీరిలోనుండి** (భా.అ.3-122), ఎఱ్ఱనలో **వద్దనుండి** (నృ.పు.4-4), **ఎక్కడనుండి** (నృ.పు.4-9), **గద్దియపైనుండి** (నృ.పు.5-43),**అంతనుండి** (హరి.ఉ.4-127). ఆరణ్యపర్వశేషంలో నామపదాలపై **'దివినుండి'**, అవ్యయాలపై ఎక్కడనుండి, అచ్చటినుండి వంటివి కనబడుతున్నాయి కానీ, విభక్త్యర్థక రూపాలపై కనబడదు.

**'కోలెన్'** శబ్దం కాలవాచకాలపై వస్తుంది. నన్నయభారతంలో దాదాపు 16 సార్లు కనిపిస్తుంది. ఎఱ్ఱనలో తక్కువగా కనిపిస్తుంది. ఆరణ్యపర్వశేషంలో నాలుగు ప్రయోగాలు కనిపిస్తున్నాయి. నన్నయ **'మొదలింటం గోలె'** (భా.ఆది.6-129), **నిన్నట గోలెన్'** (భా.ఆది.8-118), ఎఱ్ఱనలో **'పుట్టిన గోలెన్'** (హరి.పూ.2-207), **పుట్టిన గోలెను** (హరి.ఉ.6-207) ఆరణ్యపర్వశేషంలో **'నూతేండ్లంగోలెన్'** (భా.అర.8-149).

**'కతన', 'కతము'** వంటి ప్రయోగాలు కూడా ఇద్దరిలోనూ కనిపిస్తున్నాయి. **'నిమిత్తము'** అనేది అపాదానార్థంలో వ్యాకర్తలు చెప్పారు. ఇది నన్నయలో నీ నిమిత్తమున (భా.సభా.2-255) కనిపిస్తున్నది. తిక్కనలో, ఆరణ్యపర్వశేషంలో, ఎఱ్ఱన రచనల్లో కనిపించదు. ఇతర విభక్త్యర్థాలలో రావడం ఇద్దరిలో ఉంది. **'పట్టి'** నన్నయలో **'గాద్పుపట్టి'** (భా.అ.3-311), ఎఱ్ఱనలో **ఇష్టంబట్టి** (హరి.పూ.1-34) ఇద్దరిలోనూ ఉన్నాయి.

**'తొట్టి'** ఈ శబ్దం నన్నయలో ఎక్కువగా నామప్రాతిపదికలపై **'సింహబలుం దొట్టి'** (భా.ఆది.1-41), **'నలువు దొట్టి'** (భా.అర.2-54), **హయంబులం దొట్టి** (భా.సభా.2-177), ఎఱ్ఱనలో **'జరాసంధు దొట్టి'** (హరి.ఉ.3-37), **'మేటిమగలందొట్టి'** (హరి.ఉ.4-142) ఇది ఎఱ్ఱనలో తక్కువగా కనిపిస్తుంది.



**6. అధికరణకారకం : 'అందు'** అస్త్యర్థంలోను, విభక్త్యర్థంలోను నన్నయలో ఎక్కువగా ఉంది. **'న', 'లో', 'లోన', 'లోపల', 'పై/ పయి', 'మీద'** వంటివి అధికరణార్థంలో ఇద్దరిలోనూ సాధారణంగానే కనబడుతున్నాయి.

**'ఎడ'** పదం **చోటు, విధము, ఆలస్యం** అనే అర్థాలతోపాటు **'అందు'** అనే అర్థంలో కూడా కనబడుతుంది. **'నీయెడ విస్మృతి బొందన్'** (భా.ఆది.3-160), **'నాయెడగరం బిష్టంబులై'** (భా.ఆది.1-12). 'ఎడ' నన్నయభారతంలో చాలా విరళం. తిక్కనలో అధికం. ఆరణ్యపర్వశేషంలోనూ, ఎఱ్ఱన రచనల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**'వద్ద', 'కడ'** అనేవి అధికరణార్థంలో నన్నయలో ఎక్కువగానే ఉన్నాయి. ఆరణ్యపర్వశేషం, ఎఱ్ఱన ఇతర రచనల్లో కొంచెం విరళంగా కనిపిస్తున్నాయి. **'వద్ద' నీయొద్దన పాతిరి** (భా.ఆది.4-262), **పాండవులయొద్ద విదురున్** (భా.ఆర.1-62), **'కడ' నీకడకు వచ్చితిన్** (భా.ఆది.5-199), **అప్పాండవుల కడకేతెంచి** (భా.ఆర.1-122).

**'కు', 'కి'** లతో ప్రయోగాలు సంబంధార్థంలో ఇద్దరి రచనల్లోనూ కనిపిస్తున్నాయి. **'యొక్క'** ఇద్దరిలోనూ కనిపించదు. **'లో', 'లోన', 'లోపల'** నిర్ధారణార్థంలో కనిపించడం కూడా ఇద్దరిలోనూ ఉన్నాయి. **'కు'** ప్రత్యయం **'వదులు', 'చూడు', 'చేయు'** వంటి క్రియలపై చేరి ప్రథమావిభక్త్యర్థంలోనూ, **'అనుగ్రహించి', 'వరించి'** అనే క్రియలపై ద్వితీయావిభక్త్యర్థంలోనూ, **'అను', 'క్షమించు', 'కరుణించు'** అనే క్రియలకు చేరి తృతీయావిభక్త్యర్థంలోనూ, **'అలుగు', 'అగు' 'కలుగు', 'కరుణించు, 'సైపు'** వంటి క్రియలకు చేరి సప్తమీ విభక్త్యర్థంలో ప్రవర్తిల్లటం ఇద్దరిలోనూ కనిపిస్తుంది.

తెలుగు వ్యాకర్తలు కాలాన్నిబట్టి తమ వ్యాకరణాలలో వివిధ విభక్త్యర్థాలలో విధించిన ప్రత్యయాలను తెలియజెప్పాను. అలాగే ప్రత్యయాల లాగే ప్రవర్తిల్లే వివిధ పదాలను కూడా చూపాను. ప్రాచీన వ్యాకర్తలుగానీ, అర్వాచీన వ్యాకర్తలుగానీ చెప్పని **'అర్థంబు', 'ఎడ'** వంటి పదాలు వివిధ విభక్త్యర్థాలలో కవులు ఎలా ప్రయోగించారో తెలియజెప్పాను.

నన్నయ కారకాన్ని, ఆరణ్యపర్వశేషంలోని కారకాన్ని, ఎఱ్ఱన మూడు రచనల్లోని కారకాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తే నన్నయ కాలానికి లేని సంబోధనార్థంలో **'ఓ', 'ఓరి', 'ఓసి'**, కర్మార్థంలో **'కూర్చి', 'గుఱించి'**, కరణార్థంలో **'తోడుత', 'తోడుతోన్', 'తోడులు', 'తోడ్తోడ'**, సంప్రదానార్థంలో **'కొఱకు'** వంటివి నన్నయలో లేకపోవడం ఎఱ్ఱనలో, ఆరణ్యపర్వశేషంలో మాత్రమే కనిపిస్తున్నాయి. సంప్రదానార్థంలో **'తదర్థము'**, అపాదానార్థంలో **'నిమిత్తము', 'వలన'**కు **'చేసి'** అనుప్రయుక్తంగా రావటం వంటివి నన్నయలో మాత్రమే కనిపించే విశేషాలు ఎఱ్ఱనలో, ఆరణ్యపర్వశేషంలో కనబడవు. సంప్రదానార్థంలో **'కై'** నన్నయలో ఒక ప్రయోగమే కనబడుతుంది. ఎఱ్ఱనలో, ఆరణ్యపర్వశేషంలో ఎక్కువగా ఉన్నాయి. **'పొంటె'** నన్నయలో ఎక్కువగా ఎఱ్ఱనలో స్వల్పంగా, ఆరణ్యపర్వంలో అసలు కనబడవు. **'అర్థంబు'** నన్నయలో తక్కువగా, ఎఱ్ఱనలో ఎక్కువగా కనబడుతున్నాయి. **'పట్టి'** నన్నయలో విరళం, ఎఱ్ఱనలో అధికం. 'కోలెన్' నన్నయలో అధికం, ఎఱ్ఱనలో, ఆరణ్యపర్వశేషంలో చాలా విరళం. **'కతన'** నన్నయలో అధికం, ఎఱ్ఱనలో విరళం. అధికరణార్థంలో **'ఎడ'** నన్నయలో తక్కువగా ఎఱ్ఱనలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ విషయాలన్నిటిని పరిశీలించినపుడు నన్నయకు, ఎఱ్ఱనకు ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. అలాగే నన్నయ కారకానికి, ఆరణ్యపర్వశేషంలో ఉన్న కారక విధానానికి కూడా ఎంతో వ్యత్యాసం కనబడుతుంది. ఆరణ్యపర్వశేషంలోని కారకం, ఎఱ్ఱన రచనల్లోని కారక విధానం ఒకేవిధంగా కనబడుతుందని తెలియజేస్తూ, ఈ వ్యాసం ఇప్పటివరకు ఆరణ్యపర్వశేషంపై జరిగిన భాషాపరిశోధనలకు చేర్పుగా భావిస్తున్నాను.

**ఆధారగ్రంథాలు**


1. అచ్యుతరామశాస్త్రి ఓగేటి, ఎఱ్ఱన అరణ్యపర్వశేషము, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ప్రెస్, హైదరాబాద్, 1989
2. రామకృష్ణారావు అబ్బూరి, వేంకటావధాని దివాకర్ల (సం.), నన్నయ పదప్రయోగ కోశము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1960
3. రామచంద్ర వి., ఎఱ్ఱాప్రెగడ, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1988
4. వేంకటేశ్వర్లు బూదాటి, సంప్రదాయ వ్యాకరణాలు, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2014
5. శ్రీనివాసరావు ఎం, బాల ప్రౌఢవ్యాకరణ కరదీపిక, సూర్యనారాయణ గ్రంథమాల, రాజమండ్రి, 1976

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 11 హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# జానపద వాఙ్మయ బ్రహ్మ - ఆచార్య బిరుదురాజు రామరాజు

డా. శ్రీమంతుల దామోదర్, ఫోన్ : 998 913 913 6

తెలుగులో జానపద విజ్ఞాన పరిశోధనకు అంకురార్పణ చేసిన జాతీయాచార్యులు బిరుదురాజు రామరాజు గారు. వీరు 1925 ఏప్రిల్ 16వ తేదీన వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో జన్మించారు. విద్యార్థి దశలో అతనికి రాజకీయ అవగాహన కల్పించిన కాళోజి నారాయణరావు, హవాగ్రీవాచారి, జమలాపురం కేశవరావు, ఎమ్మెస్ రాజలింగం గార్లతో స్టేట్ కాంగ్రెస్ రాజకీయాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చైతన్య శీలిగా పనిచేశారు.

1952లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగు విభాగంలో మొట్టమొదటిసారిగా మౌఖిక సాహిత్యాన్ని పరిశోధన చేయడానికి **"తెలుగు జానపద గేయ సాహిత్యం"** అనే పరిశోధనాంశం తీసుకుని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించి, తెలుగు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో జానపద పరిశోధనకు మార్గదర్శకులు అయినారు. జానపద విజ్ఞానం పైన పరిశోధన చేస్తున్న సాహితీవేత్తలకు, మేధావులకు, పరిశోధకులకు తెలుగు జానపద గేయ సాహిత్యం గ్రంథం నేటికీ మూల గ్రంథముగా ఉపయోగపడుతున్నది.

బిరుదురాజు రామరాజు కంటే ముందుగా మౌఖిక జానపద సాహిత్యాన్ని సేకరించి ముద్రించిన వారిలో శ్రీ నేదునూరి గంగాధరం గారు, శ్రీ శ్రీపాద గోపాలకష్ణమూర్తి గారు ప్రథములుగా చెప్పవచ్చు. జానపద విజ్ఞానాంశాలను గ్రామ గ్రామాన సేకరించి భద్రపరిచారు. కానీ విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనాత్మకంగా కృషి చేసిన వారు ఆచార్య బిరుదురాజు రామరాజు గారు మాత్రమే. వీరు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో కూడా గ్రంథాలు వ్రాసి బహుభాషా కోవిదులుగా పేరు సంపాదించుకున్నారు.

రామరాజు గారి కలం నుండి కొన్ని వందల గ్రంథాలు వెలుగు చూశాయి. వీటిలో జానపద సాహిత్య సంబంధ గ్రంథాలతో పాటు తెలుగేతరులకు జానపద సాహిత్యం మీద అభిరుచి పెంచేందుకు ఆంగ్లంలో కూడా రచనలు చేశారు. Folklore of Andhra Pradesh, Folk tales of Andhra Pradesh, Glimpesis of Telugu folklore, Muharram folk songs in telugu, South Indian folk songs వంటివి ప్రధానమైనవి. వీటితోపాటు విజ్ఞానసర్వస్వాల్లో కూడా విశేష కృషి చేశారు. జానపద సాహిత్యము–కళలు అనే అంశం పైన 350 పైగా రచనలు చేశారు. అందులో తెలంగాణ పిల్లల పాటలు, వీరగాథలు, తెలంగాణ పల్లె పాటలు, జానపద రచనలు, గ్రామ సంస్కృతి, జానపద కళలు, పదసాహిత్యము,



పరిశోధనాత్మక వ్యాసాలు, జానపద విమర్శ వంటివి ఉన్నాయి. వీటితోపాటు ప్రముఖ వ్యక్తుల గురించిన వ్యాసాలు, తాళపత్ర గ్రంథాల సేకరణ మరియు పరిష్కరణలో కూడా బిరుదురాజు రామరాజు గారు విశేష కృషి చేశారు. ప్రసిద్ధి చెందిన "చరిత్రకెక్కని చరితార్థులు" గ్రంథంలో 34 మంది కవుల ప్రస్తావన గురించి విపులంగా వివరించారు. అదేవిధంగా తెలుగు వీరుడు, సొరకాయల స్వామి చరిత్ర, తెలుగు సాహిత్యోద్ధారకులు వంటి గ్రంథాలను కూడా రాశారు. రామరాజు గారు పై అంశాలే కాకుండా ఆధ్యాత్మిక భావనతో కూడిన రచనల్లో "శ్రీ సత్య సాయిబాబా" మానవీయతను స్తుతిస్తూ 20కి పైగా రచనలు చేశారు. అదేవిధంగా దైవభక్తి పరులైన తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న వారి కృషిని గురించి తెలిపే "ఆంధ్ర యోగులు" పేరుతో ఏడు సంపుటాలను వెలువరించారు. ఈ గ్రంథానికి ఆచార్య బిరుదురాజు రుక్మిణి గారు కూడా భాగస్వాములైనారు.

# వేడుకోవడమేనా...

దుప్పట్లోని నిద్రను సుతి మెత్తగా తొలగించా
కంటి తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి
గతం, భవిష్యత్తు ఒకే రకంగా గడియారం
రాత్రి కప్పుకున్న నల్ల గొంగడి తొలగించలే
గోడకున్న వెలుతురు బిడ్డ కిచకిచలు
అక్షరాలతో నా వేడుకోలు మొదలైంది

పదాల సీతాకోకచిలుకలు
కాగితంపై వాలడానికి వెనుకంజ
తొవ్వలోకి రాని ఆలోచనలు
కొట్టివేతల గీతం పాడుతున్న కలం
నన్ను నేను సరి చేసుకోవడానికి వేడుకోలు

బానిస దుస్తుల్లోంచి బయటకు రాని శరీరం
పాచిపట్టిన పదజాలంతో నెట్టుకొచ్చే ప్రయత్నం
ఎవరో విసిరిన ఎంగిలి మెతుకులతో గడపడం
ఛీకొట్టి పక్కకు జరిగితే
కొత్త దారి వేసేటప్పుడు కొంత తడబాటు
పడిపోకుండా బ్యాలెన్స్ చేసుకోవడం
పడిపోతే తొక్కుకుంటూ వెళ్లే కఠినాత్ములే అధికం

వేడుకోలుకు వీడ్కోలు పలికి
చదరంగంలో పదాల పావులు కదిపి ఎత్తుగడ
అక్షరం పొల్లు పోకుండా నిఘా
భావాలు బురదలో పడకుండా జాగ్రత్త
రాతలెక్కువ కొట్టివేత తక్కువ
ధైర్యంగా కదులుతున్న కలం

తప్పటడుగులు, తప్పుటడుగుల కాగితం చింపేసి
తప్పని అడుగులతో ధీమా
అక్షరాలిప్పుడు కాలాన్ని చదును చేసే చినుకులు

**కొమురవెల్లి అంజయ్య**
**సిద్ధిపేట, ఫోన్ : 984800 5676**

ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో జానపద గేయాలను సేకరించి "త్రివేణి" పేరుతో 1960లో ప్రచురించారు. దీనికి బిరుదురాజు రామరాజు గారు, నేదునూరి గంగాధరం గారు, కృష్ణశ్రీ గారు, దొణప్ప గారు సంపాదకులుగా ఉన్నారు. బిరుదు రాజుగారు 1974లో నాయుని కృష్ణ కుమారి గారితో కలిసి **"జానపద గేయాలు - సాంఘిక చరిత్ర"** అనే గ్రంథాన్ని ప్రచురించారు. ప్రాచీన గ్రంథాల సేకరణతో పాటు వాటిని పరిష్కరించడంలో కూడా రాజుగారు సిద్ధహస్తులు. రామరాజు గారు సంస్కృతంలో పిహెచ్.డి చేసి ఎన్నో సంస్కృత గ్రంథాలను పరిష్కరించారు. వాటిలో వసుచరిత్ర, శ్రీకృష్ణరాయల జాంబవతీ పరణయం, శృంగారశేఖర భాణము, తిరుమల బుక్కపట్నం శ్రీనివాసచార్య వెంకటాచార్య విజయ వైజయంతి వంటి కావ్యాలను పరిష్కరించారు. వీటితో పాటు తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో అనువాద కావ్యాలు కూడా వచ్చాయి. ఉర్దూ తెలుగు నిఘంటువు నిర్మాణానికి కూడా కృషి చేశారు.

ఆచార్య బిరుదురాజు రామరాజుగారు చేసిన విశేష కృషికి గుర్తింపుగా 1992లో బూర్గుల అవార్డు, 1994లో తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 1995లో జాతీయ పరిశోధన ఆచార్యులుగా భారత ప్రభుత్వం నియామకం, 1999లో సురవరం ప్రతాపరెడ్డి అవార్డు, 2000 సంవత్సరంలో తెలుగువారి ఆత్మగౌరవ పురస్కారం, 2001లో సిద్ధార్థ కళాపీఠం అవార్డు, 2002లో శివానంద ఉత్తమ పౌర పురస్కారం, 2003లో రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 2003లో తెలుగు ఫైన్ ఆర్ట్ సొసైటీ న్యూ జెర్సీ అవార్డు, 2003లో డాక్టర్ జ్యోతిరావు కె.వి.రావు అవార్డు, 2006లో అజోవిభో కందాళం ఫౌండేషన్ అవార్డులు పొందారు. ఎన్నో గ్రంథాలకు పీఠికలు రాశారు, సంపాదకులుగా వ్యవహరించారు.

తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద గిరిజన విజ్ఞాన పీఠం ఏర్పాటుకు అహర్నిశలు కృషి చేసిన మహానుభావులు. జానపద విజ్ఞానం అంశాలపైన సలహాలు, సూచనలు, సేకరణ మెలకువలను తెలియజేస్తూ యువ పరిశోధకులకు ప్రోత్సహించేవారు. ఆచార్య బిరుదురాజు రామరాజు గారు జానపద విజ్ఞానంలోని పలు అంశాలకు సంబంధించిన అరుదైన పుస్తకాలను జానపద గిరిజన విజ్ఞాన పీఠానికి బహుకరించిన మహోన్నత వ్యక్తిగా కీర్తించబడుతున్నారు. అందుకే ఈ మహనీయుడిని స్మరించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందనేది నా వ్యాస ముఖ్య ఉద్దేశం.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 (13) హైదరాబాద్ ఏప్రిల్ : 2023

బందారం కథలు 17

# గడీవాసం

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148

**"నువ్వు నూరు జెప్పు. వెయ్యి జెప్పు. పార్టీని నాశెనం చేస్తున్నదే ఇందిరాగాంధి. ఇంగ్లీషోల్లను ఎల్లగొట్టిన పార్టీపేరు కరాబ్ చేస్తున్నది. నెహ్రూ జమాన ఎట్లుండె. ఇప్పుడెట్లున్నది. పార్టీ పేరునే గాదు. తండ్రి పేరు కూడా చెడగొడుతున్నది. ఇందిరమ్మంటే ఇందిరమ్మ. కాంగ్రెస్‌ను నాశనం చేనుటానికి మోపయింది".**



"అది గాదు రావుసాబ్. పేదొల్ల మీద ప్రేమతోని చానా పనులు జేస్తంది. అయెతదుకు ఆడామె గావొచ్చు గని, ధైర్యంగ నిర్ణయాలు తీసుకుంటున్నది. రాజ భరణాల రద్దు జేసెతందుకు ఎన్ని గుండెలు కావాలె. రాజరికం పోయనంక సుత రాజుల్ని కూసుండబెట్టి మేపుడేంటిది? ప్రజల సొమ్ము తీస్కపొయ్యి రాజులకు గట్టుడేంది! నెహ్రూసాబ్ జెయ్యలేని పనిని ఇందిరాగాంధి జేస్తున్నది. అందరం సపోట్ చెయ్యాలె. బ్యాంకుల జాతీయీకరణ తక్కువదా? ఎంత పెద్ద పని. మనకు అర్తమైతలేదు గని – ప్రైవేట్ బాంకుల జాగల గౌరెమంట్ బ్యాంకులు తెచ్చుడు చిన్న పనా? ఎంత గుండె కావాలె. గుండెధైర్యమంటె ఇందిరమ్మదే".

"గదే – జెప్తున్న మీ అసోంటోల్లు జెయ్యంగ చెప్పుడు మాటలు పట్టుకోని దేశాన్ని నాశెనం చేసెతందుకు తయారయింది. లేకపోతే కమినిస్టోల్ల మాటలు పట్టుకునుడేంది? డాంగె చెప్పినట్టల్ల ఆడుతంది. అది కాంగ్రెసెందుకయితది. కమినిస్టు. దాని ముఖం గాల"

"నువ్వు దొరవు గనుక గట్ల మాట్లాడుతున్నవు. మీ పార్టీ కాంగ్రెస్ పార్టీ మీ నాయకురాల్ని నువ్వే ఎత్తేస్తె ఎట్లా?"

"మీ కమినిస్టోల్లు ఎత్తుకుంటండ్రు గద. మేం ఎత్తేయ్యక తప్పదు మరి. గరీబ్ హటావో అంటది. భూములు పంచుతనంటది. ఈ ముండతోని అయితదా! తమాషనా. భూ సంస్కరణలంటే – ఏమనుకుంటందది. ఉంటదా. పదవిలకేల్లి దించెయ్యం?"

"నిజంగనే. భూ సంస్కరణలు మాటలు గాదు. మీ దొరలు భూములు పంచనిస్తరా – పంచనిస్తె భూసాములెట్లయితరు? దొరలెట్లయితరు. దించుతరట. ప్రధానమంత్రి పదవిలకెల్లి దించుతరా? ఏదో మీరే కూసుండ వెట్టినట్టు. ప్రజలు ఎన్నుకున్నరు. ప్రజలు ఓట్లేస్తె ప్రధానమంత్రయింది గని – దొరలేస్తె గాలె".

"ఏ బాల్‌రెడ్డి ఎక్కువ మాట్లాడుతున్నవు. నువ్వేస్తె అయిందా? నువ్వేసినవా అసలు? నువ్వు – నీ అసోంటోల్లు – నీ పేదోల్లు – కమినిస్టోల్లకేసిండ్రు గద – మేమే కాంగ్రెస్‌ను గెలిపిచ్చినం. మా అసోంటొల్లు ఓట్లెస్తెనే ప్రధానయింది. ఎన్ని పైసలు పెట్టుంటం – మనూరి సంగతే తీస్కో మేం తాగిపిస్తె ఓట్లేసిండ్రు. ఉత్తగేసిండ్రా? అన్ని ఊర్లల్ల గంతే. దొరలో, పటేండ్లో గదా పైసలిచ్చింది. తాగిపిచ్చింది. సుద్దపూసలా ప్రజలు? తాగి ఓట్లేసిండ్రు."

"సరిగ్గ మాట్లాడినవు. దొర అనిపిచ్చుకున్నవు. ఇప్పుడైన ఒప్పుకున్నవు. తాగిపిచ్చ ఓట్లేయించుకున్నమని ఒప్పుకున్నవ్. అయితే ఇందిరాగాంధి మంచిపేరు తెచ్చుకోవాలనుకున్నది. ప్రజలకు మేలు చెయ్యాలనుకుంటున్నది. చరిత్రల ఆమె పేరుంటది. మీ దొరలేంది. భూములు కబ్జా పెట్టుకున్నరు. పంచుమనంగనే జడిలొచ్చినట్లయి తంది?"

"ఇగ జాలు తియ్యిండ్రి. ఏం చర్చలు. మీరు కూసుండె పెట్టేటోల్లు గాదు. దించెటోల్లు గాదు. రోజు మొఖాలు జూసుకునెటోల్లం. అక్కెరకు రాని ముచ్చట్లు మాట్లాడుకోని ఏం లాభం – ఊకోండ్రి. పార్టీలు ఏరే అయినా దోస్తులు గద – ఎందుకంత గనం అనుకుడు" ఏదన్న అక్కెరకొచ్చే ముచ్చట మాట్లాడుండ్రి".

హనుమంతరావు బాల్‌రెడ్డిల నడుమ వేడెక్కుతున్న చర్చల్ని శాంతపర్చాడు నాగిరెడ్డి. వాల్లిద్దరు రెండు పార్టీలు. ఒకరు కాంగ్రెసయితె మరొకరు కమ్యూనిస్టు. రాజకీయాల్లో పడితే నిప్పు రాజుకుటుంది. దోస్తాన్ల పడితే బంధుత్వం రాజుకుంటుంది. బావా బావా అని పిలుచుకుంటారు. ప్రతిరోజు కలుసుకుంటారు. పరామర్శించుకుంటారు. నడుమ నడుమ తగువుపడతారు. తగవు

పడబోయినప్పుడు నాగిరెడ్డో, రంగయ్య సేటో సర్దుతుంటారు. ఇంతలో చాయ గ్లాసులు పట్టుకొని ఇస్తుంది ఆశవ్వ. ముసిముసి నవ్వుల్తో ముగుస్తుందా పూట.

వరుగుల హనుమంతరావును గడీల హనుమంతరావు అని కూడా పిలుస్తారు. ఎత్తైన బురుజు గోడలతో గడీ ఉసూరుమంటున్నది. మనిషెత్తు రాతి కట్టడం, మీద రెండు నిలువులెత్తు ఒండ్రుమట్టి గోడ. మూడు దిక్కులా పెద్దగోడలు. గోడలమీద మొలిచిన పొడవాటి గడ్డి. అది పాడువడుతున్న పాతగడి అని చెప్పకనే చెపుతుంది. దానికి ముందుభాగం ఊరి బజార్ల కంటె ఎత్తైన తొవ్వ – సగం కూలిన ప్రహరి గోడలు. నడుమ నిలిచి ఉన్న ద్వారం – తలుపులుండవు. దాటి కొంచెం ముందుకు వెళితే మరో పెద్ద వాకిలి. పెద్దర్వాజ. లోపల పెద్ద వసారా – వసారా హాలులో కూచునేటందుకు వలసినన్ని కుర్చీలు. ఒకటిరెండు బెంచీలు. నడుమ ఒక ఆరాం కుర్చీ – ఆ ఆరాం కుర్చీలో కూర్చునేది ఒక్కడే. నడీడు మనిషి. ఆయనే హనుమంతరావు. అప్పుడప్పుడు ఊరి పెద్దలు వచ్చి పలకరించి ముచ్చటించి పోతుంటారు. పొద్దునా సాయంత్రం రెండు పూటలా హనుమంతరావుకు చాయ అలవాటు. ఆ వేళకు అక్కడ చాయ దొరుకుతుందని కూడా వొచ్చి కూచుంటారు కొందరు.

హనుమంతరావు తాత వరుగల రామచంద్రరావు. నూటాఇరవై ఏళ్ల కిందట ఆ వూరికి పట్వారిగా వచ్చాడు. రావటం రావటంతోటే బందారం భూముల పరిస్థితి గమనించాడు. చేర్యాల దేశముఖ్‌లకు పన్ను చెల్లించి మూడువేల ఎకరాల పట్టేదారు అయినాడు బందారం దొరగా స్థానం పొందాడు. ముగ్గురు కొడుకులకు తలా వెయ్యి ఎకరాలు పంచి పట్టా చేయించాడు. హనుమంతరావు తండ్రి కాలంలో వెయ్యి ఎకరాలు ఆరువందల ఎకరాలకు తగ్గిపోయింది. అన్న వెంకటేశ్వర రావు హయాంలో మరింత కరిగిపోయి మూడువందల ఎకరాలు హనుమంతరావు చేతికొచ్చింది. కూచుని తింటే కొండలైనా కరిగిపోయినట్టు భూములు కరిగిపోతూ వచ్చాయి.

హనుమంతరావుకు చిన్నప్పుడే పెళ్లయింది. భార్య ఆపురానికి వచ్చేనాటికే హనుమంతరావుకు బోగం రమామణితో ప్రేమ వ్యవహారం నడుస్తున్నది. మాన్పించటానికి భార్య ఎంతో ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చూస్తూ చూస్తూ ఆమె సున్నిత హృదయం తట్టుకోలేకపోయింది. క్రమక్రమంగా కాపురంపట్ల విముఖత పెంచుకొని హనుమంతరావు జీవితం నుంచి దూరంగా వెళ్ళిపోయింది. ప్రేమ వ్యవహారం నడిచినా రమామణితో పెళ్ళి సాధ్యపడలేదు. కొంతకాలానికి రమామణి కుటుంబం పట్నం తరలిపోవటం వల్ల హనుమంతరావును వియోగం బాధించింది. మందు అలవాటు చేసుకోలేదు గాని సిగరెట్ అలవాటయింది. పేకాట అలవాటయింది. ఇంట్లో పనిచేసే ఆశవ్వతో అనుబంధం మొదలయింది.

కాపురం కరిగిపోయింది కనుక హనమంతరావుకు తమ్ముడు నారాయణరావే స్వయంగా వంటచేసి పెడతాడు. మరో తమ్ముడు క్రిష్ణారావు మిగతా వ్యవహారాలు చూస్తాడు. భూమంతా తన గుప్పిట్లో పెట్టుకొని పంచి ఇవ్వకుండా గడుపుకొస్తున్నందుకు అన్న పట్ల క్రిష్ణారావుకు అమితమైన కోపం. తన చేతి వంట తింటున్నందుకైనా తప్పక తన వాటా పంచి ఇస్తాడనే నమ్మకంతో పాటు ఖర్చులు సర్దుతున్నందకు అన్న పట్ల నారాయణరావుకు అంతే అభిమానం. హనుమంతరావు భోజన ప్రియుడు. రుచులన్నీ ఇష్టం. మనసెరిగి వంట చేస్తాడు గనుక తమ్ముడి ప్రేమంటే ఇష్టం. శాకాహారం తప్ప మాంసం ముట్టడు. మద్యం ముట్టడు. నెయ్యి లేందే భోజనం ముట్టడు. తినేది కొంచెమే అయినా నాలుక నచ్చందే నడువదు. సాయంత్రం అయిందంటే చిరుతిళ్లు రావాల్సిందే. మిర్చీలన్నా, బుడాలన్నా, బజ్జీలన్నా మనసు కొట్టుకుంటుంది. తమ్ముడికి చేసే ఓపిక లేకపోతే జగదాంబ దుకానం నుంచి తెప్పించాల్సిందే. ఎందరుంటే అందరికి. తిండి సుఖం కిందికి భూములు కరిగి పోతాయంటే చాలామంది నమ్మకపోవచ్చు గానీ దొరల భూములు చాలావరకు అట్లా కరిగిపోయాయి. హనుమంతరావు చేతిలో మూడునూర్ల ఎకరాలు నూరు ఎకరాల కిందికి తరిగిపోవటం ఆశ్చర్యమే.

ఆశవ్వతో హనుమంతరావు సంబంధం ఊరంతా పొక్కింది. చాటుమాటుగా నడిచే వ్యవహారం క్రమంగా బయటపడి బాహాటంగా మారింది. హనుమంతరావు దొర వ్యవసాయం పనులు ఆశవ్వ కొడుకులచేతికి వచ్చాయి. ఎంత ఎండుతుందో, ఎంత పండుతుందో, ఎంత వస్తుందో ఆశవ్వకు తప్ప హనుమంతరావుకు కూడా తెలియని స్థితి వచ్చేసింది. తమ్ముళ్ల చేతికి చిల్లి గవ్వ కూడా చిక్కటంలేదు. తమ్ముళ్లిద్దరికీ కోపం వచ్చింది. ఇద్దరూ మాట్లాడకున్నారు. ఇట్లాగే జరిగితే తమ కుటుంబాలు బజారున పడాల్సి వస్తుందని బాధపడ్డారు. అన్నకు పిల్లల్లేరు గనుక తమ పిల్లల భవిష్యత్తు గురించి ఇంచు గూడా ఆలోచించడం లేదని అర్థమైంది. ఏదో ఒకటి తేల్చుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నారు.

క్రిష్ణారావు ఆరోజు సర్కారు సారా నాలుగు పాకెట్లు పోసుకున్నాడు. అంత భూమి ఉండి తన ముగ్గురు పిల్లలు, భార్య పస్తులు పడుకోవాల్సిన పరిస్థితికి ఆవేశం పొంగుకొచ్చింది. అన్న ఒక్కడుండే సమయం కోసం చూస్తున్నాడు.

హనుమంతరావు రాత్రి భోజనం చేసి సిగరెట్ కాలుస్తున్నాడు. ఆరాం కుర్చీలో ప్రశాంతంగా ఉన్నపుడు పిడుగు పడింది. క్రిష్ణారావు నోటినుంచి సారా గుప్పుమంటుంది. తమ్ముడు తాగుతాడని తెలుసు. తాగి ఎప్పుడూ ఎదురు రాలేదు. ఇప్పుడు సరాసరి ముఖాముఖి చేరేసరికి ఉలికిపడ్డాడు.

“అన్నా నువ్వు చేస్తున్న పని బాగా లేదు. అన్నవని ఊకున్నాకొద్ది

మా పని సున్న జేస్తున్నవు. ఆశవ్వ ఎవలని ఎవుసం ఆమెకు అప్పజెప్పినవు. భూముల మీద మాకు హక్కు లేదా? మమ్ముల అడుగకుండ భూములెట్ల అప్పజెప్పినవు?" గర్జించాడు క్రిష్ణారావు.

హనుమంతరావుకు సిగిరెట్ పొగ గొంతుకడ్డం పడింది. కోపం నషాళానికెక్కింది. దగ్గాడు. సరాయించాడు. ఏంరా, ఏం మాట్లాడు తున్నవు. నువ్వు ఎవుసం జేస్తవా – ఎవుసం పని జెయ్యిస్తదా నీ మొఖానికి. బాయి బంధం తెలుసా? తెలిసినోళ్లకు, చేసెటోండ్లకు ఇయ్యకపోతే తిని తాగెటోనికి ఇస్తరా".

"అన్నా నువ్వట్ల మాట్లాడితే ఈ యింత మర్యాద గూడ ఇయ్య. పోనియ్యని ఊకుంటె పొక్కలకెట్ల వొస్తది? మా భూమి మాకు పంచియ్యి. ఎవుసం జేసుకుంటో అమ్ముగుంటమో మా ఇష్టం. నువ్వేమో ఉద్ధరిచ్చినట్టు మాట్లాడ్తున్నవు. దొరల భూమి సుద్దరిదాని చేతుల పెట్టినవు – గిదేనా నీ ఉద్ధారకం?"

"అరేయ్ – నోటికేది వొస్తే అదేనా మాట్లాడుదు? అడ్డగోలు తాగుడు, అడ్డగోలు వాగుడు" అని కుర్చీలంచి లేచాడు.

"ఏం కొడ్తవా – కొట్టు – మీదికొస్తున్నవు. ఉన్నదున్నట్టు అంటె ఎవనికైనా ఉలికిపాటే. వతది – ఆశి – ఆశి – అదునా ఆడ్డి – సుద్దరిది. అదెట్ల జెప్తె అట్ల ఆడ్తున్నవు. వంశం ఖదురు నావెనం జేస్తున్నవు".

హనుమంతరావు తట్టుకోలేకపోయాడు. ఉరికొచ్చి క్రిష్ణారావు చెంప చెళ్లుమనిపించాడు. నారాయణరావు చప్పుడుకు అదిరిపడి ఇవతలికి వచ్చాడు. తమ్ముని బతిమిలాడి లోపలికి లాక్కెళ్లాడు.

వారం రోజుల దాకా వాతావరణం కుదుటపడలేదు. వారం తర్వాత గడీ ప్రశాంతమైంది. క్రిష్ణారావు అప్పు చేసుకుంటూ మరింత తాగుతున్నాడు. నారాయణరావు రోజూ దైవప్రార్థనలో ఎక్కువసేపు గడుపుతున్నాడు. ఒక్కసారైనా గడిమైసమ్మకు మొక్కుతున్నాడు. కొన్నిరోజుల తర్వాత నారాయణరావు కూడా అన్నకు అనునయంగా చెప్పి చూడాలనుకున్నాడు. భోజనం విస్తట్లో వడ్డించి పక్కన కూచున్నాడు హనుమంతరావు రుచులు ఆస్వాదిస్తూ భోంచేస్తున్నాడు. అదే అదనుకుని నారాయణరావు నోరు తెరిచాడు.

"అన్నయ్యా, ఊరంతా తలా ఒకరకంగా మాట్లాడుకుంటున్నారు. నా భార్య కూడా పిల్లల్ని తీసుకొని వాళ్ళింటికి వెళ్ళిపోయింది. నేనుచెపుతున్నానని అనుకోకు. గుట్టుగా నడిచిన వ్యవహారం గుట్టుగానే నడిపించుకో. బాయి, ఎవసాయం వ్యవహారాలు మరెవరికైనా అప్పగిస్తె మంచిది".

"నారాయణరావు, నువ్వుకూడా జెప్పెతందుకు తయారైనావా? నీకు ఉండ బుద్ధయితే ఉండు. లేకపోతే నీ భార్యతో పాటు నువ్వు కూడా వెళ్ళు. నా అవస్థ ఏదో నేను పడతా. నాకు బుద్ధి పుట్టినప్పుడు భూమి పంచి ఇస్త. అప్పటివరకు నోరు మూసుకొని పడి ఉంటే మంచిది".

నారాయణరావు మరి మాట్లాడలేదు. అన్నకు భార్యలేదు. ఆయన అవస్థ అర్థం చేసుకోగలడు. దర్జాగా బతికిన మనిషి దయనీయంగా మారిన స్థితి అంతా తెలుసు. నిదానంగా ఆలోచించాడు. తమ్ముడు, తాను ఒక నిర్ణయానికి వచ్చారు. ఆశవ్వను ఇంటికి రావద్దని చెప్పారు. మరో పనిమనిషిని మాట్లాడారు.

హనుమంతరావుకు జీవితంలో చీకటి కమ్ముకుంటున్నట్టు అనిపించింది. ఎన్నోరోజుల నుంచి చీకటి వెంటాడుతున్నా ఏదో వెలుగు కొంత కనిపిస్తూ వచ్చింది. ఆశవ్వను పని మాన్పించేసరికి అయోమయంగా తోచింది. అంతా చీకటనిపించింది. నిజమే. ఊరంతా అనుకుంటున్న మాట నిజమే. అనుకునేవాళ్లెవరైనా లోపలి బాధను పంచుకుంటున్నారా? ఉన్న చిన్న ఆనందం అదొక్కటే. అదీ వదులుకోవాల్నా? ఒంటరితనంతో ఒడిసిపోవలసిందేనా తాను – రకరకాలుగా ఆలోచించాడు.

సాయంత్రం, వొచ్చిపోయే వాళ్లు కూడా మానేశారు. ఏదో ధైర్యం శరీరాన్ని మనసునూ ఆవహించింది. అది ప్రేమా, మోహమా, అనుభవమా ఏదైనా కానీ చిన్నదైనా, పెద్దదయినా వదులుకోవద్దు. అవసానంలో అశాంతి వొద్దు.

సూర్యుడు ప్రశాంతంగా వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాడు. తానూ ప్రశాంతంగా వెళ్లాలనుకున్నాడు. స్నానం చేశాడు. ఎప్పటిలాగా ధోతి, లుంగీలా చుట్టుకున్నాడు. తెల్లటి నెహ్రూలాల్చీ వేసుకున్నాడు. తెల్ల వెంట్రుకల్ని, తెల్ల మీసాలకు నూనె రాసుకున్నాడు. సెంటు పూసుకున్నాడు. బయటకు అడుగులు వేశాడు. ద్వారం దాటాడు. గడీ దాటాడు.

హనుమంతరావు ఆశవ్వ ఇంటికి చేరుకున్నాడు. ఆ ఆడంతా ఆశ్చర్యపోయింది. వాకిలి ఆహ్వానించింది. కడపలో ముగ్గు కనిపించింది. **"దొరొచ్చిండు. దొర... దొర. అవ్వా...."** పిలుచుకుటూ ఇంట్లోకి ఉరికాడు ఆశవ్వ కొడుకు. మసి చేతుల్తో బయటకొచ్చింది ఆశవ్వ. **"అయ్యో దొరా...దొరా...నువ్వే వచ్చినవా".**

చేతులు చీరకు తుడుచుకున్నది. చీర కొంగుతో అరుగు తుడిచింది. పాత చీర తెచ్చి అరుగు మీద పరిచింది. దొర అరుగు మీద కూచున్నాడు. చిన్నపిల్లవు వచ్చి చూసి వెళుతున్నారు. ఆడవాళ్ల గుసగుసలు పెట్టుకుంటే ముక్కు మీద వేలేసుకుంటున్నారు. పిల్లవాడిని తోలించి మిర్చీలు, బజ్జీలు తెప్పించింది. దొర ఇష్టంగా తిన్నాడు. దోమలు కుడతాయని లోపలికి పిలిచింది. నులక మంచం వేసింది. చెయ్యి పట్టుకొని కూచోబెట్టింది. చీకటి చిక్కబడిం తర్వాత తిరిగి గడీకి చేరుకున్నాడు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6

హైదరాబాద్ ఏప్రిల్ : 2023

హనుమంతరావు ప్రతి సాయంత్రం ఆశవ్వ ఇంటికి వెళతాడు. అరుగుమీద కూర్చుంటాడు. ఆశవ్వ మిర్చీలు తెప్పిస్తుంది. కడుపారా తింటాడు. మనసారా సేద తీరుతాడు. చీకటి పడేదాకా గడిపి గడీ చేరుకుంటాడు.

క్రమంగా భూ సంస్కరణల ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. సీలింగుకు మించి భూములుంటే ఇతరులకు పంచాలి. పంచకపోతే సర్కారు స్వాధీనం చేసుకుంటుందనే భయం గడీ దాకా చేరింది. హనుమంతరావు తన పేరిత ఉన్న పట్టా భూమిని మూడు భాగాలు చేశాడు. తన వాటా భూమిని మళ్లా మూడు భాగాలు చేశాడు. తమ్ముళ్లకు చెరొక భాగం, పోగా మిగతా మూడోభాగం ఆశవ్వ కుటుంబానికి రాసిచ్చాడు.

తన కుటుంబం తమ్ములా? తన కుటుంబం ఆశవ్వా? హనుమంతరావు కరణం దొరయితే ఏమిటి? ఆశవ్వ పనిపాటల కులమయితే ఏమిటి? కుదిరింది ఇద్దరికి. ఆనందానికి చిన్నా పెద్దా ఏమిటి? ఆనందం ఆనందమే. తనకు నచ్చింది మనసిచ్చాడు. భూమిచ్చాడు. జీవితమిచ్చాడు.

ప్రతిష్టా? ఎండుటాకులా భూమిమీద రాలిపడి వెలవెల పోతున్నది.

# నీ గుండె గుడి కావాలి...





పెరుగుతున్న కాలుష్యం
తరుగుతున్న జీవితాలలో
ప్రేమానుబంధాలను
పదిల పరచుకోవాలి
ఆత్మీయత, అనురాగాలకు
నీ గుండె గుడి కావాలి

హితులకు, స్నేహితులకు
ఆత్మబంధువులకు
అభిమానులకు
మనసులో చోటివ్వాలి
మమత మానవీయత
సమత, సౌహార్ద్రత
సహనం, సంయమనం
శాంతి సౌభ్రాతృత్వంతో
విశ్వ మానవ కళ్యాణానికి
నీవే అగ్రేసరుడివి కావాలి
ఆర్ద్రత ఆదరణకు
నీవే చిరునామ కావాలి

స్వార్థం మాని సమాజహితమే
నీ అభిమతం కావాలి
సంకుచితత్వం వద్దు
ఐక్యత సమైక్యతే
నీ హద్దు కావాలి

సంఘీభావం నీ పద్దు కావాలి
నీ వ్యక్తిత్వం ప్రభావశీలమై
ఆనందం ఆహ్లాదం ఉత్సాహం
ఉల్లాసాలకు వేదికగా వర్ధిల్లాలి

నీ వ్యక్తిత్వం ప్రేమానురాగాల సమత మమత
విరబూసే 'పువ్వు' కావాలి
సంతోష సౌభాగ్యాలే సౌందర్యం కావాలి
సంతృప్తికి మనోశాంతికి
నీ గుండె గుడి కావాలి



అందరికీ ఆప్తుడిగా
అందరికీ ఆత్మీయుడిగా
ఆదర్శమైన వ్యక్తిత్వంతో
నవ చరితను సృష్టించాలి
నీవు సమాజానికి వెలుగుదివ్వె కావాలి
నూతన క్రాంతితో నవ సమాజాన్ని నిర్మించాలి
భారతజాతి ఖ్యాతిని జగతిన చాటాలి


**నేదునూరి కనకయ్య**

ఫోన్ : 9440 245 771

# కె. శివారెడ్డి కవిత్వం 'గాథ' – మానవ జీవన చైతన్యం

**డా. వి. పవన్ కుమార్ రెడ్డి,** తెలుగు అధ్యాపకులు, కమలాపురం, కడప.

మనిషి అంటే మానవ సంబంధాల సమాహారం. మనిషి సజీవంగా వున్నాడనడానికి నిదర్శనం, అతడు మానవ సంబంధాలను కలిగి ఉండటమే. ఏ మనిషీ ఒంటరి కాదు. మనిషి ఒంటరిగా మనుగడ సాగించలేడు. నేటి సమాజంలో మనుషులు మానసిక సమస్యలకు గురవుతున్నారు. అందుకే మానసిక వైద్య నిపుణులు పెరుగుతున్నారు. వర్తమాన కాలంలో మనిషి జీవితం వేగవంతమై పోయింది. సామాజిక మాధ్యమాలు మనిషిని మరింత ఒంటరిగా వుండేట్లు చేస్తున్నాయి. కవిత్వంలో ఇలాంటి విషయాలన్నీ నమోదు అయినాయి. కవులు తమ కవిత్వం ద్వారా మనిషి జీవితంలో చైతన్యం కల్గించేందుకు దోహదపడుతున్నారు. అటువంటి కవులలో ప్రముఖమైన కవి కె. శివారెడ్డి. మానవ సంబంధాలను పెంపొందించు కోవాలనే సందేశం ఈయన కవితల్లో కనిపిస్తుంది.



సమాజంలో మానవీయమైన వాతావరణం నెలకొని వుండాలి. అప్పుడే మనుషుల మధ్య ఆత్మీయత, అనురాగం వెల్లివిరుస్తాయి. మనుషుల్లో ప్రేమ, కరుణ వంటి మానవతా విలువలను పెంపొందించేందుకు కవిత్వం తన వంతు పాత్ర పోషిస్తున్నది. కవి శివారెడ్డి రాసిన **"పిల్లలే కాదు"** అనే కవిత మనుషుల్లో వుండాల్సిన లక్షణాలను తెల్పుతుంది.


**"పిల్లలే కాదు**
**పెద్దాళ్లూ దూరమౌతారు**
**ఉండాల్సిన పద్ధతిలో మనం ఉండకపోతే –**
**కాస్త ప్రేమ, అనురాగం, ఆప్యాయత, లాలిత్యం**
**అనునయం, ఆసరా, ఒక నమ్మకం**
**లీలగానయినా కదలాడకపోతే**
**పిల్లలే కాదు**
**పెంపుడు జంతువులు కూడా దూరమౌతాయి**
**ఎవడు ఎవర్నించయినా ఏం కోరుకుంటాడు**
**నీటి పొరతో కదలాడే ఒక నయనం**
**దరులొరసి పారే అనురక్తి " (గాథ – పుట. 28)**

మనుషులు వుండాల్సిన పద్ధతిలో వుండటం లేదు. నమ్మకం అనేది మానవ సంబంధాలలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇతడు నమ్మదగిన మనిషి అని దగ్గరకు తీసుకుంటారు లేదా దగ్గరవుతారు. ఇదే భద్రతా భావానికి దారి తీస్తుంది. ఇప్పటి కాలంలో మనుషుల్లో విపరీతమైన మార్పులు కన్పిస్తున్నాయి. ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు అనే భావనలో ఇప్పుడు మనుషులుంటున్నారు. దీనివల్ల అపనమ్మకం, అభద్రతా భావం అన్నిచోట్లా నెలకొని వుంది. అందుకే కవి మనుషుల్లో ఆత్మీయత, ఆప్యాయత, అనురాగం వంటి లక్షణాలు సజీవంగా, సహజంగా వుండాలని, అవి లేనివాళ్ల దగ్గర తమ పెంపుడు జంతువులు కూడా దూరమవుతాయని చెబుతున్నాడు. కాబట్టి మనిషి తనవైన మంచి లక్షణాలని కలిగి వుండటం అనివార్యం. లేదంటే మనిషి ఒంటరివాడవుతాడు. నిరాదరణకు గురవుతాడు.

మనిషి తనకున్న శక్తినంతా కూడగట్టుకొని మనుగడ సాగించాల్సిందే. అన్ని రోజులూ ఒకేలా వుండవు. మనిషి అన్ని దశలలోనూ తన శక్తి మేరకు నిలబడగలగాలి. అందుకోసం మనిషి స్వయంసిద్ధంగా వుండాలి. అందుకే కవి **"ఎప్పటికప్పుడు"** అనే కవితలో మనిషి ఎట్లుండాలో చెబుతున్నాడు.

**"ఎప్పటికప్పుడు**
**జీవశక్తి నింపుకోవటం అవసరమేమో –**
**కొత్త సందర్భాలూ, కొత్త సంక్షోభాలూ**
**విధిగా ఇంటా బయటా వెల్లువెత్తుతున్నప్పుడు**
**తప్పదు**
**ఎప్పటికప్పుడు నిన్ను నువ్వు నిలబెట్టుకోవాలి**
**పునః ప్రాణ ప్రతిష్ఠ చేసుకోవాలి**
**ఎవర్ని నిందించీ లాభం లేదు**
**జీవితం అంటే ఎదుర్కోవటమే**
**ఏ స్థలంలోనయినా, ఏ సమయంలోనయినా**
**ఏ వయసులోనయినా, ఏ ప్రాంతంలో, ఏ దేశంలోనయినా**
**దేన్నయినా ఎదుర్కొంటానికి**
**నిన్ను నువ్వు సిద్ధం చేసుకోవటమే" (గాథ – పుట. 62)**

ప్రతి మనిషీ తనలోని జీవశక్తిని కోల్పోకూడదు. వేగవంతంగా మారుతున్న కాలంలో సంక్షోభాలు తలెత్తుతున్న సందర్భంలో మనిషి




తనని తాను పునః ప్రాణప్రతిష్ఠ చేసుకోమంటున్నాడు కవి. సహజంగా మనుషులు ఇతరుల మీద నిందలు వేస్తుంటారు, ఫిర్యాదులు చేస్తుంటారు. నిజానికి జీవితమంటే ఎదుర్కోవడమే. జీవితంలో ఎదురయ్యే సమస్యలను, సవాళ్లను ఎదుర్కొని తీరాల్సిందే. దీని కోసం ప్రతి మనిషి చేయాల్సింది, తనను తాను సిద్ధపరచుకోవడమే అని కవి పిలుపునిస్తున్నాడు.

మంచి మనుషుల సాహచర్యం మనిషిని సున్నిత హృదయుణ్ణి చేస్తుంది. మనిషి స్వభావంలో ఆశించిన మార్పులు సంభవిస్తాయి. దీనికి ఉదాహరణగా **"జేబుగుడ్డ"** కవితని పేర్కొనవచ్చు.

**"ఈ జేబుగుడ్డ కొన్నప్పుడు**
**మొద్దుగా మొరటుగా –**
**ఏ మెత్తదనం లేక**
**గరుకు చెయ్యిలా –**
**ఇన్నాళ్ల తర్వాత**
**మెత్తగా మృదువుగా**
**సరళ సౌమ్య స్పర్శతో –**
**ఒక మనిషి**
**మృదు స్వభావమేదో, తేజస్సు ఏదో**
**మానవత్వపు సౌందర్యమేదో**
**దీన్నిండా పరిమళించి**
**పరిపక్వించి –**
**ఓ కన్నతల్లి అరచేయిలా –**
**సాహచర్యం**
**స్వభావాన్ని మారుస్తుందా ? "** **(గాథ – పుట. 198)**

మనుషులతో సరిపడదు అనుకున్నప్పుడు ప్రకృతిలో గడిపి మృదు స్వభావాన్ని అలవర్చుకుంటారు. చెట్లలాంటి, పూలలాంటి మనుషులతో స్నేహం చేయడం ద్వారా సున్నితత్వం, తేజస్సు తప్పకుండా కల్గుతాయి. మొత్తానికి మనము ఎవరితో కలిసి నడుస్తున్నాము అనేదే మన స్వభావాన్ని తేటతెల్లం చేస్తుంది.

జేబుగుడ్డ ఒంటరిగా వున్నప్పుడు గరుకుగా వుండేది. అది ఒక మనిషి చేతిలోకి వెళ్లిన తర్వాత క్రమంగా తన గరుకుతనాన్ని కోల్పోయి మెత్తదనాన్ని, సున్నితత్వాన్ని పొందింది. అలాగే మనిషి కూడా ఇంకొకరి సావాసంలోకి, సాహచర్యంలోకి వెళ్లినపుడు తను ఏమి కల్గి వుండాలో వాటిని తప్పకుండా పొంది, తన స్వభావంలో సానుకూల మార్పుల్ని కల్గి వుంటాడు.

మనిషి మాటతీరు మానవ సంబంధాలు బలపడటానికి దోహదం చేస్తుంది. మనుషులతో వ్యవహరించేటప్పుడు కఠినంగా వుండాల్సిన అవసరం లేదు. నేటి కాలంలో తప్పనిసరిగా మనుషులు సానుకూల దృక్పథంతో సాగిపోవాలి. అనేక రకాల నైపుణ్యాల్ని నేడు బోధిస్తున్నారు. వాటిలో సంభాషణా నైపుణ్యాలు ప్రధానమైనవి. మానవ జీవితం వికాసవంతంగా కొనసాగడానికి ఈ నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయి. కవి రాసిన **"ఎవరితో అయితే మాత్రం.."** అనే కవిత ఈ సందర్భంగా ఉదహరించ తగినది.

**"ఎవరితో అయితే మాత్రం**
**అంత కటువుగా వుండటం అవసరమా**
**ఎండుపుల్ల పుటుక్కున విరిచినట్టు –**
**నీ తల్లి గావచ్చు, తండ్రి గావచ్చు**
**తమ్ముడు గావచ్చు, అన్న గావచ్చు**
**చిన్న చెల్లి గావచ్చు, చిన్నపిల్లలు గావచ్చు,**
**హితుడో, స్నేహితుడో**
**శత్రువో, మిత్రమో –**
**ఎవరయినా గావచ్చు**
**అంత కటువుగా వుండటం అవసరమా ?**
**నీ కాఠిన్యాన్ని, కరుణలేనితనాన్ని భాష మోయొద్దు "**
**(గాథ – పుట. 190)**

మనిషి వివిధ సందర్భాలలో వివిధ రకాల భావోద్వేగాల్ని వ్యక్తం చేస్తాడు. ప్రేమ, కరుణ, దయ, కోపం, ద్వేషం, ఆశ్చర్యం మొదలైన రకాల భావోద్వేగాల్ని ఆయా సందర్భాలకి తగినట్టుగా వ్యక్తపరుస్తాడు.

అయితే ఎప్పుడూ కఠిన స్వభావాన్ని కల్గి వుండటం, కోపంగా వుండటం అనేది ఆరోగ్యకరమైన లక్షణం కాదు. అందుకే కవి అంత కటువుగా వుండటం అవసరమా అని పాఠకుల్ని ఆలోచింప జేస్తున్నాడు. తద్వారా మానవ జీవితాన్ని చైతన్యవంతంగా రూపొందించుకోవడానికి కావల్సిన ఎరుకను కల్గిస్తున్నాడు. మనిషి, ఇతరులతో ఎట్లా సంభాషించాలో ఇదే కవితలో కవి తెలియజేశాడు.

**"ఎవరితో అయినా అట్లా మాట్లాడొద్దు**
**ముఖం లేని ముఖంతో**
**శవాలు తగలబడుతున్న స్మశానపు**

**నోటితో మాటాడొద్దు**
**ఎవరితో మాటాడినా**
**ఒక ఆకు మీంచి నీటిచుక్క జారి**
**మరో ఆకు మీద పడ్డట్టుండాలి**
**వేల జెండాలతో అలంకరించిన**
**వీథుల్లా వుండాలి**
**నవ్వుల్తోనూ, పూలమాలికల్తోనూ**
**కళకళలాడుతున్న**
**అద్భుతమయిన గృహంలా వుండాలి**
**చిన్న పిల్లలను చేరబిలిచినట్టుండాలి**
**అరచేతిలో కాసిని గింజ లేసుకొని**
**పిట్టకు తినిపించినట్టుండాలి"** **(గాథ – పుట. 191)**

మనిషి నవ్వాల్సిన సందర్భంలో నవ్వాలి, ఏడ్వాల్సిన సందర్భంలో ఏడవాలి, కోపాన్ని ప్రదర్శించాల్సిన సందర్భంలో కోప్పడాలి. ఇటువంటి భావోద్వేగాలన్నీ సహజంగా వెల్లడి కావాలి. నలుగురితో మన సంతోషాన్ని, బాధల్ని పంచుకోవాలి. మనిషి ఆశాజీవి. కావున ఆశావహ దృక్పథంతో ఇతరులతో మాట్లాడటం, వ్యవహరించడం అవసరం. నిరాశతో, విషాదంతో అన్నివేళలా మాట్లాడటం తగని పని. అందుకే కవి స్మశానపు నోటితో మాటాడొద్దు అని సెలవిస్తున్నాడు. వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింపజేసే కవితగా దీనిని పేర్కొనవచ్చు. మాట్లాడటం అనేది ఒక కళ. మరి ఎవరితోనైనా మాటలు కలిపినపుడు కళకళలాడే విధంగా వాతావరణాన్ని సృష్టించుకోవాలి.

మనుషులు ఎన్ని కష్టాలు ఎదురైనా, సమస్యలు చుట్టుముట్టినా తట్టుకొని నిలబడగలగాలి. జీవితం నుంచి పలాయనం చిత్తగించ కూడదు. బతుకు పోరాటం సాగించాలే గానీ, బతుకు నుంచి నిష్క్రమించొద్దు. సాహిత్యం మనుషుల్ని బతికిస్తుంది. బతకడానికి కావాల్సిన భరోసాని, ధైర్యాన్ని ఇస్తుంది. ఇలాంటి ధైర్యాన్ని కవి **"మనిషి చనిపోకూడదు"** అనే కవితలో అందిస్తున్నాడు.

**"మనుషులు చనిపోకూడదు**
**బతికుండే మనుషులు చనిపోగూడదు**
**మనుషులు విరిగిపోగూడదు**
**నిటారుగా నిలబడ్డ మనుషులు**
**విరిగి, ముక్కలు ముక్కలై పడిపోగూడదు**
**బతుకంతా శ్రమించింది**
**నాలుగు మెతుకులు తింటానికే గాదు**
**తలెత్తుకుని తిరగటానికీ**
**భూమిలో కాళ్లు పాతి ఆకాశంతో సంభాషించటానికే**
**ఎక్కడ జీవితం శిథిలమౌతుందో**
**ప్రాణ రహితమౌతుందో**
**అక్కడ మనుషులు ప్రవేశించాలి"** **(గాథ – పుట. 48)**

వర్తమాన కాలంలో చిన్న చిన్న సమస్యలకే మనుషులు కుప్పకూలిపోతుంటారు. మానసిక దృఢత్వం కోల్పోయి దుర్బలంగా మారిపోతున్నారు. దీనికి విరుగుడుగా కవులు తమ కవిత్వం ద్వారా మానసిక వైద్యం అందిస్తున్నారు. జీవితంలో ఏ సందర్భంలో నయినా విఫలం చెందితే తల దించుకోవాల్సిన అవసరం లేదు. తల ఎత్తుకుని జీవించడమే ముఖ్యం. శ్రమ చేసేవాళ్లు నిజాయితీగా నిలబడతారు. ఎక్కడైతే బతుకు నిస్సారంగా మారుతుందో అక్కడ మనుషులు ప్రవేశించి ఉత్సాహభరితం గావించాలి. మనుషులు దుర్బలంగా మారడానికి వ్యవస్థాగతమైన కారణాలున్నాయని ఇదే కవిత చివర్లో కవి తెలిపాడు.

**"మనిషి బతికుండగానే**
**మృత్యుముఖంలోకి నెట్టే**
**వ్యవస్థాగత విధ్వంసాన్నీ, హింసనీ**
**కుంగదేర్లతో సహా పెకలించివేయాలి**
**మనిషి చనిపోగూడదు**
**నిత్య శోభితుడై**
**నిరంతర ఉత్సవానందంతో**
**ఉగ్రూతలూగాలి"** **(గాథ – పుట. 49)**

మనుషులు జీవచ్ఛవాలుగా మారిన స్థితిని కవి తెలుపుతున్నాడు. మనుషులు ఇట్లా వుండటానికి ఈ వ్యవస్థ కారణం. వ్యవస్థ చేసే విధ్వంసాన్ని, కనిపించకుండా చేసే హింసనీ బద్దలుకొట్టాలి. దీనికోసం మనిషి సమష్టిగా మారి పోరాడాలే తప్ప, చనిపోకూడదు. మనిషి భయపడకూడదు, అంతర్గతంగానైనా పోరాటం చేస్తుండాలి.

**ఆధార గ్రంథం**

1. గాథ (కవిత్వం) – కె. శివారెడ్డి, ఝరీ పొయిట్రి సర్కిల్ ప్రచురణ, ఆగస్టు, 2013, హైదరాబాద్.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# పద్యమనోహరం - 41


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448


**"ఏ సుకృతంబు చేతనో యొకింత నా గళసీమ శ్యామలా భాసితమయ్యె సాగర నిభచ్ఛవి, యాముని తోయ దీప్తి వ ర్షాసమయాభ్రకాంతి, క్షితిజద్యుతి తడుత శ్యామసుందరా శాసన భాగదేయమున సమ్యగభిన్నత నొంద గోరెదన్"**

హరిహరాద్వైత భావనను కవిబ్రహ్మ తిక్కన ప్రారంభించిన నాచన సోమనాథాదులు దాన్ని మరింత ముందుకు తీసుకొని వెళ్ళే ప్రయత్నం చేసి తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. ఆ త్రోవనే తొక్కిన ఆధునిక మహాకవి ఉత్పల సత్యనారాయణాచార్యుల వారు తమ "కృష్ణ చంద్రోదయం" అనే పద్యకావ్యంలో హరిహరాద్వైత భావనను వ్యక్తీకరించే ఈ పద్యాన్ని రచించారు.

శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్యులవారు సుప్రసిద్ధ ఆధునిక కవీశ్వరులు. పద్యాన్ని సామాన్యునికి సమీపంలోకి తీసుకొని వచ్చి రంజింపజేసిన కవి. వారు రచించిన **"శ్రీకృష్ణ చంద్రోదయము"** శ్రీకృష్ణతత్వాన్ని పరమ సుందరంగా బోధించిన కావ్యం. వారి రచనల్నింటిలోకి శ్రేష్ఠమైనదన్న పండితుల భావన అక్షరసత్యం. కేంద్ర సాహిత్యఅకాడెమీ వారి పురస్కారాన్ని అందుకున్న ఈ కావ్యంలోని ఈ పద్యం ద్వారా పరమశివుని పలుకుల్లోనే శివకేశవాభేదాన్ని పలికించారు ఉత్పలవారు.




ఉత్పల సత్యనారాయణాచార్య
1927-2007

నందగోకులం చేరిన బాలకృష్ణుని బాల్యక్రీడలు గోపకులాన్నంతా ఆనంద డోలికల్లో ముంచెత్తుతున్న సందర్భంలో ఒకానొకనాడు సాక్షాత్తూ ఆ శివుడే బాలకృష్ణుని చూడాలన్న అత్యంత కుతూహలంతో భిక్షుకుని రూపం దాల్చి యశోదమ్మ వాకిట్లోకి రావడం, ఆ బాలుణ్ణి ఎత్తుకోవాలన్న ఆసక్తి చూపడం గమనించిన నందాంగనయైన యశోదాదేవి కంగారుపడి బాలుణ్ణి అతని నుండి కాపాడుకోవాలన్న భావాన్ని ఆమెలోని తత్తరపాటును గమనించిన పరమశివుడు తానెవరో తెలుపుతూ...

"నేను చేసుకున్న ఏ పుణ్యం వల్లనో కాకంఠం శ్యామలవర్ణంతో ప్రకాశిస్తున్నది, ఆ ప్రకాశం సముద్రకాంతితో విరాజిల్లుతున్నది. ఇది యమునానదివలె నల్లనిదై దీపిస్తున్నది. అంతేకాదు వర్షాకాలం కురువబోయే నల్లని మబ్బును తలపిస్తున్నది. ఈ కాంతి బాలుడైన శ్యామసుందరునితో అభిన్నం కావడం వల్ల నేను తనని ఎత్తుకోవాలన్న తలంపు కలిగిందని స్వయంగా శివుడే చెప్పిన ఈ మాటల్లో శివునికి కేశవునికి ఎటువంటి భేదము లేనట్లుగా కవిచెప్పే ప్రయత్నం చేశాడు.

అదొక గొల్లపల్లె. అక్కడ ఉన్న తల్లి యశోదమ్మ. ఒక సామాన్యమైన గ్రామీణ గృహిణి. సామాన్యురాలైనామెకు స్వామితత్వాన్ని చమత్కారంగా చెప్పిన తీరు కవి ప్రతిభకు పట్టం కట్టింది. తనకున్న నల్లదనాన్ని చూపుతూ సామాన్యులకు బోధించినట్లు కనిపించే ఈ మాటల్లో శివతత్వానికి, కేశవ తత్వానికి సామ్యాన్ని జ్ఞానులకు బోధించినట్లైంది. తన గరళ కంఠత్వం, స్వామి నీలమేఘ వర్ణ సామ్యాన్ని భూమికగా చేసుకుని ఉత్పలవారు ఈవిధంగా హరిహరాద్వైతాన్ని మరోసారి గుర్తు చేశారేమోననిపిస్తుంది.

నేటి సాహిత్య ప్రపంచంలో ఉత్పల సత్యనారాయణాచార్యులవారి పాతబస్తీ విలాసము కావచ్చు, ఈ జంటనగరాలు హేమంత శిశిరాలు కావచ్చు, స్వప్నాల దుప్పటి కావచ్చు, శతరూప కావచ్చు ఏ పద్యకావ్యమైనా వారి పద్యరచనలోని సామాజిక దృష్టిని, వారి పద్యరచనలోని రామణీయకతను ప్రతిబింబించేవే. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు వంటి అనేక భాషలతో పరిచయం, పాండిత్యం కలిగిన ఆచార్యులవారు తొలిరోజులలో బాలబాలికల కొరకు సరళమైన గేయ ఫణితిలో అనేక పౌరాణిక గాథలను గేయ కావ్యాలుగా అందించిన అపురూపమైన కవి అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 (21) హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# భారతీయీకరణ – 11

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.





ముస్లిం లీగ్ మహానాయకుల అభ్యర్థన కారణంగా, వారు వాంఛించిన పాకిస్తాన్ కోసం భారత విభజన జరిగింది. పాకిస్థాన్ ఏర్పడింది. అయినప్పుడు, భారతదేశంలో ముస్లిం లీగు ఇంకా ఎందుకుండవలెనో, ఒక సైనికుడిగా, నాకు అర్థం కావడం లేదు. ఇంకా అది ఈ దేశంలో పనిచేస్తూనే ఉన్నది మరి. ఇది నాకు తప్పుగా అనిపిస్తున్నది. ముస్లిం సంఘాలు – వారి వారి సాంఘిక సాంస్కృతిక ప్రయోజనాల పరిరక్షణ కోసం ఉండవచ్చు– ఉండవలె కూడా.. కాని రాజకీయోద్దేశ్యాలతో మాత్రం అవి ఉండడానికి నిశ్చయంగా వీల్లేదు.

ఇదంతా చాలా అత్యవసరమయిన విషయం. భారతదేశంలోని బాధ్యతగల ముస్లిం నాయకులంతా వెంటనే ఈ విషయంలో తగిన విధంగా వ్యవహరించడం అవసరం. వారు ఏ మాత్రం అశ్రద్ధ చేసినా వర్గ వైషమ్యం పెంచినవారవుతారు. ఇది తప్పకుండా తొలగించ వలసిన, మరియు తొలగించవీలయిన అంశం"

భారత ముస్లింలలోని ఈ వర్గం కలిగించే ప్రమాదం, వారు కమ్యూనిస్టులతో చేతులు గలపడంతో మరింత తీవ్రమయింది. కమ్యూనిస్టు పాలన నెలకొనడం వల్ల భారతదేశంలో ఒక మతంగా ఇస్లాంకు రాగల ప్రమాదం జమాయత్– ఇ– ఇస్లామికి చెందిన కొందరికి తెలుసు. తెలిసినా గూడా, భారతదేశాన్ని బలహీనపరచి భిన్నం చేయవలెనన్న ఆత్రంలో, వారు ఈ ప్రమాదాన్ని గూడా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది, ముఖం మీది కోపంతో ముక్కును తెగ్గోసుకొన్నట్లున్నది.

విశాలభావాలూ, దేశభక్తి గల శ్రీ మహమ్మద్ కరీం భాగ్లా, శ్రీ హమీద్ దల్వాయి వంటి ఏ దేశానికైనా సరే, గర్వించదగిన ముస్లింలు కొందరున్నారనేది సత్యం. వారు మబ్బులు కమ్మిన భారత ఇస్లాం ఆకాశంలో బంగారు కిరణాల వంటివారు. కాని, ముస్లిం సమాజంపైన వారి ప్రభావం అంతగా లేదు.

ప్రాధాన్య వివక్షతో భారతీయీకరింపబడవలసిన వర్గం మరొకటి ఉన్నది. అది, భారత రాజకీయ వేత్తల, రాజకీయ నాయకుల వర్గం. వ్యక్తిగత, పక్ష (పార్టీ) గత ప్రయోజనాల కోసం చాలామంది భారత రాజకీయజ్ఞులు జాతీయతను కించపరుస్తూ మతతత్వాన్నీ, వేర్పాటు ధోరణులనూ పెంపొందిస్తున్నారు. ప్రజాస్వామ్యం వల్ల కలిగే విచ్ఛేదకర ఫలితాలట్లా ఉండగా, కుల, మత, భాషాతత్వాలు పెచ్చు పెరగడానికి రాజకీయ నాయకుల – ప్రధానంగా అధికారంలో ఉన్నవారి ప్రవర్తన, విధానాలదే సంపూర్ణ బాధ్యత.

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఇట్లాంటి రాజకీయజ్ఞులకు ఒక ఉదాహరణ. లోకసభ, విధానసభలలోని ముస్లింల మత తత్వాన్నీ, హరిజనుల, బ్రాహ్మణుల కులతత్వాన్నీ రాష్ట్రపతి ఎన్నికలలో తన పార్టీ అభ్యర్థినే ఓడించడం కోసం ఉపయోగించుకున్న తీరు రాజకీయ

అవినీతికి సాటిలేని మేటి ఉదాహరణ. ఈ దేశపు అగ్రశ్రేణి నాయకత్వం రాజకీయ ప్రయోజనాల కోసం కుల,మత తత్వాలను ఉపయోగించుకొనే రీతి గూడా ఆ విధమయిన ఉదాహరణే.

తాను ఉద్దేశించినట్లుగానే, తన పార్టీలో చీలిక సాధించిన తరువాత, ఆమె తన అధికారాన్ని నిలబెట్టుకొనడానికి కమ్యూనిస్టు, ముస్లింలీగ్, ఇంకా అట్లాంటి మరికొన్ని శక్తుల సహకారంతో అతి నికృష్టమయిన మతతత్వాన్ని పెంచుతున్నది. ఈ శక్తులన్నిటికీ భారత జాతీయత అన్నా, జాతీయాకరణ అన్నా చెప్పరానంత అసహ్యమన్నది ప్రసిద్ధమయినదే.

ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ ప్రభుత్వం ఏర్పాటు చేసే రాజకీయజ్ఞులందరూ, ప్రజాస్వామిక భారతదేశంలో క్రొత్త తరహా రాజులయిపోయినారు. వారి వ్యక్తిత్వం, ప్రవర్తన ఏ ప్రభావానికి కూడా లొంగని విధంగా తయారయింది. **"యథా రాజా తథా ప్రజా"**– రాజెట్లా అయితే, ప్రజలట్లా– అని ఒక ప్రాచీన సూక్తి. రాజరిక వ్యవస్థ ఇంకా గట్టిగానే ఉన్నా భారతదేశం వంటి ఏ దేశంలోనైనా సరే, ఈ సూక్తి సంపూర్ణంగా సార్థకమవుతుంది. అందుకని, త్రికరణశుద్ధిగా జాతీయ ప్రయోజనాలకే మిగిలిన అన్నింటికన్నా అత్యధిక ప్రాధాన్యాన్ని ఇచ్చే విధంగా రాజకీయజ్ఞుల లోనూ, రాజకీయ నాయకులలోనూ నిజమైన జాతీయ భావనను సృష్టించడం, దేశ స్వాతంత్ర్యాన్నీ ఐక్యతనూ నిలుపుకొని, ప్రస్తుత పరిస్థితిలో రక్షించుకొనడంలో చాలావరకు ఉపకరిస్తుంది.

గడిచిన ఒక సంవత్సరం నుంచీ భారతీయాకరణను గురించి దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చల ద్వారా, ఆలోచనా శీలం, దేశాభిమానం గల వారిలో భారతీయాకరణను గురించి ఒక స్థూలమయిన అంగీకారం గలిగింది. భారతీయ సమైక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులను అరికట్టి, దేశాన్ని ఛిన్నాభిన్నం చేసే ధోరణులను నిరోధించి, అన్ని తరగతుల ప్రజల్లోనూ జాతీయ భావనను జాగృతం చేయడానికి జాతీయాకరణ యొక్క అత్యంతావశ్యకత అంగీకరింప బడింది. అయితే, సమాజంలోని కొన్ని వర్గాలలో కులం మతం మొదలయినవి ప్రాతిపదికలుగా కులతత్వాన్ని, వేర్పాటు ధోరణులనూ ఉధృతం చేసే అధికార దాహం గల రాజకీయ నాయకులు లేదా కమ్యూనిస్టులూ, వారిననుసరించేవారూ, మతతత్వ వాదులు మాత్రమే దీన్ని వ్యతిరేకిస్తున్నారు. నిజానికి, వారి యీ వ్యతిరేకతా ప్రదర్శనే, ప్రస్తుత దేశ పరిస్థితులలో దేశభక్తి పూరితం, అపవాదరహితమూ అయిన ఈ భారతీయాకరణ యొక్క అవసరాన్ని గూర్చి ప్రజలను న్యాయంగా ఆలోచించేట్లు చేసింది.

ఈ భారతీయాకరణ భావన ఇట్లా విస్తృతాంగీకారాన్ని పొందిన తరువాత, దీన్ని ఏ విధంగా క్రియారూపంలోకి పర్యావసితం చేయవలెనన్న ప్రశ్న సహజంగానే కలుగుతుంది. జాతి వ్యతిరేక శక్తుల రెచ్చగొట్టుతనాన్నుంచీ, దుష్ప్రచారాలనుంచీ ప్రజలను రక్షించడానికీ, వారిలో ప్రగాఢ భారతీయ భావనను నెలకొల్పడానికీ ఏయే విధమయిన కార్యక్రమాలు అవసరం?

ఇది ముఖ్యమూ, సమంజసమూ అయిన ప్రశ్న. దీనికి స్పష్టమయిన సమాధానం అవసరం. ఇది మానవులకు, వారి ప్రవృత్తులకూ ఆలోచనలకూ, దృక్పథాలకూ, ఉద్రేకాలకూ సంబంధించిన అంశం. అందువల్ల, యాంత్రికమయిన నియమాలూ, నిబంధనలూ భారతీయాకరణ విషయంలో ఏర్పరచడానికి వీలు లేదు. మానవ సమస్యల పరిష్కారానికి మానవతా దృక్పథం అవసరం. వివాదాల వ్యామోహంతో గాని, రాజకీయ వర్గాల చిలుక పలుకులతో గాని దీనికి అవసరం లేదు. భారతదేశ శరీరంలో ప్రవేశించిన వ్యాధిని సరిగా పరిశీలించి, నిర్ణయించి, రాజకీయ, విద్య, సాంఘిక,– ఆర్థికాద్యనేక స్థాయిలలో దాన్ని ఎదుర్కొనవలసి ఉంటుంది.

వీటిలో అతి ప్రభావాత్మకం, అతి ప్రధానం అయింది రాజకీయ స్థాయి. సంస్కృత సారస్వతంలో రాజకీయం **"దండనీతి"** అని వ్యవహరింపబడింది. మానవ విజ్ఞానానికీ ప్రవృత్తికీ సంబంధించిన అన్ని శాఖలలో ఇది అతి ప్రధానమయిందిగా భావింపబడింది. ఎందుకంటే, ఇది మానవ ప్రవృత్తికి సంబంధించిన ఇతర రంగాలన్నింటినీ ప్రధానంగా తోటి పేరులతో, ప్రభుత్వంతో, దేశంతో వ్యవహరించవలసిన రీతులను ప్రభావితం చేస్తుంది. అందుకే భారతీయ రాజనీతి వేత్తలలో అసామాన్యుడయిన చాణక్యుడు దండనీతిని వేద విజ్ఞానం (త్రయీ), జీవిత తత్వం (అన్వీక్షకి), ఆర్థికాది విషయక పరిజ్ఞానం (వార్త) అన్న వాటితో సమంగా పేర్కొన్నాడు.

ప్రజాస్వామిక ప్రపంచంలో రాజకీయ చర్యలకు మరింత ప్రాధాన్యం లభించింది. భారతదేశం స్వీకరించిన ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయాలు మారుమూల పల్లెల దాకా, అక్కడ నివసించే అతి సామాన్యులదాకా వ్యాపించినయి. **"రాజకీయాలలో వచ్చిన ప్రతి అంశమూ, పరిసర రంగాలన్నింటినీ ప్రభావితం చేస్తుంది"** అన్న జాన్ మోర్లీ మాటలలోని సత్యాన్ని ఈ అంశం నిరూపిస్తుంది. భారతదేశానికి బ్రిటిష్ కార్యదర్శి అయిన ఈ జాన్ మోర్లీయే – భారత రాజకీయాల్లో విడి ఎన్నికల పట్టికలను ప్రవేశపెట్టడం, భారత రాజకీయ శరీరంలోకి విషాన్ని ఎక్కించడమే అవుతుందనీ దీని ఫలితాలు దీర్ఘకాలం మీద అతి విషాదకరంగా ఉంటాయని వర్ణించినాడు. నిజానికి, 1947లో జరిగిన భారతదేశ విభజన, 1906లో లార్డ్ మింటో యొక్క ఈ విడి ఎన్నికల పట్టికలను ప్రవేశపెట్టడమనే రాజకీయపుటెత్తుగడ వల్ల కలిగిన ప్రత్యక్ష ఫలితం. ఒక నిర్ణీతమయిన లక్ష్యసాధన కోసం ఆంగ్లేయులు ఈ దేశంలో విభజించి పాలించు విధానాన్నీ, జాతీయతా భారతీయతా రాహిత్యం కలిగించే విధానాలనూ అవలంభించినారు. అయితే, 1947 ఈ దేశం నుంచి వారి నిర్గమనం తరువాత గూడా, భారత దేశ విభజన జరిగిన తరువాత గూడా ఆ విధానాలు ఈనాటికీ అట్లాగే కొనసాగుతున్నయి.

ప్రజాస్వామిక లక్షణమయిన ఎన్నికలు పరిస్థితిని మరింత తీవ్రం చేసినయి. పరిస్థితులను సరిదిద్దడానికి తగు చర్యలను అమలు చేయడాన్ని మరింత క్లిష్టం చేసినయి. కానీ ఏది ఏమయినా గూడా, భారతదేశం ఒక స్వతంత్ర దేశంగా మనుగడ సాగించవలెనంటే తగిన చర్యలు అమలు చేయక తప్పదు.

USA నానావర్గ సమ్మేళన స్వరూపం గల ఒక దేశమని అందరికీ తెలిసిందే. ప్రపంచంలోని బహు జాతులకూ, మతాలకూ, తెగలకూ చెందిన ప్రజలు గడిచిన రెండు వందల సంవత్సరాలుగా అమెరికా దేశ నిర్మాణానికి పాటుపడినారు. అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసే వ్యక్తి ఇటీవలి వరకు గూడా దాదాపు డజన్ భాషల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడవలసి ఉండేది. నల్ల – తెల్ల అమెరికనుల మధ్యనున్న సాంఘిక – ఆర్థిక వ్యత్యాసానికి భారతదేశంలోనే కాదు, మరెక్కడా కూడా పోలికే లేదు. మతపరంగా చూస్తే, ప్రొటెస్టెంట్ మెథడిస్ట్, రోమన్ కాథలిక్ అమెరికనుల మధ్య ఈ వ్యత్యాసాలు అదే స్థాయిలో ఉన్నాయి. నల్ల అమెరికనులలో ఇస్లాం యొక్క వ్యాప్తి, "నల్ల శక్తి ఉత్థానం" అక్కడి మతతత్వ సమస్యను మరింత విస్తృత పరిచింది. అమెరికన్ జీవితాన్నీ, రాజకీయాలనూ ప్రభావితం చేసేంతగా, యూదులు ఒక పటిష్ఠ సుసంఘటిత వర్గంగా ఏర్పడినారు.

అమెరికా భౌగోళిక స్వరూపం, వాతావరణం, ఇంకా ఇతర అంశాలలో ఉన్న విభేదాల దృష్ట్యా, అక్కడి ఈ సమస్య భారతదేశంలో ఉన్నదాని కన్నా అతి సంక్లిష్టమయింది.

ఈ విధంగా నానాజాతీయుల, మతస్థుల, తెగల ప్రదర్శనశాల వంటి అమెరికాను, అక్కడి ఆలోచనా శీలం, క్రియాశీలం గల నాయకులు, ఒక వ్యక్తి తాను మొదట అమెరికన్ అని గర్వించదగిన ఆరోగ్యకరభావన కలిగే విధంగా, అమెరికాను ఒక ఘనిష్ట దేశంగా రూపొందించడంలో కృతకృత్యులయినారన్నది భారతదేశంలోని ప్రజలకూ, నాయకులకూ నేర్చుకోవలసిన ఒక గుణపాఠం.

ఇది అమెరికాలో ఒక ప్రణాళికబద్ధమైన, ఒక క్రమపద్ధతిలో సాగిన **"అమెరికీకరణ"** ద్వారా ప్రధానంగా సాధించబడింది. USA జాతీయ కుటుంబంలో ఉదయించిన ప్రతి శిశువూ అమెరికీకరణను పొందుతాడు. ఆ పొందడంలో, ఆ దేశపు జాతీయ భాష అయిన **"అమెరికన్ ఇంగ్లీషు"** నేర్పబడుతుంది. అమెరికా ప్రధాన భూభాగం మీదికి మొట్టమొదటిసారిగా ఆంగ్లేయులు వలస వచ్చినప్పటి నుంచి మొదలుకొని అమెరికా చరిత్ర బోధింపబడుతుంది. అమెరికా దేశీయ మహాపురుషులయిన వాషింగ్టన్, అబ్రహం లింకన్ మొదలయిన వారిని గూర్చి గౌరవభావన, ఆత్మీయ భావన, అమెరికా సంస్కృతినీ అక్కడి ప్రజాస్వామిక జీవన విధానాన్ని గూర్చి గర్వ భావన కలిగించ బడతాయి. ప్రతి పాఠశాలలోనూ, దైనందిన కార్యక్రమం అమెరికా జాతీయ పతాక వందనంతో అమెరికా జాతీయ గీత బృందగానంతో ప్రారంభమవుతుంది. వర్జీనియా రాజధానిగా 17వ శతాబ్దంలో వెలసిన విలియమ్స్ బర్గ్ పునర్నిర్మాణానికి కోట్లకొలది డాలర్లు వెచ్చింపబడినయి. అక్కడికి అమెరికా బాలబాలికలనూ యువకులనూ తప్పనిసరిగా తీసుకువెళ్తారు. అక్కడ ఆ బాలబాలికలూ యువకులూ, అమెరికా జీవిత వికాసాన్నీ, చరిత్రనూ తమకళ్ళతో చూస్తారు. జాగ్రత్తగా ఎన్నిక చేయబడిన కార్యక్రమాలలోనూ, చలన చిత్రాల లోనూ వాటిని గూర్చి వింటూ, కంటూ ఉంటారు.

USA లౌకిక రాజ్యమే అయినా, ప్రభుత్వ సమావేశాలు మాత్రమే కాకుండా, సెనేట్, కాంగ్రెస్ సమావేశాలూ, చివరకు నగరపాలక సంఘ సమావేశాలు గూడా ప్రొటెస్టెంట్ సంప్రదాయానుసారంగా, ప్రొటెస్టెంట్ గురువులు చేసే ప్రార్థనలతో ప్రారంభమవుతాయి. నేను USAలో పర్యటిస్తున్న సందర్భంలో ఒక అమెరికా మిత్రుడిని– దేశంలో రోమన్ కాథలిక్కులూ, యూదులూ, ముస్లింలూ, బౌద్ధులూ, హిందువులూ ఇంతింత అధిక సంఖ్యలో ఉన్నా గూడా ఇట్లాంటి సమావేశాల సందర్భాలలో ప్రొటెస్టెంట్ ప్రార్థనలను మాత్రమే ఎందు కనుసరిస్తారు?" అని అడిగాను. ఆయన ఆశ్చర్యంగా నా వంక చూచాడు "ఏం? ఎందుకు వ్యతిరేకించాలి? మేము దైవభీతి గల ప్రజలం. ఆ దైవాన్ని బహిరంగ సందర్భాలలో, ఈ దేశంలోని అత్యధిక సంఖ్యాకుల పద్ధతులననుసరించి మేము స్మరిస్తాము. అదే మా ప్రజాస్వామిక సంప్రదాయానుగుణమైనది" అని సమాధానం చెప్పినాడు.

ఇదిట్లా ఉండగా, కమ్యూనిస్టు దేశాలయిన USSR, చైనాలలోని స్థితిని గూడా గమనించవలసి ఉన్నది. వాటిని రాజ్యాలనడం కన్నా, సామ్రాజ్యాలనడం సమంజసం. ఆ రెండింటిలో గూడా విస్తృత భూభాగాలు చేరి ఉన్నాయి. అక్కడ విస్తృత ప్రజానీకమూ ఉన్నది. వీటికి రష్యా, చైనాల అసలు భూభాగంతో ఏ సంబంధమూ లేదనేది చరిత్ర ప్రసిద్ధమే. USSRలోని తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ లలోనూ, చైనాలోని సింకియాంగ్ మొదలయిన ఇతర భాగాలలోనూ, కోట్ల కొద్దీ ముస్లింలున్నారు. USSR, చైనాల జనాభాలలో అక్కడి ముస్లింల శాతం దాదాపుగా భారతదేశ జనాభాలో ఇక్కడి ముస్లింల శాతంతో సరిపోతుంది. అయితే ఆ దేశాలలో ఒక ప్రత్యేక మతవర్గంగా ముస్లింలను గూర్చి ఒక ప్రత్యేక రీతిలో వ్యవహరించడాన్ని గూర్చి ఎవరైనా విని ఉన్నారా? వారు మాట్లాడే ప్రాంతీయ భాషల పైన రష్యన్, హన్ చైనీస్ భాషలు బలవంతంగా రుద్దబడినయి. వారి పేర్లు రష్యణీకరణ లేదా చైనీయాకరణ పొందినయి. రష్యాలోనూ, చైనాలోనూ ఉన్న ముస్లింలను వారి పేర్లను బట్టి, అక్కడి రష్యన్ల నుంచీ చైనీయిలనుంచి విడిగా గుర్తుపట్టడం అసాధ్యం. ఈ దేశాల్లో అల్ప సంఖ్యాక ముస్లింవర్గం అన్నమాటయినా కనీసం, ఎవరూ విని ఉండరు. అక్కడి ముస్లింలు సంపూర్ణంగా రష్యణీకరింపబడినారు, లేదా చైనీయాకరింపబడినారు. వైయక్తికంగా వారు అనుసరించే మహమ్మదు మతం పైన మార్క్సు మరియు లెనిన్ మతాలు బలవంతంగా రుద్దిబడినయి. ఇదే విధానం, దేశ జనాభాలో 13శాతం ముస్లింలున్న యుగోస్లోవియాలో గూడా అనుసరింపబడింది.

## సాధన పంచకమ్

**ఏకాంతే సుఖమాస్యతాం పరతరే చేత స్సమాధీయతాం**
**పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతామ్।**
**ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలా న్నాప్యుత్తరైః శ్లిష్యతాం**
**ప్రారబ్ధం త్విహ భుజ్యతాం అథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్॥**

**తాత్పర్యం :** 1. ఏకాంతంలో సుఖంగా ఉండవలెను. 2. పరబ్రహ్మమునందు మనస్సును చక్కగా నిలుపవలెను. 3. పూర్ణాత్మను బాగుగా దర్శించవలెను. 4. బ్రహ్మానుభూతిలో ప్రపంచమును మిథ్యగా చూడవలెను. 5. సంచితకర్మలు చక్కగా విలీనం చేయబడవలెను. 6. జ్ఞానశక్తి చేత ఆగామికర్మ నుండి విడిపోవలెను. 7. ఈ లోకంలో ప్రారబ్ధ కర్మను పూర్తిగా అనుభవింపవలెను. 8. అటుమీదట పరబ్రహ్మ స్వరూపంగా భాసింపవలెను.

**వివరణ**


**1. ఏకాంతే సుఖమాస్యతామ్ –**


ఏకాంతంలో సుఖంగా కూర్చొని ఉండవలెను. **"స్థిరం సుఖం ఆసనమ్"** – స్థిరంగా, సుఖంగా అంటే హాయిగా కూర్చొనగలిగేదే ఆసనం అంటుంది యోగదర్శనం. కనుక సాధకుడు ఏ ఆసనంలో హాయిగా, సుఖంగా కూర్చోగలడో దానిని సుఖాసనం అంటారు. సుఖంగా కూర్చుంటే సరిపోదు. ఏకాంతంలో కూర్చోగలగాలి. మనిషి ఒంటరిగా ఉండగలడు. కాని ఏకాంతంగా ఉండలేడు. ఎందుకంటే తనలో తాను ఉంటేనే అది ఏకాంతం అవుతుంది. **'ఏకాంతే సుఖమాస్యతామ్'** – అనగా తనలో తాను, తనతో తాను హాయిగా, సంతృప్తిగా ఉండేటటువంటి నిర్మలమైన ప్రశాంతమైన ఒక ఆంతరంగిక వాతావరణమును సిద్ధపరచుకొని ఉండగలుగుటయే ఏకాంతంగా ఉండటం అనబడుతుంది.

**2. పరతరే చేత స్సమాధీయతామ్ –**

పరబ్రహ్మమునందు మనస్సును చక్కగా నిలుపవలెను. మనస్సు అతి చంచలమైనది. వాయువు కంటే మిగుల వేగవంతమైనది. దానిని నిగ్రహించడం దుస్సాధ్యమైన పనే. కాని అభ్యాసము, వైరాగ్యము ద్వారా మనస్సును నిగ్రహించడం సాధ్యమౌతుందని భగవద్వచనం. కావున సాధన ద్వారా సాధకుడు అంతర్ముఖుడు కావాలి. బహిర్వ్యాపారం మానుకొని నిర్మలమైన అంతర్ముఖంతో నిరంతరం పరబ్రహ్మమునందే మనస్సును నిలుపవలెను.

## సత్సంగం





### పుణ్యం, పాపాన్ని తుడిచి పెట్ట వేయలేదా?

"నేను చేస్తున్నా"ను అనే భావమున్నంత వరకూ మంచి పనులకైనా, చెడుపనులకైనా ఫలితాలని అనుభవించాల్సిందే. ఒక పనితో మరొక పనిని ఎట్లా ముడిపెట్టటం? "నేను చేస్తున్నా"నే భావం లేకపోతే మనిషిపై ఏ ప్రభావమూ ఉండదు. ఆత్మసాక్షాత్కారమైతేనే గాని "నేను చేస్తున్నా"ననే భావం పోదు. ఆత్మ సాక్షాత్కారమైన వానికి జపమవసరమేమిటి? తపస్సు అవసరమేమిటి? ప్రారబ్ధబలం వల్ల జీవితం కొనసాగి పోతుంది. కాని ఆత్మసాక్షాత్కారం పొందిన వాడు దేనినీ కోరడు. ప్రారబ్ధకర్మ మూడు రకాలు – ఇచ్ఛ, అనిచ్ఛ, పరేచ్ఛ అని – అంటే స్వయంగా కోరుకున్నది, కోరిక లేనిది, ఇతరుల కోరిక వల్లనయ్యేది.

ఆత్మ సాక్షాత్కారమైన వానికి ఇచ్ఛా ప్రారబ్ధముండదు. కాని మిగిలిన రెండూ ఉంటాయి. జ్ఞాని ఏమి చేసినా, ఇతరుల కోసమే. ఇతరుల కోసమేదైనా చేయవలసి వస్తే చేస్తాడు. కాని ఫలితాలు అతనినేమీ ప్రభావితం చేయవు. జ్ఞాని చేసిన పనులకు పుణ్యము గాని, పాపము గాని అంటవు. జ్ఞాని ఏమి చేసినా లోకం దృష్టిలో ప్రామాణికము, ఉచితమూ అయినదే చేస్తాడు.

ఈ జన్మలో తమ ప్రారబ్ధం ప్రకారం కొన్ని అనుభవించి తీరాలి అని తెలిసిన వాళ్ళు – ఆ అనుభవాల వల్ల ఏ వ్యాకులపాటునూ చెందరు. నీ సంకల్పమున్నా లేకపోయినా, నీకనుభవించాల్సింది నీ మీద తప్పకుండా పడుతుంది. దీనిని గ్రహించు.

జ్ఞాని ఏమి చేస్తాడనే విషయమై నీవు గొడవ పడటమెందుకు? నీ సంగతేమిటో నీవు చూచుకో. నీకు 'నేను దేహాన్ని' అనే భావముంది. అందువల్ల జ్ఞానికి కూడా దేహముందనే అనుకుంటున్నావు. తనకి దేహముందని జ్ఞాని అన్నాడా? అతనికి దేహమున్నట్లు నీకు కనబడవచ్చు, దేహంతో ఏవేవో పనులు చేస్తున్నట్టూ కనబడవచ్చు, కాని తనకి దేహమే లేదని జ్ఞానికి తెలుసు. మాడి మసి అయిపోయిన త్రాడు, త్రాడు లాగా కనబడినా దానితో దేనినీ కట్టలేము. జ్ఞానీ అంతే. అందరివలెనే కనబడవచ్చు. కాని అది బయటి ఆకారం మాత్రమే దేహంతో తాదాత్మ్యం ఉన్నంత కాలం దీనిని అర్థం చేసుకోవడం కష్టం. అటువంటి ప్రశ్నలకు "ప్రారబ్ధము పూర్తిగా క్షయమయే వరకూ జ్ఞాని యొక్క దేహం నిలుస్తుంది, ఆ తరువాత రాలిపోతుంది." అని ఒకోసారి సమాధానం చెప్తుతాం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 (25) UGC Care List Approved Journal
హైదరాబాద్ ఏప్రిల్ : 2023

## గ్రంథాంతరంగం 23

# పలుకులమ్మ తోటమాలికి అభినందన చందనం

**శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076**

ఆయన పుస్తకాలు చదువుతారు. తెగ చదువుతారు. వద్దంటే డబ్బు రాలిపడే సెంట్రల్ ఎక్సైజ్ డిపార్టుమెంటులో ముప్పైఆరేళ్లు పని చేసినా **'ఆముక్తమాల్యద'** ప్రబంధ కావ్యంలోని విష్ణుచిత్తుడిలా **'న్యాయార్జిత విత్తంబు'** వెచ్చించి పుస్తకాలూ, పత్రికలూ కొన్న సజ్జన శిరోమణి ఆయన. ఆ మహానుభావుడు సేకరించిన తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు పుస్తకాల సంఖ్య జూన్ 2017 నాటికే లక్షా మూడువేలు. తెలుగు, ఇంగ్లీషు పత్రికలు, కత్తిరింపులు మూడు లక్షలకు పైమాటే. ఆ పెద్దాయన ఆ పుస్తకాల, పత్రికల పుటలు మాత్రమే తిరగేశారా అంటే కాదండీ, పోతన మహాకవి చిత్రించిన భక్త ప్రహ్లాదుడిలా **'చదువులలోని సారమెల్ల జీర్ణించుకొన్న సారమతి'**. కవిబ్రహ్మ తిక్కన మాటల్లో చెప్తే ఆయన **'అమలోదాత్త మనీష'.** ఆమహానీయుని విశిష్టత ఏమిటంటే తాను అధ్యయనం చేసిన మంచి పుస్తకాల్ని చదవమని పదిమందినీ పురమాయిస్తారు. ఈ సత్తెకాలపు సత్తెయ్యలోని మరో సుగుణం ఏమిటంటే వాటిని కొని, పుస్తక ప్రియులకు ప్రేమతో పంపిస్తారు. ఇలాంటి పుస్తకప్రీతి ఎక్కడైనా కద్దంటారా? **'ఓదూ బరహక్కె శత్రు'** అంటారు కన్నడ ఆచార్య పుంగవులు కీ.శే. తి.నం. శ్రీకంఠయ్య. అంటే ఎక్కువగా చదివేవాళ్లు తక్కువగా, మరీ తక్కువగా రాస్తారని, మరి, ఈ తెలుగు, ఇంగ్లీషు ఘనాపాఠి సంగతి ఏమంటారా? ఈయన చదివిన చంద్రుడు, రాయని భాస్కరుడూనూ. హవ్వ!

ఇంతకీ ఈ పెద్దాయన ఎవరంటారు? గుంటూరు-6, 5వ లైను, బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య వీధిలో నెలకొన్న అన్నమయ్య గ్రంథాలయంలో ఊడిగ కాడు - లంకా సూర్య నారాయణ మహాభాగుడు. ఈ పుణ్యాత్ముడు తెలుగు ప్రజలకు, సాహిత్య ప్రేమికులకు చేసిన మహత్సేవ గురించి చెప్పాలంటే ఓ పెద్ద గ్రంథమే రాయాలి. ఈ పెద్దాయన, కొండంత మనీషి శ్రీ చరణాల ముందట గోరంత దీపం వెలిగించిన సుకవి సూర్యదేవర రవికుమార్ సూక్తి వినండి -

**"తన యూపిరి తన ధ్యానము**
**తన భావము తన తపమ్ము తన భాగ్యమ్మున్**
**తన సర్వము పుస్తకమై**
**మను నీ మహనీయమూర్తి నితయశుడే" (పలుకులమ్మ తోటమాలి, పేజీ: 189)**

తెలుగులో అభినందన గ్రంథాల రచనా సంప్రదాయం నెలకొని ఎనభైరెండేళ్లు దొర్లిపొయ్యాయి. సరస్వతీ పుత్రుల, లక్ష్మీకుమారుల షష్టిపూర్తి, సప్తతి, ఆశీతిల సందర్భంగా వెలువడ్డ అభినందన గ్రంథాలు నూటి దాకా వున్నయో, ఇంకా పైగానో? పరిశోధకులు తేల్చాలి మరి.

లంకా సూర్య నారాయణ గారికి ఎనభైఏళ్లు నిండిన శుభ సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ఆ కొండంత దేవునికి కొండంత పత్రి పెట్టలేక పోయినా, చేతనైనంత భక్తి శ్రద్ధలతో **'పలుకులమ్మ తోటమాలికి అభినంద చందనం'** మాత్రం పూయగలిగారు. అస్తు.


సాధారణంగా అభినందన గ్రంథాల శీర్షికలు మామూలుగా వుంటాయి. ఎంతో అర్థవంతంగా వుంటూ, లలితంగా కనపడుతూ పాఠకుల్ని సూదంటు రాయిలా ఆకర్షించే సన్మాన గ్రంథాలు సకృత్తే! పలుకులమ్మ అంటే చదువుల తల్లి సరస్వతి. పుస్తకాలు ఆమె



ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

చల్లనిచూపు వల్ల పుట్టి, పెరిగిన పూల మొక్కలూ, పండ్ల చెట్లే కదా. వాటికి పాదులు కట్టి, ఎరువులు పోసి, రోగాలూ రుజినాలూ రాకుండా మందూ, మాకూ చల్లి కంటికి రెప్పలా కాపాడే బాధ్యత తోటమాలిదే కదా. లక్షలాది గ్రంథాలు, పత్రికల, కత్తిరింపుల్ని కడుపులో పెట్టుకొనే గ్రంథపాలకుడు, పుణ్యశ్లోకుడూ లంకా సూర్యనారాయణ గారే కదా? ఆయన నిస్వార్థ, త్యాగమయ జీవితాన్నీ, ఉదాత్త ఆశయ, ఆచరణనూ తేటతెల్లం చేస్తుంది ఈ **'పలుకులమ్మ తోటమాలికి అభినందన చందనం.'** ఈ చందన చర్చ పలుకులమ్మ తోటమాలి లంకా వారికి ప్రత్యక్షంగా ఐతే, **'రమణీయ పుష్పవనం'** (కవివతంసులు కరుణశ్రీ గారికి నమస్సులతో)లో తిరిగే విహారులకు పరోక్షంగా ఆ సాహిత్య, సాంస్కృతిక సుగంధపు పరిమళాలు చల్లగా తాకుతాయి కదా.

**'పలుకులమ్మ తోటమాలికి అభినందన చందనం'** అభినందన గ్రంథ పరంపరలో ఉల్లేఖనీయమైనది. నలభైయాభై ఏళ్ల క్రితం, మరో పదో, పాతికో సంవత్సరాల క్రింద వెలువడ్డ అభినందన గ్రంథాల్లో అభివంద్యుడైన వ్యక్తి జీవితం, సాధన, సిద్ధుల గురించి కవితలూ, వ్యాసాలూ, సమీక్షలూ వుండేవి. అంతే కాకుండా అతడు కృషి చేసిన


లంకా సూర్యనారాయణ

రంగాలకు సంబంధించిన సుచింతిత, సుష్ఠు వ్యాసాలుండేవి. కాని ఇటీవల పుట్టుకొస్తున్న అభినందన గ్రంథాల్లో అభివంద్యుడైన వ్యక్తి జీవితం, సాధన, సేవల గురించే రచనలు సంకలింపబడుతున్నాయి. పుస్తక ప్రచురణ బరువు బాధ్యతలు చాలా వరకూ తామే మోస్తున్నందు వల్లా, స్వయమేవ రాజా, స్వయమేవ మంత్రి కావడం వల్ల సాహితీ మిత్రులూ, భక్త బృంద సభ్యులూ సన్మానిత వ్యక్తికి జయధ్వానాలు పలికి ఆ మహానుభావుని మురిపించి, తామూ మురిసిపోతున్నారు. మోపెడు రచనలతో ముద్రితాలవుతున్న ఈ బరువైన గ్రంథాలు వాపూ ఒక బలుపేనా అన్న ప్రశ్నకు సార్థక ఉదాహరణాలే. **'పలుకులమ్మ తోటమాలికి అభినందన చందనం'** తీరు తెన్నులూ వేరు. 240 పేజీలకు పరిమితమై, 51 పద్య గద్యాలతో శోభిల్లుతున్న ఈ సుందర, సురుచిర అభినందన గ్రంథానికి సంపాదకులు మోదుగుల రవికృష్ణ. విషయ వైవిధ్యానికీ, వైశిష్ట్యానికీ, ప్రాసంగికతకూ సంకేతమైన ఈ అభినందన గ్రంథాన్ని త్రికరణశుద్ధితో తీర్చిదిద్దిన సంపాదక మహాశయులు ప్రశంసనీయులు.

ఈ అభినందన గ్రంథంలో పుస్తక ప్రేమి, పూజారి, సంరక్షులైన లంకా సూర్యనారాయణ గారి గురించి ఏడువ్యాసాలు, నాలుగు కవితలున్నయి. ఎక్కువగా చదివి, తక్కువగా రాసిన రాయని భాస్కరులైన లంకా సూర్యనారాయణ గారి ఆరే ఆరు వ్యాసాల్ని మన మీ పుస్తకంలో చదవొచ్చు. ఇకపోతే ముట్నూరి కృష్ణారావు, నార్ల వేంకటేశ్వరరావు, తిరుమల రామచంద్ర, శ్రీశ్రీ, ఆరుద్ర, రాంభట్ల కృష్ణమూర్తి, సత్యం శంకరమంచి వగైరా సాహితీ వేత్తల విలువైన వ్యాసాలు **'అభినందన చందనం'** చల్ల దనాన్ని మరింత పెంచాయి.

లంకా సూర్యనారాయణ గారి జీవితాన్ని మలిచిన మహానుభావుల గురించి తెలుసుకోవాలంటే మోదుగుల రవికృష్ణ వ్యాసం **'సామాన్యుని అసామాన్య సేకరణ'** చదవాలి. ఈయనే రాసిన మరో ముఖ్యమైన వ్యాసం **'శారదానర్తన మందిరం- అన్నమయ్య గ్రంథాలయం.'** ఈ పుస్తకాలయంలో 68 శీర్షికల క్రింద 1,03,000 పుస్తకాలు తెలుగు, ఇంగ్లీషు, సంస్కృత భాషలకు సంబంధించినవి సూచింపబడ్డాయి. రామాయణాలు 550, భారతాలు 100, భాగవతాలు 300, జీవిత చరిత్రలు తెలుగు ఇంగ్లీషు- 5000, శతకాలు 1500, తెలుగు సాహిత్య సిద్ధాంత గ్రంథాలు -600, నిఘంటువులు - వివిధ భాషల్లో - 750, అభినందన గ్రంథాలు-600, యాత్రా చరిత్రలు-500, చెట్లు, పక్షులు- 200. ఇలా వివిధ విషయాలకు సంబంధించిన తెలుగు, ఇంగ్లీషులో వేలాది పుస్తకాలు లభిస్తాయి. ఈ వ్యాసం అన్నమయ్య గ్రంథాలయంలోని పుస్తకాల సిరిసంపదల్ని సూచిస్తుంది. రావెల సాంబశివరావు గారి వ్యాసం - **'గ్రంథకాపరి'**లో సూర్య నారాయణ గారు సాహిత్య వ్యాసంగంలో తనకిచ్చిన ప్రోత్సాహాన్నీ, తనకు చేసిన పుస్తక సహాయాన్ని ఎంతగానో కొనియాడారు. డా. ఆర్. భార్గవి గారు లంకావారు తనకు రచనా వ్యాసంగంలో అందించిన స్నేహ హస్తాన్ని తల్చుకుంటూ కృతజ్ఞతా పూర్వక వందనాలు అర్పించారు. **'పుస్తకాల మనిషి కేరాఫ్ గుంటూరు'** అన్న వ్యాసంలో వేంకటేశ్వర స్వామి ఆలయ శుచి శుభ్రతల్ని ఓవంక కాపాడుతూ ఆ గుడి నిర్వహిస్తున్న స్మశానవాటికను పూలతోటగా తీర్చిదిద్దిన దేవాలయ కమిటీని అభినందిస్తూ, అందుకు ఓ బాధ్యులైన లంకావారిని మనసారా పొగిడారు డా. భార్గవి. పది, ఇరవై ఏళ్ల కిందట బీభత్సంగా కనిపించే స్మశానాలు నేటి రోజుల్లో సుందరంగా, శుభ్రంగా, ప్రశాంతంగా రూపొందడం అటు జీవించివున్న వాళ్ల హృదయాలకు, ఇటు మరణించిన వాళ్ల ఆత్మలకూ శాంతి ప్రసాదిస్తుంది కదా!

లంకా సూర్యనారాయణ గారికి దేవుడి మీద, కర్మకాండల మీదా నమ్మకం లేదు. ఈ మాట అర్ధసత్యమేమో? అసలు సత్యమే కాదను కొంటాను. మన దృష్టిలో ముక్కోటి దేవతలున్నారు. ఇది ఇక్ష్వాకుల నాటి మాట కదా? మరి ఇప్పుడేమో ప్లేగమ్మ, కలరా అమ్మ, కరోనా అమ్మలు కొత్తగా పుట్టుకొచ్చారు కదా? మళ్లీ ఇలాంటి అమ్మలూ, అమ్మమ్మలూ, నాన్నమ్మలూ భవిష్యత్తులో ఎంత మంది పుట్టుకొస్తారో?

మనం దేవుళ్లనూ, దేవతలనూ పూజించేలా లంకావారు జపతపాలూ, యజ్ఞయాగాలూ చేయకపోవచ్చు. లంకా సూర్యనారాయణ గారి తల్లి తులశమ్మ, తండ్రి పెదలక్ష్మీనారాయణ గారలు, వీళ్లద్దరూ దేవతలే కదా! మరి పిల్లలు దేవుళ్లతో సమానమంటారు పెద్దలు. మరి లంకావారు పిల్లల్ని ఎంతగానో ప్రేమించారు, ప్రేమిస్తున్నారు కదా! లక్షలాది పుస్తకాల్నీ, పత్రికలనూ పూజించి, ప్రేమిస్తున్నారు కదా! అది చదువుల తల్లి సరస్వతి పూజే కదా? అలాంటప్పుడు ఈ పెద్దాయన నాస్తికులెలా అవుతారు? గుంటూరులోని దేవాపురం 5 వ లైనులోని స్వగృహం 'సూర్యలక్ష్మి'లో భార్యా, కొడుకు, కోడలు మనుమలతో, మనుమరాళ్లతో ఆనందంగా బంగారు బతుకు సాగిస్తున్న లంకావారు దిన నిత్యమూ నడిచే, గాలి పీల్చే శ్రీ వేంకటేశ్వరాలయ ప్రాంగణం, ఆయన ప్రియాతి ప్రియుడైన భక్తుడు అన్నమయ్య గ్రంథాలయం ఆయన ఎదలో కొలువై వుంటే ఆ పుణ్యాత్ముడు నాస్తికుడా? శాంతమ్ పాపమ్!

'పలుకులమ్మ తోటమాలి' గ్రంథ సంపాదకులైన మోదుగుల రవికృష్ణ అభిరుచి, అభినివేశం, సౌందర్య దృష్టి మెచ్చదగినవి. లేకపోతే ఇన్ని మంచి రచనలు – పాతవీ, కొత్తవీ ఈ సుకృతిలో చోటుచేసుకొని వుండేవా? శ్రీ రమణతో విశ్వనాథ వారి గద్య శైలిలో లంకావారి గురించి వ్యాసం రాయించడం ఎంత గొప్పపని! శ్రీ రమణ సూర్యనారాయణ గారి జీవిత తపస్సును ఎంత సుకుమారంగా ఎంత సురుచి పూర్ణంగా చిత్రించారని! ముందుకు నడవండి మరి– **"ఇతడు పుస్తకములను సేకరించును. అంతియేనా, పత్రికలలో వచ్చిన పద్యగద్య విశేషములను గత్తిరించి యొక చోట అతికించును. అది యొక అపూర్వ సంకలన మగును. అట్టివాని పదిలముగ నమర్చుకుని ఆనందించును. పేరు లంకా సూర్యనారాయణ యనిన తెలియుచునే యున్నది. ఇంక లంక విషయము తేలవలసి యున్నది. తేలకుండినను ప్రమాదములేదు. పుస్తక సేకరణ యితని కొకానొక వ్యసనమై, అరువ దేండ్లుగా వదలలేదు. దానికి జీవుడి వేదన తోడైనది. సృష్టిలో యొక వైచిత్రి గలదు. తేనెటీగ తిరిగి దిరిగి మధువు సేకరించును. అది త్రాగదు. మైనపు తుట్టెలో పొదుగును. దాని నైజము మనుజునకు ఆహారమైనది. ఔషధమైనది ఇంకేమియో అయినది. ఇది గూడనంతియే.'** (పేజీ: 105)

శ్రీరమణ అన్నట్లు లంకావారి బ్రతుకు పండింది. మరి ఆయన ఎంత మంది జీవితాల్ని పండించారో! తాళ్ళపాక అన్నమయ్య పసిడి పలుకుల్ని జ్ఞప్తికి తెచ్చుకుందామా మరి! **'ఇలలోని చింతాకు లెట్టు లెక్కపెట్టవచ్చు?"**

ఈ **'అభినవ చందనం'** లోని విషయ వైవిధ్యం చూడ చక్కనిది. మహా పండితుడు, చెయ్యి తిరిగిన రచయిత తిరుమల రామచంద్ర ఎవరికి తెలియదు చెప్పండి. ఆయన మేరుకృతి 'హంపీ నుంచి హరప్పాదాకా' జీవిత యాత్రలో ఈయన కోర్కెల్లో ఎన్నో తీరినాయి. కాని ఆయన ఒకే ఒక్క కోరిక తీరనే లేదు ఈ జన్మలో ఓ హొటలు పెట్టాలని ఆయన గొంతెమ్మ కోరిక. అతగాడు మద్రాసులో కొండంత ప్రయత్నం చేసి విఫల భగీరథులయ్యారు. పోతే పోనీ, ఆ రంగంలో కొంత అనుభవం సంపాదిస్తే అదే పదివేలనుకొని ఓ గుజరాతీ వైష్ణవ భోజన ఫలహార మందిరంలో పది, పదిహేను రోజులు పిండి రుబ్బి, పకోడీలు తయారు చేశారు. రెండు మూడు నెలల పాటు పనిచేసి, మరో హొటలులో గురువర్యులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారి సిఫారసు మీద కొంతకాలం సర్వరు పని చేసి, తప్పుకున్నారు. **"కాని, నాకు ఇప్పటికి 84 ఏళ్ళు నిండినా హొటల్ పెడదామనే వ్యామోహం పోలేదు. సహకరించేవారెవరన్నా ఉంటే చెప్పండి. ఒక వెలుగు వెలగడానికి ప్రయత్నిద్దాం."** (పేజీ: 52) ఆ పెద్దాయన చిన్ని కోరిక నెరవేరక పోయింది.

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి బందరు పట్నం తెలుగు నాటక రంగానికి ఎలా కేంద్రమయిందో, ఇక్కడ ఎవరెవరు నట



శిరోమణులుగా వెలిగారో, నాటక కర్తలుగా రాణించిన వారెంతమందో? ఈ విషయాలన్నింటినీ **'కొండ అద్దమందు కొంచెమై వుండదా?'** అని వేమన్న అన్నట్లు **'బందరు రంగం'** వ్యాసంలో గుదిగుచ్చారు.

లంకా సూర్యనారాయణ గారికి ఆరవ ప్రాణమైన పుస్తకం ఉప్పల లక్ష్మణరావు నవల **'అతడు – ఆమె'.** లంకా వారికి ఆ పుస్తకంలో ఎంతో ప్రీతిపాత్రమైన ఆవకాయ తయారీ గురించిన భాగాన్ని ఎన్నిక చేసి ప్రచురించారు సంపాదకులు. **'ఎంతో రుచి, ఎంతో రుచి, ఎంతో రుచిరా'** అనిపిస్తుంది. ఈ నవలాంశం పాఠక మహాశయులకు 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అసమాన ప్రతిభా విశేషాల్ని గుర్తించీ, నిరాదరించి ఆయన మరణించిన తర్వాత కర్పూర నీరాజనాల నెత్తిన **'కృతఘ్నాంధ్రు'** లందరిపై ఎన్ని కొరడా దెబ్బలు కురిపించారు. బసవరాజు అప్పారావుగారు **'మా గోపాలకృష్ణుడు'** అనే వ్యాసంలో పాత్రికేయునిగా తాను పడిన పాట్లు, దేశీ విదేశీ పత్రికా సంపాదకుల నుంచి తాను గ్రహించిన మెలకువలు, జీవితానుభవాలు నేర్పిన విలువైన పాఠాలు, ఇవన్నీ పోత పోసిన విగ్రహం– నవ మేధావి నార్ల వెంకటేశ్వరరావు గారిది. 'జీవితం నేర్పిన పాఠాలు – పత్రికా రచయితగా' అన్న నార్లవారి వ్యాసం చదివితే ఈనాటి పాత్రికేయులు కొందరైనా సుబుద్ధులవుతారేమో!

**'పలుకులమ్మ తోట మాలి'** సుగ్రంథం లోని ఒక్కో రచనా ప్రత్యేకమైనదే, విశిష్టమైనదే. తెలుగు సు(సి) తార భానుప్రియ పెద్దపెద్ద కళ్లు ఆమె ముఖానికి ఎంత అందాన్ని తెచ్చాయో! అలాగే ఈ పలుకులమ్మ తోటలోని రచనా పుష్పాలు ఈ సుకృతి సౌందర్యాన్ని ఇనుమడింప చేశాయి.

తాళ్ళపాక అన్నమయ్య **'కన్నులు గొప్పలైతే మొగము చక్కనైమించు'** అని వూరకే అన్నారా?

# మా కొండతల్లి

ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి
ఫోన్ : 9849307333

**"పెంచల ప్రసాద్ ! పరుగెత్తు, పరుగెత్తు ఇంకా స్పీడుగా పరుగెత్తూ వాటి చేతికి చిక్కామంటే చంపేస్తాయి"** అంటూ వెనుక మమ్మల్ని తరుముకొస్తున్న ఎలుగుబంట్లు ఎంత దూరంలో వస్తున్నాయో చూస్తూ ఇద్దరం తిరుపతి కొండ కిందుండే అడవిలో వాటి బారి నుండి తప్పించుకోవడానికి పరుగెత్తుకొస్తున్నాం.

**"సార్! ఎలుగుబంట్ల వేగం మనకు రాదు సార్!. ఎక్కడో ఉన్న అవి మన దగ్గర కొచ్చేస్తున్నాయి సార్!. పైగా నా కాలికి రాయి తగిలి రక్తం కారుతోంది. చెప్పులు కూడా వదిలేసి పరుగెత్తుతున్నాను సార్! ఆగి రాళ్ళు తీసుకొని కొడ్దామా సార్?"** అన్నాడు పెంచల ప్రసాద్.

**"చాలా ప్రమాదం! రాళ్ళు తగిలినా, తగలక పోయినా అవి మనల్ని వెంటాడడం మానవు. పరుగెత్తి తప్పించుకోవడమే మార్గం"** అంటూ పరుగులు తీస్తూ అడవి బయట పడడానికి దారులు వెతుక్కుంటూ దక్షిణ దిశగా పరుగెత్తుతున్నాం.

కాస్త దూరంలో చెట్ల గుబుర్ల నుండి ఫారెస్టు వర్కర్ హఠాత్తుగా మా ముందొచ్చి నిలబడ్డాడు. అతని చేతిలో బారెడు దివిటీ ఉంది. వెంటనే ఆలస్యం చేయకుండా చేతిలోని అగ్గిపెట్టి తీసి దివిటీని వెలిగించాడు. పరుగున వస్తున్న రెండు ఎలుగుబంట్లు సడెన్ బ్రేక్ వేసినట్లు ఆగిపోయాయి. ఒక్క ఉదుటున వెనక్కి తిరిగి కొండవైపుకు పారిపోయాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగెత్తుకొని వెళ్తున్న మాకు ఉన్నట్టుండి అతను రావడం... దివిటీ వెలిగించడం... అవి పారిపోవడం మాకు ఆశ్చర్యమనిపించింది.

**"ఎవరు సార్! మీరు? ఈ కొండంచుకెందుకొచ్చారు. మొదట్లో ఉండే మా ఫారెస్టోళ్ళు మిమ్మల్ని లోపలికెట్లా పంపించారు సార్?"** అని అడిగాడు ఫారెస్ట్ వర్కర్ మాస్కులతో ఉన్న మా ముఖాలు చూసి.

"ఈయన మా సార్... యూనివర్సిటీలో ప్రొఫెసర్. కొండ ఆనుకొని అడవిలో ఉండే ఒకప్పటి నీటి గుంటలు నేడున్నాయో? లేదో? చూడడానికొచ్చాం. మా సార్ తిరుపతి మీద పరిశోధనలు చేసి ఇప్పటికే చాలా పుస్తకాలు రాశారు. కొండ ఆనుకొని అలిపిరి నుండి శ్రీవారి మెట్టు, చంద్రగిరి వరకు ఎన్నో నీటి గుంటలు ఆనాడు నడచివెళ్ళే యాత్రికులు ఉపయోగించేవారని చెప్తుంటే నేనే మా సార్‌ను బతిమలాడి ప్రాచీనమైన నీటి గుంటలను ఒక దాన్నైనా చూపించండి సార్! అంటే సారు కొండకింద దట్టమైన ఈ అడవిలో ఉండే నీటి గుంటను నాకు చూపించడానికి తీసుకొచ్చారు. అలిపిరి, చెర్లోపల్లి బైపాస్ రోడ్డు గుండా అరవింద్ కంటి హాస్పిటల్ దాటుకొని రోడ్డును క్రాస్ చేసి అడవిలోకి దూరాం. మోటర్ బైక్ శబ్దానికి ఫారెస్టోళ్ళు మమ్మల్ని ఎక్కడికెళ్తున్నారని అడిగారు. సార్ గురించి చెప్పాం. జాగ్రత్తగా వెళ్ళండి సార్! తల్లీ బిడ్డా జంట చిరుతలు తిరుగుతున్నా యన్నారు. అడవిలో మోటర్ బైక్‌పై రాగలిగినంత దూరం వచ్చి రాళ్ళు రప్పలు, ఎగుడు దిగుడులుండే బాట పక్కనే బండిని ఆపేసి నడుచుకొంటూ, తారాడుకొంటూ వెదకి చెట్ల మధ్య ఉండే ఈ నీటి గుంట దగ్గరకొచ్చాం. సెల్ ఫోన్లలో ఫోటోలు తీసుకొన్నాం. మేము ఎక్కడ పులులొస్తాయో అని అనుమానిస్తుంటే ఈ ఎలుగుబంట్లు వచ్చాయి. ఇది ఏప్రిల్ నెల కదా? ఎండ తీవ్రతకు నీళ్ళు తాగడానికి నీటి గుంటలోకి అవతలి గట్టున దిగుతూ మమ్మల్ని గమనించాయి. మేము వాటిని చూసి పరుగు లంఘించుకొన్నాం. మా దగ్గర ఆయుధాలుంటే మీరు కేసు పెడ్తారని ఉత్త చేతుల్తో వచ్చాం. పైగా ఇద్దరమే వచ్చాం దేవుడిలా నువ్వొచ్చి వాటిని తరిమేశావు" అన్నాడు. నా పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్న పరిశోధక విద్యార్థి పెంచల ప్రసాద్.

**"నిన్నెక్కడో చూసినట్లుందే"** అన్నాను నేను ముఖానికున్న మాస్కును తొలగిస్తూ.

"సార్ ! మీరా? మీరు రోజు సాయంత్రం వేదిక్ యూనివర్సిటీలోని ఎస్.పి. బంగ్లా ముందు వాకింగ్ వెళ్తుంటారు కదా సార్!. అక్కడ నేను డ్యూటీ చేస్తుంటాను. ఈ రోజు నన్ను, మరికొంతమందిని ఫారెస్టు డ్యూటీకి పంపారు. అక్కడక్కడా మేము చెట్ల కింద ఉంటాం సార్!. భోజనం వేళకు ఫారెస్టు జీపులో అన్నం పొట్లాలొస్తాయి. ఇది ఎండా కాలం కదా సార్! ఎవరైనా అడవికి నిప్పు పెట్టినా, వేడి ఎక్కువై అంటుకున్నా మేము వెంటనే ఆర్పేయాలి. అదే మా డ్యూటీ. మా రక్షణ కోసం కొన్ని జాగ్రత్తలు తీసుకొంటుంటాం. నేను మీ అలికిడి చూసి మీరు ఎవరై ఉంటారా? అనుకుంటూ వస్తుంటే మిమ్మల్ని ఎలుంగొడ్లు తరుముకోవడం చూసి దివిటీ తీసుకొచ్చాను సార్" అన్నాడు ఫారెస్టు వర్కర్.

**"మీరు అడవిలో ఇలా ఉంటే భయం ఉండదా?"** అడిగాడు పెంచల ప్రసాద్.

"ఎందుకుండదు... మేమూ మనుష్యులమే. జంతువులను ఎలాగోలా తరిమేస్తాం. ఎటొచ్చి మనుష్యులతోనే తలనొప్పి. ఒక్కోసారి మమ్మల్ని కొండ మీదుండే అడవిలో డ్యూటీ వేస్తారు. ఎర్ర చందనం కూలీలు, స్మగ్లర్లు మమ్మల్ని చంపడానికి కూడా వెనకాడరు. దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షు మాది. మాలాంటి ఫారెస్టు వర్కర్లు వందలాది ఈ కొండ అడవుల్లో పనిచేస్తున్నారు. ఇక మీరు వదండి సార్! మా ఆఫీసర్లు బీట్‌కు ఏ సమయంలోనైనా రావొచ్చు. మీతో

నన్ను చూస్తే తిడ్తారు" అంటూ మా బైక్ దగ్గరకొచ్చి సాగనంపాడు.

బైక్ స్టార్ట్ చేసి మౌనంగా యూనివర్సిటీలోని తెలుగు విభాగాని కొచ్చి నా గదిలో కూర్చున్నాం. అప్పటికే నా గదిలో తక్కిన పరిశోధక విద్యార్థులు దర్గాబాబు, పరసు మణి, జయ ప్రకాష్, నరసప్పలు కూర్చొని ఉన్నారు. ఇంతలో స్ప్రింగ్ గ్లాస్ డోర్ తోసుకొని ప్రముఖ చారిత్రక వేత్త డా॥ ఈమని శివనాగి రెడ్డి వచ్చాడు.

**"అయ్యా! నమస్కారాలు"**

**"అన్నా! ఏంది? చెప్పాపెట్టకుండా హైదరాబాద్ నుండి వచ్చేశావు"** అన్నాను.

**"చంద్రగిరిలో ఒక శాసనం బయట పడితే నన్ను చూడడానికి పిలిచారు. అర్జంటుగా మరో పని కూడా ఉంటే రెండూ ఒకేసారి చేసుకొని పోదామని వచ్చాను"** అన్నాడు శివనాగి రెడ్డి.

**"రా అన్నా! కూర్చో!"** అంటూ కూర్చోబెట్టి నేను కూర్చున్నాను.

"ఇంత దూరం వచ్చి నిన్ను చూడకుండా పోతే నువ్వు నన్ను తిరుపతి గంగ జాతర బూతులు తిట్టవూ? అందుకే నిన్ను చూసి వెళ్దామని వచ్చా... ఏమిటి తమ్ముడు డల్‌గా కనిపిస్తున్నావు?" అడిగాడు శివనాగిరెడ్డి.

అడవిలో జరిగిందంతా చెప్పాడు పెంచల ప్రసాద్.


**"ఫీల్డ్ వర్కుల్లో ఇవన్నీ మామూలే కదా? నేను గుళ్ళూ, గోపురాలు, శాసనాల వెంటబడితే, నువ్వు తిరుపతి అడవులు, కొండా కోనలు, తీర్థాల వెంట తిరుగుతుంటావు. మనం చచ్చేంత వరకు పని పెడుతున్న దేవుడికి ధన్యవాదాలు చెప్పుకోవాలి"** అని కిసకిస నవ్వుతూ అన్నాడు శివనాగిరెడ్డి.

క్యాంటీన్ ఓనర్‌కు ఫోన్ చేసి కూల్ డ్రింక్స్ పంపమన్నానో లేదో వెంటనే కూల్ డ్రింక్స్ నా గదికి వచ్చేశాయి. కూల్‌డ్రింక్స్ తాగుతూ పిచ్చాపాటిగా మాట్లాడుకోవడం మొదలు పెట్టాం.

**"అన్నా! ఈ రోజు నిద్రలేచి ఎవరి ముఖం చూశామో ఏమో? అడవిలో చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లయింది"** అన్నాను.

**"నీకిది మామూలే కదా? గతంలో కూడా నువ్వూ, ఆదిశ్రీ కొండ మీద నామాలగవి కెళ్ళినప్పుడు ఎలుగుబంటి తరుముకుంది కదా?"**


**"అవునన్నా! అప్పుడు కూడా భలే తప్పించుకున్నాం... ఒకసారి పాపనాశనానికి బైక్ మీద ఫీల్డు వర్క్‌కు వెళ్ళి వస్తుంటే తిరుమల సమీపంలోని పారువేట మంటపం వైపుకు ఏనుగుల గుంపు వచ్చేసింది కదా? వెంటనే వెనుదిరిగి వేణుగోపాలస్వామి గుడి దగ్గరకొచ్చి ఫారెస్టు వాళ్ళకు ఫోన్లో చెప్తూనే వాళ్ళు జీపులేసుకొచ్చి డప్పులు వాయించి, టపాసులు కాల్చి అడవిలోకి పంపేశాక మేము తిరుమల చేరుకొన్నాం"** అన్నాను.



**"ఇప్పుడు తిరుపతి వాసులకు ఏనుగుల బెడద ఎక్కువైపోయింది. మొన్న తిరుపతి – తిరుచానూరు మధ్య ఉండే శిల్పారామం దగ్గర ప్రధాన రహదారిపైకి ఏనుగులు వచ్చి హల్‌చల్ చేశాయి కదా? కాలనీలలో తిరుగుతూ ఫారెస్టోళ్ళ మళ్ళింపుతో అవి స్వర్ణముఖి నదిలో సంచరిస్తూ చెరుకు తోటల మీద పడి తింటూ, ధ్వంసం చేస్తూ, పొలాలను తొక్కేస్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నాయి కదా? అవి శేషాచలం కొండల నుండి రేణిగుంట వైపొచ్చి తూకివాకం గ్రామం గుండా శిల్పారామం చేరుకోవడమంటే మాటలు కావు. ఏనుగులు గ్రామాల మీద పడడం ఇన్నాళ్ళు చూశాం. ఇప్పుడు తిరుపతి పట్టణం నడి బొడ్డులోకి వచ్చేస్తున్నాయి. ఇది చాలా ప్రమాదకరం"** అన్నాడు శివనాగిరెడ్డి.

**"ఏనుగులు కొండా కోనలు అడవుల్ని వదిలి పెట్టి జనావాసాల మీదకెందుకొస్తున్నాయి సార్?"** అన్నాడు పెంచల ప్రసాద్.

"కొండల్లో, అడవుల్లో సరైన మేత, నీళ్ళు దొరకనప్పుడు, అడవులకు విద్రోహులు నిప్పు పెట్టినప్పుడు అవి జనావాసాల మీద కొచ్చేస్తున్నాయి. పైగా వాటికి కావలసిన చెరుకుతోటలు, చెరువుల్లోని నీళ్ళు పుష్కలంగా ఉండడంతో అవి ఇక్కడిక్కడే తిరుగుతూ, మెల్లగా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్తూ ఆ తర్వాత సమీపంలోని అడవుల్లోకి పోతున్నాయి. శేషాచలం అడవుల్లో ఇలా అనేక ఏనుగుల గుంపులు రూటు మార్చుకొని తిరుపతి, తలకోన, కుప్పం, సదుం, సోమల, చంద్రగిరి, పలమనేరు ప్రాంతాల్లో తిరుగుతూ, మామిడి, చెరుకు తోటలను, వరి పైర్లను ధ్వంసం చేస్తూ, పొలాల దగ్గర కావలున్నవారిని తొక్కి చంపుతూ, మోటారు పంపు షెడ్లను కూల్చేస్తూ వీరవిహారం చేస్తున్నాయి. కొన్ని ఏనుగులు కరెంటు తీగలకు తగులుకొని, మరికొన్ని బావుల్లో పడి మరణిస్తున్నాయి. ఇటీవల ఏనుగుల సంతతి బాగా అభివృద్ధి చెందాయి. జనావాసాల్లోకి వచ్చిన వీటిని మళ్ళీ అడవుల్లోకి మళ్ళించేందుకు ఫారెస్టు వాళ్ళు కుంకీ ఆపరేషన్ చేపడుతున్నారు. దాని ద్వారా ఏనుగులను దారి మళ్ళిస్తారు. కుంకీ అంటే శిక్షణ పొందిన ఏనుగు. కొన్ని ఏనుగులు



పక్కనే ఉన్న తమిళనాడులోని సత్యమంగళం నుంచి కౌండిన్య, అక్కడి నుంచి శేషాచల అడవుల్లోకి వలస వచ్చి ఇక్కడే ఆవాసాలు ఏర్పరచుకొని సంతానం వృద్ధి చేసుకొంటూ గుంపులు, గుంపులుగా విడిపోతున్నాయి. జనావాసాలపై పడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి" అన్నాను.

**"చిరుత పులులు మన ఎస్వీ యూనివర్శిటీలోనే తిష్ట వేసుకొని ఉన్నాయి సార్! రోజూ చీకటి పడగానే జింకల కోసమో, కుక్కల కోసమో వచ్చి వాటిని చంపి లాకెళ్ళిపోతున్నాయి. వార్తాపత్రికల్లో, న్యూస్ ఛానెల్లో వార్తలు వస్తూనే ఉన్నాయి"** అన్నాడు దర్గాబాబు.

"ఇంతెందుకు సార్! ఆ మధ్యన ఒకసారి ఈ ఆర్ట్స్ బ్లాకు పక్కనే రెండు చిరుతలు రెండు లేగ దూడలపై నడి రోడ్డుపైనే దాడి చేసి చంపేశాయి. అంతెందుకు ఈ మధ్యనే రాత్రి ఎనిమిదిన్నరకు ఒక పులి తెలుగుశాఖ ముందు పడుకొని ఉన్న కుక్కను చంపి ఈ గది ముందే లాక్కెళ్ళి మిద్దెపైన ఉండే ఉర్దూ డిపార్ట్‌మెంటు ముందు తినేసి వెళ్ళిపోయింది" అన్నాడు పరసు మణి.

**"అప్పుడు ఎవరూ లేకపోవడం వల్ల ఇబ్బంది తప్పినట్లుంది"** అన్నాడు శివనాగిరెడ్డి.

**"ఎవరూ లేక పోవడమేమిటి సార్ ! మహేషన్న థీసిస్‌ను దిద్దుతూ సారు గది లోపలే ఉన్నాడు. స్ప్రింగ్ డోర్ మూసుకొని ఉండడం వల్ల బయట ఏం జరుగుతుందో తెలియకుండా పోయింది. సారు మహేషన్న తొమ్మిదిన్నరకు గది బయటకొస్తే దారిపొడవునా రక్తసిక్తమై ఉన్న నేలను చూసి ఆశ్చర్యపోయారు. తర్వాత తెలిసిందేమిటంటే పులి తెలుగుశాఖలో కుక్కను వేటాడి సార్ గదిముందే లాక్కెళ్ళి పక్కనే ఉన్న మెట్లెక్కి పోయిందని"** అన్నాడు నర్సప్ప.

"ఫారెస్టోళ్ళకి చెప్తే వాళ్ళు కరోనా లాక్ డౌన్ వల్ల యూనివర్సిటీలో జన సంచారం తగ్గిపోయిందని చిరుతలు కుక్కల కోసం ఎస్వీ యూనిర్సిటీలోనే కాకుండా పక్కనే ఉన్న వెటర్నరీ యూనివర్శిటీలో కూడా తిరుగుతున్నాయని, బహుశా అవి తల్లీ బిడ్డా కావొచ్చని, మీరు జాగ్రత్తగా ఉండాల్సిందే గానీ, మేము చేయగలిగిందేమీ లేదని సంఘటనా స్థలాన్ని చూసి చెప్పి వెళ్ళిపోయారు" అన్నాడు దర్గాబాబు.

**"సార్ ! మొన్న, నేను సారు సాయంత్రం చీకటి పడేవేళ వేదిక్ యూనివర్శిటీలో వెళ్తుంటే అడవి పందులు గుంపులు కొట్లాడుకొంటూ ఉన్నట్లుండి మా ముందరికొచ్చేశాయి. వాటి మధ్యలో ఇరుక్కొని పోయినట్లనిపించింది. కొట్లాడుకుంటూ ఎలాగో రోడ్డు క్రాస్ చేసేశాయి"** అన్నాడు జయప్రకాశ్.

"సార్ ! మా గది ముందుండే చెట్ల గుబుర్లో ఎన్నోసార్లు కుందేళు ్ళండడం చూశాం. అంతెందుకు ఈ గదిలోనే ఆరేడు పాముల్ని చంపాం. మామూలుగా పాములను చంపడానికి సారు ఒప్పుకోరు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో మా గదిలోకొచ్చి దాక్కున్న పాముల్ని చంపాల్సి వచ్చింది. ఒకసారి సార్ ఆర్. ఎం. ఉమామహేశ్వర రావు థీసిస్‌ను కరెక్షన్ చేసేటప్పుడు ఈ గది కిటికీ దగ్గర ఏదో శబ్దం వచ్చింది. సారు వెళ్ళి మెల్లగా కర్టెన్ ఎత్తి చూస్తే ప్రమాదకరమైన వొలికిలి పాము పడుకొని ఉంది. ఇక తప్పదన్నట్లు కర్ర తెచ్చి పాముతో చిన్నపాటి యుద్ధం చేసి సారు చంపాల్సివచ్చింది. మా స్కాలర్ల గ్రూపులో అది కొనవూపిరిలో కొట్టుమిట్టాడుతున్న వీడియోను సారు పోస్ట్‌చేశాడు. ఆ సమయంలో కరోనా లాక్‌డౌన్ వల్ల స్కాలర్లు అందుబాటులో లేక పోయేసరికి సారే పామును దూరంగా పడేసి వచ్చి, ఈ గదినంతా ఫినాయిల్‌తో శుభ్రం చేసుకొన్నారు" అన్నాడు పెంచల ప్రసాద్.

"అన్నా ! ఇప్పటికీ నేను నా గదిలోకి ప్రవేశించే ముందు అన్ని మూలలు చూసి అలికిడి చేసి లోపలికొచ్చి కూర్చుంటాను. నేను ఎన్నో ప్రమాదాల నుండి బయటపడడానికి కారణం ఈ కొండేనని నమ్ముతాను. ఈ కొండకు అంత మహిమ ఉందని నేను భావిస్తాను. మీకు చెప్పే ఉంటాను. ఒక కథలో రాసుకొన్నాను కూడా. నేను ఇరవై ఏళ్ళకు ముందు శేషతీర్థానికి స్నేహితులతో వెళ్ళాను. రెండు ఇరుకు కొండల మధ్య, రెండు మడుగులు ఈది శేషతీర్థం సొరంగంలోకి చేరుకోవాలి. సొరంగం లోపల శేషతీర్థాన్ని ఫోటోలు తీస్తుంటే, తడిసిన ఒళ్ళు, బట్టల వల్ల అడుగుతీసి అడుగు వేసినప్పుడు నున్నటి బండల మీద కాలుజారి పడిపోయాను. ఖరీదైన కెమెరా, ఫ్లాష్ గన్ లేకపోయి ఉంటే సొరంగం మధ్యలోని నీళ్ళల్లోకి దూకేసి ఉండేవాడిని. కెమెరాను కాపాడుకోవడం కోసం జలపాతం గుండా నీళ్ళల్లోకి జారిపడి చెయ్యి విరిగిపోయింది. అక్కడి నుంచి బయటపడాలంటే రెండు కొండల మధ్య ఇరుక్కొని పోయిన పెద్ద రాతి గుండు ఎక్కిదిగాలి. ఆ తర్వాత రెండు మడుగులు ఈదాలి. చెయ్యి విరిగి పోయింది. అయినా ఈత కొట్టాల్సిందే. బాధను తట్టుకోవడం కోసం నేను అరచిన అరుపులతో లోయ దద్దరిల్లి పోయింది. బయటకొచ్చాక నిటారుగా కదిలే రాళ్ళు రప్పలుండే కొండ

ఎక్కాలి. ఆ తర్వాత కొండపైకి చేరుకొంటాం. అక్కడ్నించి కొండ మీదుండే అడవి గుండా నడచివస్తే గోగర్భం తీర్థం, ఆ తర్వాత తిరుమల వస్తుంది. తిరుమల నుండి మోటర్ బైకుల్లో స్నేహితులతో పాటు తిరుపతి చేరుకొన్నాను. నాకు చిన్నప్పటి నుండి ఈ కొండంటే పిచ్చి. పుట్టినప్పటి నుండి అమ్మను, కొండను చూడకుండా ఉండలేను. చిన్నప్పటి నుండి ఇంటి బయటకొచ్చినా, వీధుల్లో ఆడుకొంటున్నా, కొండను చూడకపోయినా కొండ ఏదో విధంగా నా కంట్లో పడ్తుంది అమ్మ రూపంలా. చివరికి రాత్రి పూట ఎండాకాలంలో మిద్దెక్కి పడుకొన్నా కొండ నడకదారి, నామాల లైట్లు చూసి దండంపెట్టి పడుకోవాల్సిందే. నిద్రలేస్తూనే ఎవరినీ చూడకుండా కళ్ళు తెరచి కొండను చూసి దండం పెట్టుకోవాల్సిందే. ఇవన్నీ మాకు చిన్నప్పటి నుంచి మా అమ్మా నాయనలు నేర్పిన సంస్కృతి. హైస్కూల్లో చేరాక నా స్నేహితులతో కలిసి కపిలతీర్థం పైకెక్కి పేటుల్లో మునిగి ఈత నేర్చుకోవడమే కాకుండా సెలవు దినాలంతా కొండమీదుండే పేటుల్లోనే గడిపేవాళ్ళం. తిండి సమయానికి ఇంటికొచ్చి తిండి తిని మళ్ళీ కొండెక్కే వాళ్ళం. ఒక్కోసారి బడి నాలుగ్గంటలకు వదిలితే పుస్తకాలను ఇంట్లో పడేసి స్నేహితులతో కలసి ఎండాకాలం సాయంత్రం ఆరు ముప్పావు వరకు అంటే చీకటి పడే వరకు కొండ దిగేవాళ్ళం కాదు. చీకటి పడ్డాక కళ్ళు పెద్దవి చేసుకొని దిగేవాళ్ళం. కపిల తీర్థం పేటుల నుండి దిగేటప్పుడు మూడడుగుల ఏటవాలు బండమీద కాలు పెట్టిదాటుకోవాలి. ఆ బండ నునుపుదేరి ఉంటుంది. పొరపాటుగా అక్కడ్నుంచి పడి కిందున్న కోనేట్లో ఎంతోమంది ప్రాణాలు వదిలారు. ఇక వర్షాకాలం వస్తే కోనేటిలోకి పడే నీళ్ళను పడనివ్వకుండా యాత్రికులను ఏడిపించడం కోసం నీటి ప్రవాహానికి అడ్డంగా పడుకునే వాళ్ళం. కిందున్న యాత్రికులు గోల చేస్తే లేచేవాళ్ళం. అప్పుడు నీళ్ళు కిందపడేవి. అలా చేస్తూ ఎంతోమంది కిందకొచ్చి పడి చనిపోయారు. ఇక కపిల తీర్థం పక్కనున్న అడవుల్లోకి వెళ్ళి పొదల మధ్య ఉండే కలేకాయలు, బిక్కి , ఊటిపండ్లను తినేవాళ్ళం. ఎలక్కాయలను రాళ్ళతో కొట్టి తినేవాళ్ళం. మాలాడ గుండం ఎక్కి స్నేహితులతో పాటు గాలాలు వేసి చేపలు పట్టేవాళ్ళం. అదో ఆట. ఆ తర్వాత ఆ చేపల్ని అక్కడే పడేసి, గాలాలను చెట్ల పొదల్లో దాచిపెట్టి ఇండ్లకు చేరుకొనేవాళ్ళం. ఈత కొట్టడం వల్ల కళ్ళు ఎర్రబడ్తాయి. మా అమ్మ అడిగితే కంట్లో దుమ్ము పడిందని అబద్ధాలు చెప్పేవాళ్ళం. అసలు విషయం తెలుసుకున్న మా అమ్మ నన్ను కింద పడదోసి ఎగసెగిసి తన్నేది. ఆ దెబ్బలు నాకు దున్నపోతు మీద వాన పడ్డట్టే. లేచి ఒళ్ళు దులుపుకొని షరా మామూలుగానే నా పని నాదే. ఐదో క్లాసు పాసైనప్పటి నుండి కొండకు స్నేహితులతో పాటు నడిచి వెళ్ళేవాడిని. అవ్వాచారి కోనలో ఈతపండ్లుకోసం లోయలోకి దిగేసేవాళ్ళం. అప్పుడు కూడా జంతుజాలం నుండి, పురుగూ, పుట్ర నుండి కొండ మమ్మల్ని కాపాడింది. చిన్నప్పుడు అంటే రెండు, మూడు తరగతుల్లో మా ఇంటి చుట్టూ ఉండే మగ, ఆడ పిల్లలు



కపిలతీర్థం వెళ్తుంటే వాళ్ళతో పాటు నేను వెళ్ళిపోయా. కపిలతీర్థానికి వెళ్ళాక దర్శనం చేసుకొన్నాక పెద్ద గాలీ వాన, చీకటి పడిపోయింది. పాలిటెక్నిక్ కళాశాల వరకు రావాలంటే ఒకటిన్నర కిలోమీటరు రావాలి. దారిలో ఒక్క ఇల్లు కూడా ఉండదు. అంతా అడివే. వాన పెరుగుతూనే ఉంది. తగ్గలేదు. అప్పుడు మా నాయన దేవస్థానంలో పనిచేసే బంధువుల సహాయంతో దేవస్థానం బస్సునే తీసుకొచ్చి మమ్మల్ని ఇంటికి చేర్చాడు. వర్షంలో చీకటిలో బిక్కు బిక్కుమని గడుపుతున్న మాకు కొండే కొండంత ధైర్యాన్నిచ్చింది. నేను ఇప్పటికీ దేశ విదేశాలు వెళ్ళినా ఇరవై రోజుల పైన ఎక్కడా గడపలేదు. తిరుపతి వదలి వెళ్ళినా కనుచూపు మేరలో తిరుపతి కొండ కనిపిస్తూనే అమ్మను చూసినంత ఆనందమేస్తుంది. దగ్గరకొచ్చే కొద్దీ అమ్మను చేరుకుంటున్నట్లుంది. అమ్మ పంచే ఆత్మీయతే నాకు కొండ పంచుతుంది. కొండమీద విహరిస్తుంటే అమ్మ ఒళ్ళో ఆడుకుంటున్నట్లే ఉంటుంది. ఇదంతా ఎందుకు గుర్తు చేస్తున్నానంటే కొండ నన్ను రక్షించింది. ప్రమాదాల నుండి బయటేసింది. ఈ కొండ కోనల్లోని కారడవుల్లో వెళ్తుంటే నన్ను అమ్మలా అనురాగంతో కంటికి రెప్పలా కాపాడింది. ఇంకా చెప్పాలంటే నా జీవితమే కొండ. కొండే నా జీవితం. తిరుమల కొండే నా దేవత అన్నాను.

**“సార్! మా సారు మా రీసెర్చ్ స్కాలర్లను తీసుకొని ప్రతి సంవత్సరం తిరుమల కొండ మీదుండే చాలా తీర్థాలను చూపించాడు సార్! రాత్రి వేళల్లో కొండ లోయల్లో గడపడం చాలా గమ్మత్తుగా ఉంటుంది సార్!”** అని పెంచల ప్రసాద్ శివనాగిరెడ్డితో అన్నాడు.

“మన దేశంలోనే కాదు చాలా దేశాల్లో కొండే దైవం. కొండను పూజించేవారు. ఇంతెందుకు ఆళ్వారులు తిరుమల కొండను దైవంగా పూజించి కొండను ఎక్కేవారు కారు. అంటే కొండ మీద పాదం మోపేవారు కారు. దూరం నుంచే కొండకు నమస్కరించేవారు. అలా ఆళ్వారులు కొండనే పవిత్రమైందిగా భావించేవారు. వేదాలకు ముందే కొండలను పూజించే ఆచారం మనకుందనడానికి ఎన్నో ఆధారాలున్నాయి. మానవుడు కళ్ళకు కనిపించని దేవునికి తన స్వరూప స్వభావాలను ఆపాదించడానికి పూర్వమే దేవతలుగా కొండను, నదులను, చెట్లను పూజించాడు. పర్వత, వృక్ష పూజలు సింధూనది నాగరికతలోను, వేదాలలోను, జానపద విజ్ఞానంలోను,



గిరిజనుల ఆచారాల్లోను మనం చూడొచ్చు. గిరిజనులంతా పర్వత పూజారులని చెప్పాలి. ప్రపంచంలోనే అనేక ప్రాచీన నాగరికతల్లో కొండను ప్రాణమున్న దేవతగానే భావిస్తారు. చైనా, జపాన్, కొరియా, పర్షియా, మెక్సికో, సెమిటిక్ ప్రజలు కొండలకు దేవతల పేరును పెట్టి పూజిస్తారు. కెల్టిక్ ప్రజలు పెనైన్ ఆల్ఫ్స్ అనే కొండను ప్రొవినినస్ అనే దేవతగా తలచి ఆరాధిస్తారు. ప్రాచీన కాలంలో పర్షియన్లు తమ ఆల్బూర్జ్ కొండే ప్రపంచంలో మొదటి కొండగా భావించి, సూర్యచంద్రులు ఈ కొండ చుట్టూ తిరుగుతారని వెలుతురు ఈ కొండలోంచే వెలుపలికొచ్చి మాయమైందని వాళ్ళు నమ్ముతారు. కొత్త మతాలొచ్చేవరకు వాళ్ళు కొండపైన విగ్రహాలను ఉంచి ఆరాధించేవారు. టిబెట్‌లో కొండలను, గుట్టలను ఇప్పటికీ వారు పూజిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ హిమాలయాలు, కైలాసగిరి, వింధ్య, మందర, మలయ, మహాబల, సహ్య, అహోబల, సింహాచల, మంగళగిరి, పెంచలకోన, శ్రీశైలం, తిరుపతి వంటి అనేక కొండలు మనకు పవిత్ర క్షేత్రాలయ్యాయి. వేదాల్లో కొండలను కీర్తిస్తూ అనేక మంత్రాలున్నాయి" అన్నాడు శివనాగిరెడ్డి.

**'సార్! తిరుపతి కొండకు శేషాచలమనే పేరుంది కదా? మీరేమో కొండను తల్లితో పోలుస్తున్నారే?'** అని అడిగాడు దర్గాబాబు.

"తిరుపతి కొండను ఏడుకొండల గుంపని లేదా ఏడు శిఖరాలున్న కొండ అని అంటారు. తిరుపతి నుండి నడిచేవారికి ఒకప్పుడు ఎక్కడి నుంచి ఎక్కడికి కొండ ముగుస్తుందో తెలియజేస్తూ ఏడు కొండల పేర్లను బోర్డులను పెట్టారు ఆనాటి దేవస్థానం వారు. నేడు ఆ బోర్డులు తీసేశారు. ఏడవ కొండ మీద గుడి ఉంది. పురాణాల్లో ఏడు కొండలకు ఏడు పేర్లున్నాయి. అందులో ఒక పేరు అంజనాద్రి. ఈ పేర్లు ఒకే తిరుపతి కొండకు వేరు వేరు కాలాల్లో వచ్చినట్లుగా చెప్తారు. అంటే కృతయుగంలో ఈ మొత్తం తిరుపతి కొండ అంజనాద్రిగా వ్యవహరింపబడిందని, ద్వాపర యుగంలో శేషాచలంగా, కలియుగంలో వేంకటాచలంగా పిలవబడిందని ఒక పురాణం చెప్తుంది. కాబట్టి తిరుపతి కొండను మన పురాణాలు స్త్రీ రూపంగా కూడా తలిచాయి. అందుకే హనుమంతునికి జన్మనిచ్చిన అంజనాదేవి కొండ అయింది" అన్నాడు శివనాగిరెడ్డి.

"ఈ కొండ హనుమంతునికే తల్లి కాదు. నాకు కూడా తల్లే. నా దినచర్యల్లో రోజూ కొండ కింద వాలు వెంబడి నడవడం. అప్పుడప్పుడు కొండెక్కి చెట్ల మధ్యలో నడుస్తూ తీర్థాలు చేరుకోవడం. అక్కడే ఒకటి రెండు రోజులు గడపడం. కొండ మీద చెట్లమధ్య వెళ్ళేటప్పుడు కొండతల్లి ఒళ్ళో నుండి వచ్చే శబ్దాలు, గాలి హెూరు, ఆకాశాన్నంటే చెట్లు, అరుదైన ఎర్ర చందనం వృక్షాలు, అడవిపూల వాసనలు, పక్షుల కిలకిలా రావాలు, గద్దల అరుపులు, నెమళ్ళ క్రేంకారాలు, కొండ మీద పరుగులు తీస్తూ జలపాతాల వైపుకెళ్ళే సెలయేటి గలగలలు. జలపాతాల హెూరు, విష సర్పాలు, బంగారు బల్లులు, కొండ చిలువల మందగమనాలు, దుప్పుల, లేళ్ళ విన్యాసాలు, ఏనుగుల ఘీంకారాలు, చిరుతపులుల ఘర్జనలు, రేచు కుక్కల హడావిడి, ఎలుగుబంట్ల ఒయ్యారాలు చెప్పుకుంటూ పోతే మా తిరుపతి కొండ తల్లి ఒడిలో తన బిడ్డల సయ్యాటలుగా కనిపిస్తాయి. మా కొండ తల్లి ఎర్రంచు జరీ కలిగిన ఆకుపచ్చ పట్టుచీర కట్టుకొని పేరంటానికి వెళ్ళేందుకు సిద్ధమైనట్లు రోజూ కనిపిస్తూ కనువిందు చేస్తుంటుంది" అన్నాను.

**"మీరు నిజంగా అదృష్టవంతులు సార్! మీరు ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి ఈ కొండతో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్నారు"** అని నన్ను చూసి అన్నాడు పెంచల ప్రసాద్.

**"మనం కూడా కొండతల్లి బిడ్డలమే కదా సార్? కొండ అంచున, కొండ వాలులోనే మన యూనివర్సిటీ ఉంది. రోజూ కొండగాలి పీలుస్తున్నాం. ఎండాకాలం కొండ వదిలే వడగాలులను భరిస్తున్నాం. చలికాలం కొండ మంచులో తడుస్తున్నాం"** అన్నాడు పరసు మణి.

**"నిజమే మనం కూడా ఆ కొండ తల్లి బిడ్డలమే. అయితే ఇక్కడ తిరుగాడే జంతుజాలంతో కొండ తల్లికి ఆపద కలగదు. మనుష్యులమైన మన వల్లే కలుగుతుంది"** అన్నాను.

**"ఎలా సార్ ?"** అడిగాడు నర్సప్ప.

"మనలాగే కొండ తల్లికి బిడ్డలైన జంతువులను వేటాడి చంపేస్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా దొరకని అరుదైన ఎర్రచందనం చెట్లను అతి దారుణంగా నరికేసి కొండతల్లి గుండెల్లో రంపపు కోత కోస్తున్నాం. బొగ్గుల కోసం కొండకు నిప్పు పెట్టి ఆ తల్లిని సజీవ దహనం చేస్తున్నాం. కన్న తల్లిదండ్రుల ఆస్తిని లాగేసుకొని ఇంటి నుండి వెళ్ళగొట్టడమో, శ్మశానాల్లో వదిలేయడమో, ఘోరంగా చంపేయడమో చేస్తున్న మానవులకు కొండ తల్లి క్షోభ ఒక లెక్కా" అంటూ కొండతల్లి అంచున కట్టిన తెలుగుశాఖ భవనం నుంచి నిట్టూరుస్తూ అందరం బయట కొచ్చాం.

మా వెనుక వైపున్న తిరుపతి కొండతల్లి మాత్రం బిడ్డల కాఠిన్యాన్ని కడుపులో దాచుకొని మమ్మల్ని నిండు మనసుతో ఆశీర్వదిస్తూ తనివితీరా చూస్తోంది. ఎంతైనా తల్లి తల్లే... బిడ్డలు బిడ్డలే కదా?.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 (33) హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# ఉత్తర హరివంశం – సాంఘిక, సాంస్కృతిక అంశాలు

**డా. ఎన్. ఈశ్వర్ రెడ్డి,** తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, ఫోన్ : 94901 92228

సకలాగమ వేది, అష్టాభాషా కవిత్వ విశారదుడు, నవీన గుణసనాథుడు నాచన సోమన. పెన్నా నది పరివాహ ప్రాంతంలోని బుక్కరాయపురము అనే నామాంతరం గల పంచాకల దిన్నె (పెంచుకల దిన్నె) అనే గ్రామాన్ని అగ్రహారంగా సంగమ భూపాలుని తృతీయ పుత్రుడు విద్యానగరాధిపతి అయిన బుక్కరాయలు నుండి దానంగా స్వీకరించాడని తెలుస్తోంది. ఈయన రాసిన ఉత్తర హరివంశం 14వ శతాబ్దం నాటి సామాజిక సాంస్కృతిక చారిత్రక విశేషాలను వింగడించింది. హరిహరాద్వైతాన్ని బలపరుస్తూ నాచన సోమన రాసిన ఉత్తర హరివంశం తెలుగు సాహిత్య చరిత్రలో ఎంతో ప్రఖ్యాతిగన్న కావ్యంగా గుర్తింపు పొందింది. హరివంశం ఆధారంగా నాచన కాలం నాటి సాంఘిక ఆచారాలను పరిశీలించడం ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

**1. కరచాలనం :** మనకు ఆధునిక కాలంలో షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడం ఆంగ్లేయులతో వచ్చిందని చాలామంది భావిస్తుంటారు. అయితే నాచన సోమన రాసిన హరి వంశాన్ని పరిశీలిస్తే కరచాలనం యొక్క ప్రాచీనత అర్థమవుతుంది. కరచాలనం నాచన కాలం నుండి గాక వ్యాస మహర్షి కాలం నుండి కూడా ఆచరణలో ఉన్నట్టు విమర్శక వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు.

"శ్రీకృష్ణుడు పుత్రుడి కోసం శివుని గూర్చి తపస్సు చేస్తాడు అతని తపస్సుకు మెచ్చిన శివుడు ప్రత్యక్షమవుతాడు ప్రత్యక్షమైన శివుని చూసిన కృష్ణుడు తన ఆనంద హర్షాతిరేకాలను ప్రకటిస్తూ..

**"అనుచున్ లోచన పుండరీకములలో నానంద బాష్పాంబువుల్**
**ధనుశీమంబుల కాంకురంబులు ప్రమోదంబు బ్రకాశింప న**
**వ్వనజాక్షుండు చెలంగుచుండ గని సర్వజ్ఞుండు యోగేంద్ర వా**
**జ్మన సాగమ్యుడు కేలు గేల గడియ న్మన్నించె గృష్ణుం గృపన్"**
**(2వ ఆశ్వాసం, 177వ పద్యం)**

శ్రీకృష్ణుడు తన ముందు సాక్షాత్కరించిన శివుని చూసి పట్టరాని సంతోషంతో తన్మయుడైపోతాడు. అందుకు నిదర్శనంగా ఆనందభాష్పాలు కలవాడై శరీరమంతా గగుర్పాటుకు గురవుతుంది. అది చూసి భక్తపరాధీనుడైన పరమేశ్వరుడు శ్రీకృష్ణుని పరమ ఆదరంగా చూస్తూ కరచాలనం చేసి చేరదీస్తాడు.

**2. కందుక క్రీడ :** (ఫుట్‌బాల్) మనుషులు జట్లుగా విడిపోయి కాలితో ఆడే బంతిని మనం ఫుట్‌బాల్ అని పిలుస్తున్నాం. ఈ క్రీడ ఈనాటిది కాదు. హంస డిభకులచే బాధించబడ్డ దుర్వాస మహర్షి మొదలైన వారు తమ బాధల్ని శ్రీకృష్ణుడికి చెప్పుకోవడానికి ద్వారకకు వెళ్లారు. ఆ సమయంలో సాత్యకి మొదలైన వారు జట్లుగా ఏర్పడి బంతాట ఆడుకుంటూ ఉంటారు.

**"వాకిట నిల్చెలోన యదువల్లభుడాడుచు నుండె గోళముం**
**గైకొని సాత్యకిం గడవ గాలను గేల నమర్చి చిమ్ముచున్**
**లోకులునుం గుమారులు లోనుగ నుద్దుల కుద్దులై వినో**
**దైక పరాయణుందును ననేక విధంబుల జుట్టి యాడగన్"**




**(4వ ఆశ్వాసం, 80వ పద్యం)**

'సాత్యకి గోళాన్ని (బంతిని) తీసుకొని కాలిదగ్గర పెట్టి తన్నుతూ ఉన్నాడు. ఇతరులు రెండు జట్లుగా విడిపోయి ఆడుకుంటున్నారు. అనేక విధాల తిరుగుతూ ఆడుకుంటున్నారు. అనడంలో మనకు ఫుట్‌బాల్ క్రీడే గుర్తొస్తుంది.

**3. అధికారిక అనుమతి పత్రం:** (పాస్పోర్ట్ వీసా) : నాచన కాలం నాటికి అధికారిక అనుమతి పత్రం లాంటివి అమలులో ఉండేవని తెలుస్తుంది. అవి ఈనాటి పాస్పోర్టు వీసాలకు సమానంగా గుర్తించవచ్చు. కోటలను, రాజ్యాలను రక్షించుకోవడం కోసం శత్రు రాజ్యాల నుండి వచ్చే వారు మోసాలకు పాల్పడకుండా లేదా మోసాలకు గురికాకుండా ఉండడానికి ముద్రికలను చారులకు అందించేవారని తెలుస్తోంది.

**"ఈ కోటకు నొక దిక్కున**
**వాకిలి సారించి యానవాలుగ జారుల్**
**రాకల బోకల జక్రము**
**జేకొని రక్షకుల తోడ జెప్పి చనదగున్"**
**(2వ ఆశ్వాసం, 93వ పద్యం)**




కోటకు నాలుగు దిక్కుల నాలుగు ప్రవేశ ద్వారాలు ఉండేవని శత్రువులు ప్రవేశించకుండా అన్ని ద్వారాలు మూసి ఒక ద్వారం ద్వారానే రాకపోకలు జరిపేవారని తెలుస్తోంది. చారులు శత్రు దేశాలకు వేషాంతరాలలో వెళ్లి వస్తూ ఉంటారని, వారి వేషాలలో వేరే ఎవరైనా లోనికి ప్రవేశించి కోటకు నష్టం కలిగించే అవకాశం ఉన్నందున, వారికి గుర్తుగా **చక్ర ముద్రాంకితమైన** ముద్రికను అందించేవారని, ఎవరైనా కోట లోపలికి ప్రవేశించాలంటే అధికార ముద్రిక తప్పనిసరి అని నిర్ణయించేవారు.

**4. వేట :** నూతన సంవత్సర కాలానికి వేటలు ఎలా ఉండేవో హంస డిభకాదుల ఆధారంగా వివరించే ప్రయత్నం చేశాడు. వాటి స్వరూప స్వభావాలను తన కావ్యంలో రాశాడు నాచన సోమన (4వ ఆశ్వాసంలో 24 నుండి 29 పద్యాలు).

**"ఆయుధాలను ధరించి భటులతో కలిసి కోలాహలంగా వేట ప్రారంభించారు. ఆ గోలకు మృగాలన్నీ కకావికలంగా పరుగెడుతున్నాయి. పందులు గుంపుగా పరుగందుకున్నాయి. భటులు వాటి వెంటబడి చిందర వందర చేస్తున్నారు. సీసపు గుండులా వేగంగా పరుగెడుతూ, ఒళ్ళు తెలియకుండా మృగాల వెంటపడి వాటిని మలుపుతూ 'మన్నుబోతు'తో (అడవిదున్నలతో) కలిసి పొదలను దాటిపోతున్నారు. వాటిని పట్టి పడేస్తున్నారు. అలా పడినవాటి నాలుగు కాళ్ళు కట్టిపడేస్తున్నారు. ఆ అలజడికి తుప్పల్లో దూరే దుప్పులను వేటాడుతున్నారు. అమ్ముల దెబ్బలకు కదుతులు (కణుతులు), ఈటెలకు, వేట కుక్కలకు దొరికిపోయే మృగాలను, చిందర వందరగా పరుగెత్తే కుందేళ్ళను, వలలకు చిక్కి దొరికిపోయిన అనేక జంతువులను వొలిచి తీసుకున్నారు.! అలా వేటాడి అలసిపోయిన హంస డిభకులు సేనా సమేతంగా వేటమాని వెళ్ళారు."** అంటాడు. ఎన్ని రకాలుగా వేటాడేవారో దీన్ని బట్టి అర్థమౌతుంది.

**5. ఉప్పన బట్టె లాటలు :** నాచన కాలానికి ఉప్పనపట్టెలాటలు ఉండేవని తెలుస్తోంది.

హంసడిభకులు రాజసూయయాగం తలపెట్టి, జనార్దనుని రాయబారిగా శ్రీకృష్ణుని దగ్గరకు పంపిస్తారు. 'అప్పనము'గా ఉప్పు ఇస్తే చాలని చెప్తారు. ఆ మాటలు విన్న శ్రీకృష్ణుడు జనార్దనునితో...

**"అప్పన మెంతగావలె నహంకరణంబు దొఱంగి యిచ్చినన్**
**గప్పముపేర, నేడు నొడి కారితనంబున మోసపుచ్చగా**
**నుప్పులుదెత్తురే సమరయోగ్యతలంబున వైరికోటితో**
**నుప్పున బట్టె లాడునెడు నుప్పులు దెత్తురు గాక యాదవుల్ "**
**(నాల్గవ ఆశ్వాసం,155 పద్యం)**

'యాదవులు వ్యక్తిత్వాన్ని చంపుకుని (అహంకరణంబు దొఱంగి) కప్పం అని చెల్లించినట్టయితే ఆ కానుక (అప్పనము) ఎంతటిది కావాలేమిటి? ఉప్పు రాయి ఇచ్చినా.. మేరు పర్వతం ఇచ్చినా ఒక్కటే, కప్పం కప్పమే. వ్యక్తిత్వాన్ని చంపుకున్నట్టే' **"శౌరిని ఇయ్యాగమునకు వేగ రమ్మనుము, యాదవులచేత లవణమెంతేని నడుగుము"** అని పదాలు జాగ్రత్తగా పేర్చుకుని కప్పం అనే మాట రాకుండా, ఇంత అని చెప్పకుండా, శత్రుత్వం స్ఫురించకుండా మాట నేర్పరితనంతో, మాయచేస్తే ఉప్పు తీసుకువస్తారా మా యాదవులు? తీసుకురారు. సమరానికి యోగ్యమైన ప్రదేశంలో శత్రుసమూహంతో ఉప్పన బట్టెలాడేటప్పుడు తప్పకుండా ఉప్పును తీసుకువస్తారు" అంటాడు కృష్ణుడు. దీన్నిబట్టి ఆ రోజుల్లో ఉప్పన బట్టలు ఆటలు ప్రాచుర్యంలో ఉండేవని అర్థం చేసుకోవచ్చు. (పద్య కవితా వైభవం-1, బేతవోలు రామబ్రహ్మం)

**6. ద్యూతం (జూదం) :** రుక్మిణి సత్యభామ శ్రీకృష్ణులను ఆధారం చేసుకుని ఆనాటి సంకేతాలతో వారు ఆడిన జూద కలాపాన్ని చిత్రించాడు నాచన సోమన (3వ ఆశ్వాసం 123 - 130 పద్యాలు)

'శ్రీకృష్ణుడు రుక్మిణిలు దాయాలాడుతున్నారు. ఒకరు కోరిన సంఖ్యను మరొకరు వేస్తున్నారు. గెలుపు ఓటములను లెక్కచేయక, మోసపోకుండా పందెం అడుగుతుంటే (నిమ్మపండు) బత్తాయి విసరడం, వాటిని పట్టుకొని తినడం, గెలిచాననగానే ముఖం తిప్పుకోవడం వంటివి చేస్తోంది రుక్మిణి. అంతేగాక

**"పలుకదు రోషించి పదని పాసికలతో**
**నవదాయమైనను నాడుగాని**
**యొల్లదు గోపించి యొందు నెత్తము వన్న**
**నెచరంబు నేర్పని యెన్నుగాని**

నడుకదు వంచించి నయ మెక్కుడడిగిన
నిలుత మింతట నన్న నిలుచుగాని
పలక దఱుమక బయసుక పల్లటిలక
బోటి దూఱక యా తావు వచ్చు మనక
క్రింద గెలిచిన వ్రాలు లెక్కింపు మనక
తప్పనాడక, తొల్లింటి దారిచెడక"
(3వ ఆశ్వాసం 124వ పద్యం)

ఇలా నిజాయితీగా దాయాలాట ఆడుకున్నారని నాచన రాస్తాడు. పాచికలాడే వారి మానసిక స్థితిని కూడా ఎత్తిచూపాడు సోమన. ఈ పాచికలాటే ధర్మరాజాదులను అరణ్యాల పాలు చేశాయి.

**7. దండయాత్ర :** నరకాసురుడు ఇంద్రుడి నగరమైన అమరావతిపై దండెత్తిన విధానం 13,14 శతాబ్దాలలో తురుష్కులు భారతదేశంపై చేసిన దండయాత్రలను గుర్తుచేస్తాయి . వారు చేసిన బీభత్సాల మాదిరిగా నరకాసురుని అమరావతి దండయాత్ర ఉందని విమర్శకులు పేర్కొంటున్నారు.(1వ ఆశ్వాసం, వచనం 81) ఇంద్రుని ఓడించి దేవతలను కకావికలు చేసిన నరకాసురుడు ఊరశితో సంవాదం పూర్తయిన తర్వాత దేవతా వనంలో ఉండే కల్ప వృక్షాలను చాలావరకు పెళ్లగించేసాడని ఎనిమిది వేల ఏనుగులను తనతో తీసుకొని తమ రాజధాని అయిన మాహిష్మతి పట్టణానికి వెళ్ళాడని చెప్తారు.

తురుష్కుల దండయాత్ర గండికోటను కూడా నష్టపరిచింది. గండికోటలో ఉన్న హరిహర రూప విగ్రహాన్ని ధ్వంసం చేయడం ఈనాటికీ కనిపిస్తుంది. నరకుడి అమరావతి విధ్వంసం గండికోట విధ్వంసానికి దగ్గరగా ఉందని గుర్తించవచ్చు. సోమన సమకాలీన చరిత్రను కావ్యంలోకి తెచ్చినట్టయింది.

**9. పెద్దల వద్దకు ఒట్టి చేతులతో వెళ్ళకూడదు :** పెద్దల దగ్గరకి వెళ్లేటప్పుడు వట్టి చేతులతో వెళ్లకూడదని మన పెద్దలు చాలా సార్లు మనకు చెప్పే ఉంటారు. ఇది ఒక విలువగా, ఒక గౌరవంగా సమాజంలో ఏనాటి నుండో స్థిరపడిందని ఈ హరివంశం కావ్యం ద్వారా తెలుస్తుంది. (1వ ఆశ్వాసం, 114, 115 పద్యాలు) నరకాసురుడు చేత బాధింపబడ్డ భరద్వాజ, కాశ్యప, వశిష్ట, వాసుదేవ, జాబాలి, కణ్వ, బృహదశ్వ, ధూమ్ర మొదలైన మునులు శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్తూ ఒట్టి చేతులతో వెళ్లకూడదని, అది మంచి సంప్రదాయం కాదని చెప్తారు. అంతకుముందు నారాయణుడుగా తపస్సు చేస్తూ బదరీఫలంబులు (రేగి పండ్లు) చాలా ఇష్టంగా తినేవాడని, కాబట్టి వాటిని తీసుకెళ్లడం సముచితమని తెలియజేస్తారు.


**10. చరిత్ర - సంప్రదాయం :** నాచన సోమన సంప్రదాయాన్ని చరిత్ర ఆధారంగా చిత్రించడం ఒక ఎత్తైతే ఆనాటి వ్యవస్థలోని ప్రత్యేక పద్ధతులకు భావుకతకు జోడించి రచన చెయ్యడం మరో ఎత్తు.

"యదుకులాంబుధి చంద్రునానందమున జూచు
రామాది హితచకోరములలోన
దనుజారి పారిజాతము జేరి పొదిగొన్న
రాజన్య రాజకీరములలోన



వసుదేవసుత సరోవరములో నోలాడు
సనకాది దివ్యహంసములలోన
గోపాల నవపుష్పగుచ్ఛంబు మూగిన
పరిచారికా ద్విరేఫములలోన
గలయ దొలు బాము నోములు గలవు
గాన సెలవులేక జన్మంబులు చెడియె-
నాకు - మీద జన్మంబు గలుగ
నిర్మించెనేని కమలజుని పేర దాపటి కాలి బొమ్మ"
(4వ ఆశ్వాసం, 137వ పద్యం)

ఈ పద్యం నాచన సోమన సంవిధాన చక్రవర్తిత్వానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. యదువంశంలో శ్రీకృష్ణుని పాత్ర ఎంత గొప్పదో తెలియజేస్తూ శ్రీకృష్ణుని దర్శించుకుంటే మరుజన్మ ఉండదని, ముక్తి తప్పక లభిస్తుందని జనార్దనుడి ద్వారా చెప్పిస్తాడు. అంతటితో ఆగక ఒకవేళ బ్రహ్మ మళ్లీ జన్మను ఇస్తే అంటే జన్మరాహిత్యం ప్రసాదించకుంటే, బ్రహ్మ బొమ్మను ఎడమ కాలికి కట్టుకొని అవమానపరుస్తాను అంటాడు. ఇక్కడ ఒక చారిత్రక సంప్రదాయ విషయాన్ని అక్షరబద్ధం చేశాడు సోమన. **"పూర్వకాలంలో మహారాజులు తాము జయించిన శత్రురాజుల బొమ్మల్ని ఎడంకాలి మీద పచ్చబొట్లు పొడిపించుకునే వారట. గండ పెండేరాల మీద చెక్కించి కాలికి తొడుక్కునే వారట. మరికొందరు తీవ్ర స్వభావులు కాళ్ళ మీద చిత్రింప చేసుకునే వారట.**




**ఇలా దారుణంగా అవమానించి సంతృప్తి పడే వారట"** అంటున్న ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి మాటలు ఉటంకించదగినవి.

**11. రాచనగరు సంప్రదాయాలు :** రాచరిక వ్యవస్థలో రాజనగరుల స్థితిగతులు, రాయబారులు పాటించవలసిన సంప్రదాయాలు, సభా మండపంలో స్థాయిల వారీగా ఏర్పాటు చేసుకుని ఆసనాలు, వారికి సేవలందించే పరిచారికలు తదితర అంశాలను ప్రస్ఫుటంగా చిత్రించాడు సోమన.

ద్వారకానగర ప్రవేశం చేసిన జనార్దనుడు అక్కడ ఉన్న ద్వారపాలకులతో తన రాకని ఎరిగించి, రాజుకు (శ్రీకృష్ణుడికి) వర్తమానం పంపించాడు. ఆయన అనుమతి లభించింది. లోపలికి వెళ్ళగానే శ్రీకృష్ణుని దర్శించి ఆయన చుట్టూ ఉన్న పరిస్థితులను గమనిస్తాడు. ఆయనకు రాజ సింహాసనం చుట్టూ ఉన్న విషయాలు అవగతమవుతాయి.

**"కనియం గౌస్తుభరత్న భూషణు వలత్కర్పూర హారావళి**
**వనితా చాలిత తాళవృంత పవన వ్యాధూత చేలాంచలున్**
**మనుజాధీశ కిరీట కోటి పరిషన్మధ్యస్థ సింహాసనాం**
**కుని దేజః ప్రసర ప్రభాత తరణిన్ గోపాల చూడామణిన్".**
**(4ఆశ్వాసం-140 పద్యం).**

ఇందులో సింహాసనాధిష్ఠుడైన రాజు కనిపిస్తాడు. ఆ రాజు చుట్టూ ఎలాంటి వాతావరణం ఉందో మనకు ఇక్కడ తెలియజేస్తాడు. కావ్యానికి సంబంధించి శ్రీకృష్ణుడి ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి దాన్ని మనం అలా ఉంచి, చిత్రీకరణలో సోమన ఎంచుకున్న విధానం తను చూసిన ఒక రాజుదై ఉంటుందని అర్థం చేసుకోవచ్చు.

రాజు సింహాసనం మీద ఆసీనుడై ఉండటం, కుడి ఎడమల నిలిచి వనితలు వయ్యారంగా వీవనలు అంటే తాళవృంతాలు వీయడం, ఆ చిరుగాలులకు పీతాంబరాల అంచులు సుతారంగా ఊగడం, చెలికత్తెలు పొడవైన కర్పూర హారావళులు ధరించడం, కర్పూర సుగంధం నిండిన పిల్ల గాలులు మనోహరంగా వ్యాపించడం వంటి అంశాలు ఒక రాజాస్థానాన్ని చూస్తేగానీ వర్ణించలేరు. ఇలాంటి వర్ణనలు ఆనాటి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తాయనడానికి సందేహం అక్కర్లేదు.

తిక్కన వారసత్వాన్ని అందిపుచ్చుకొని రచనలు సాగించిన గొప్ప కవి నాచన సోమన. సోమన కాలానికి సంబంధించి చాలా వాదనలు ఉన్నాయి. బుక్కరాయలు సోమన్నకు దానం చేసిన తామ్ర శాసనం ఆధారంగా ఇతడి కాలాన్ని 1344గా పరిశోధకులు నిర్ధారించారు. అంటే సుమారు 1300 నుంచి 1380 మధ్యకాలంలో జీవించి ఉంటాడని విమర్శకులు భావిస్తున్నారు. ఇతను ఎర్రన సమకాలికుడు కానీ, కొంచెం తర్వాతవాడు గానీ అయి ఉంటాడని, అద్దంకిలో ఎర్రన హరివంశం రాస్తున్నాడని తెలిసి, సీమ ప్రాంతానికి చెందిన సోమన పూర్వ హరివంశాన్ని వదిలేసి ఉత్తర హరివంశం చేపట్టి ఉంటాడని కూడా విమర్శకులు అభిప్రాయం. స్థూలంగా 14వ శతాబ్దానికి చెందినవాడని నిర్ణయించుకుంటే ఆయన కవిత్వంలో కనిపించే చారిత్రక, సాంస్కృతిక అంశాలు ఆ కాలానివిగా మనం గుర్తించాల్సి ఉంటుంది.

**ఆధార గ్రంథాలు**

1. ఉత్తర హరివంశము - నాచన సోమన (ప్ర.ము. 1970), నాట్యకళ ప్రెస్, హైదరాబాద్ - 4.

2. ఉత్తర హరివంశము : వ్యాఖ్యానం-వేదము వెంకట రామన్ (1998), రాఘవేంద్ర నగర్, హైదరాబాద్ - 52.

3. ఉత్తర హరివంశము : సుందర వ్యాఖ్యానం : పోతుకుచ్చి సుబ్రహ్మణ్య శాస్త్రి (1987), కొత్తపేట, తెనాలి - 1.

4. పద్య కవితా వైభవం : ఆచార్య బేతవోలు రామబ్రహ్మం (1993), సాహిత్యపీఠం, రాజమండ్రి.

5. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (13 సంపుటాలు)-ఆరుద్ర (1990), ప్రజాశక్తి బుక్ హౌస్, కార్ల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ-2.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 (37) హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# సింగమనేని కథాసాహిత్యం – రాయలసీమ వ్యవసాయ సంక్షోభం

**ఆచార్య కె. శ్రీదేవి**, ఆచార్యులు, తెలుగు శాఖ, ద్రవిడ విశ్వవిద్యాలయం. ఫోన్ : 94414 04080



కరువు కారణంగానే వ్యవసాయరంగంలో ఈనాడు సంక్షోభం నెలకొన్నదని, రెండేళ్ళపాటు వానలు కురిసి పంటలు బాగాపండితే ఈ సమస్య తొలగి పోగలదని కొంతమంది రాజకీయ నాయకులు చెప్పటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయరంగంలో అమలుచేస్తున్న తప్పుడు సంస్కరణల ఫలితంగా ఈ సంక్షోభం తలఎత్తింది. కరువు పరిస్థితులు తలెత్తడానికి భౌగోళిక పరిస్థితులే ప్రధాన కారణం కాదు. వ్యవసాయ సంక్షోభానికి దారితీయడానికి పెట్టుబడులు, అభివృద్ధి వ్యయం తగ్గడం కూడా కారణమే. దానివల్ల ఉత్పత్తి పెరుగుదల సగానికి సగం తగ్గిపోయింది. ఆర్థిక సంస్కరణల ఫలితంగా రైతుల కిచ్చే సబ్సిడీలో కోత పడటంవల్ల పెట్టుబడులు పెరిగాయి. అదే సమయంలో రైతులు తీసుకొనే ఋణవ్యయం కూడా పెరిగింది దీనితో గ్రామీణ ప్రాంతాలలో వ్యాపారపంటలు పండిస్తున్న రైతులు దెబ్బతిన్నారు. మద్దతు ధర ఇవ్వడం ద్వారా మార్కెట్ విషయంలో జోక్యం చేసుకోవడానికి ప్రభుత్వం తిరస్కరించింది. దాంతో రైతులు మార్కెట్ సంక్షోభాన్ని కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ పరిణామాలను కథావస్తువుగా మలచి **సింగమనేని నారాయణ 'జూదం', 'విముక్తి', 'ఫిరంగిలో జ్వరం'** లాంటి కథలు రాశారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వకపోడం వల్ల తలఎత్తే దళారీ వ్యవస్థ, దానివల్ల వచ్చే అనర్థాలు రైతుల జీవనవిధానాన్ని ఎలా అతలాకుతలం చేశాయో ఈ కథల్లో దృశ్యమానం చేశారు.

రాయలసీమ సాగుభూమిలో అరవైశాతం వర్షాధారమైనదే, వ్యవసాయ సంక్షోభం లేని సామాజిక చరిత్రను సృష్టించాలంటే పాలకుల ఆలోచనా విధానంలో మార్పు రావాల్సివుంది. వ్యవసాయం అంటే కేవలం ఆహారాన్ని ఉత్పత్తి చేసే సాధనంగా మాత్రమే చూడకుండా దేశ జనాభాలో డెబ్భై కోట్లమందికి జీవనాధారాన్ని కల్పించి కీలకాంశంగా వ్యవసాయాన్ని గుర్తించాలి. నిరుపయోగమైన సంక్షేమ పథకాల అకకారులుగా రైతులను భావించకూడదు. ఈ భూమిని సస్యశ్యామలంగా మారుస్తున్న అన్నదాతలు, ఎండకెండుతూ, వానకు తడుస్తూ ఆరుగాలం కష్టపడే రైతులకు మనం గౌరవాన్ని ఇవ్వలేకపోతున్నాం. మనదేశంలో కళాకారులకు, క్రీడాకారులకు వుండే గౌరవం కూడా మన కడుపులు నింపే అన్నదాతలకు లేదు. చిన్న రైతులే అత్యధికులు అన్న విషయాన్ని గుర్తించాలి. విదేశీ లేదా స్వదేశీ పెట్టుబడుల వల్ల రైతు జీవనాన్ని ప్రభావితం చేసే అంశాలతో నివేదికను తయారు చేస్తే వుపయోగంగా వుంటుంది. అందుకు అవసరమైన కార్యక్రమ ప్రణాళికను అత్యవసరంగా రూపొందించాల్సిన అవసరం ఎంతైనా వుందన్న వాస్తవాన్ని సింగమనేని నారాయణ 'విముక్తి' కథలో చర్చించారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పలురకాలుగా వెలుగులోకి వచ్చాయి. వ్యవస్థాగత లోపాలుగా రుణాలు, పంటల భీమ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మార్కెట్ సదుపాయాలు మొదలైన సమస్యలు చాలా ఎక్కువగా వున్నాయని గుర్తింపబడింది. గ్రామీణాభివృద్ధి పథంలోనే వ్యవసాయ సంక్షోభ మూలాలు వున్నాయి. పేదల వలసలకు వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కుప్పకూలడం, ధరలు పతనం కావడం ప్రధాన కారణంగా రాయలసీమ రచయితలు భావించి రచనలు చేయడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సింగమనేని కథావస్తువులు నిర్దేశిత చైతన్యాన్ని అందించగలిగారు.

వర్తమాన తెలుగు కథాసాహిత్యంలో వ్యవసాయదారులు ఎదుర్కొనే సమస్యల భిన్న పార్శ్వాలను తెలుగు కథకులు ప్రస్తావించారు. పంట పండించడంలో సాగునీటి వనరుల కొరత, విత్తనాలు, పురుగు మందుల ధరల పెరుగుదల, పండిన పంటకు ధరను నిర్ణయించడంలో మార్కెట్ వ్యవస్థలోని ఎగుడు దిగుళ్ళు, బ్యాంకు ఋణాలు, కౌలుదార్ల కష్టాలు, రైతుల ఆత్మహత్యలు మొదలైన కారణాలతో పాటు సబ్సిడీల కోత, మద్దతు ధరలో కోత వంటి రైతు నిరాదరణ వైఖరీ, దానికి తోడు సరళీకృత ఆర్థిక విధానాలు వ్యవసాయ సంక్షోభానికి కారణాలు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంలో దళారీ వ్యవస్థ మార్కెట్ పేరుతో సృష్టిస్తున్న సంక్షోభాన్ని గురించి తెలుగు కథాసాహిత్యంలో మొదట సింగమనేని నారాయణ 'అడుసు' కథలో పరిచయం చేశారు. అటు ఉత్తరాంధ్రలో గానీ, ఇటు తెలంగాణా, కోస్తాంధ్ర కథాసాహిత్యంలో చోటుచేసుకోని మార్కెట్ వ్యవస్థ, దాని ఫలితంగా రైతులు ఎదుర్కొంటున్న విపరీత పర్యవసానా లను మొట్టమొదటసారిగా తెలుగు సాహిత్యంలో ఈయన స్థానం కల్పించారు. రాయలసీమ ప్రాంతీయ నిర్దిష్ట సామాజిక, ఆర్థిక రాజకీయ జీవితానికి సంబంధించిన కథల్ని అత్యంత ప్రాంతీయ స్పృహతో రచించిన

కథకుడు సింగమనేని నారాయణ. ఈయన "జూదం", "అడుసు", "విముక్తి" కథలు ప్రత్యేకంగా రైతుల్ని అత్యంత దీనస్థితికి నెట్టివేస్తున్న కరువు చరిత్ర ప్రతిఫలనాలుగా తన కథలను విమర్శనాత్మక వాస్తవికతా దృష్టితో చిత్రించారు సింగమనేని నారాయణ. రాయలసీమంటే కరువుసీమ అని గుర్తించే ఒకానొక ప్రాంతీయ చైతన్యాన్ని కలిగించిన కథకునిగా ఈయన పేరు రాయలసీమ కథాచరిత్రలో నిలుస్తుంది.

**సింగమనేని "జూదం"** కథ తరువాతనే అనంతపురం నుండి ప్రాంతీయ ముద్రతో ప్రతిభావంతంగా చిత్రిస్తున్న సమకాలీన సాహిత్య సృజనకారులకు మార్గదర్శి కాగలిగారు. 1953సంగాలో వచ్చిన **జి.రామకృష్ణ "గంజికోసం"** కథ తరువాత 1978 సంవత్సరంలో "జూదం" కథ వచ్చింది. అంటే దాదాపు 25 సంవత్సరాల తర్వాత అనంతపురం నుండి ప్రాంతీయ ముద్రతో కూడిన కథ వచ్చింది. ఈయన కథల్లో రైతులే కథానాయకులు. వాళ్ళ కష్టాలు, కడగండ్లే కథా వస్తువులు. రైతే రాజయ్యే రోజు రావాలని సింగమనేని ఆకాంక్ష. అందుకు అడ్డుగా నిలుస్తున్న వడ్డీ వ్యాపారులు, దళారులు, ప్రభుత్వం, మార్కెట్ వ్యవస్థ, అన్నింటినీ తన కథల్లో ఎండగట్టడమే ఈయన కథల లక్ష్యం. అందరికీ అన్నంపెట్టే రైతు ఆనందంగా అన్నం తినలేని దౌర్భాగ్యాన్ని సహించరాదన్న సందేశం పాఠకులకు అందించారు. రైతుల పక్షంలో నిలబడి వాళ్ళ తరఫున వకాల్తా పుచ్చుకొనే న్యాయవాది సింగమనేని నారాయణ. రైతులంటే ఎంత ప్రేమో, ఎంత గౌరవమో ఈయన ప్రతి కథలోనూ తెలుస్తుంది. రైతును గౌరవించని రాజ్యం రైతును బ్రతికించలేని రాజ్యం. ప్రజావ్యతిరేకమైన రాజ్యమని ధైర్యంగా చెప్పగలిగిన సింగమనేని సంస్కారం రైతు సంస్కారం.


"జూదం" కథలో నారప్ప వంటి రైతులు బాగా బ్రతకగలిగే స్థితినుండి వర్షాభావం వలన, ధరల పతనం వలన నాశనమైతే, గుగ్గిళ్ళు అమ్ముకొని జీవించే రామశేషయ్య వంటి వడ్డీవ్యాపారులు, నారప్ప లాంటి రైతుల వ్యవసాయక జీవితాన్ని ఎలా ఛిద్రం చేయగలుగుతున్నారో ఈకథలో చిత్రించారు. నారప్ప రాయలసీమ లోని వర్షాభావం వలన నిలకడలేని మార్కెట్ మాయాజాలం వలన నాశనమైతే, రామశేషయ్యలాంటి గుగ్గిళ్ళు అమ్ముకొనే వారు నారప్పలాంటి రైతుల ధాన్యాన్ని కొనగలిగి ధనవంతులయ్యే పరిస్థితి వలన వ్యవస్థలోని దమననీతిని బహిర్గతం చేయగలిగింది. రాయలసీమలో వ్యవసాయం చేసుకోవడం కన్నా స్వేచ్ఛావ్యాపారమే లాభసాటిగా చేయొచ్చనే ధ్వనికూడా ఈ కథలో ఉంది. సామాజిక చలన సూత్రాలను అర్థంచేసుకోగలిగిన సింగమనేని నేపథ్యం అతని కథల్లో రాజ్య స్వభావాన్ని ఎక్కడా వాచ్యం చేయదు. ఆయన పాత్రలు కూడా రైతు స్వభావానికి భిన్నంగా కథల్లో ఎక్కడా మాట్లాడవు. కానీ ప్రతికథలో రాజ్య స్వభావాన్ని, వ్యవస్థ దుర్మార్గాన్ని పాఠకుల మెదళ్ళకు ఎక్కించకుండా మాత్రం వదలడు. ఉదాహరణకు "జూదం" కథనే తీసుకొందాం. ఈ కథలో నారప్ప, రామశేషయ్య బ్యాంకు అప్పుకోసం ఇచ్చిన 300 రూ. వడ్డీతో సహా పట్టుకొని ఇచ్చిన 730 రూ. అప్పుల వాళ్ళందరికీ పంచుకొంటూ వస్తే అతని చేతిలో 40 రూపాయ లుంటాయి. కానీ కట్టాల్సిన కరెంటు బిల్లు, యూరియా మూట అప్పు, గానుగ మల్లప్పకు ఇవ్వాల్సిన డబ్బు అప్పులుగానే ఉంటాయి. ఇవి చాలవన్నట్లు, ఎనిమిది వందల రూపాయలు ఇంజను అప్పు కట్టమని పట్నం నుంచి ఉత్తరంతో సహా వసూలు చేసుకొని పోవడానికి మనిషే స్వయంగా నిలబడి ఉంటాడు. ఇక్కడతో కథ ఆగిపోతుంది. తను పండించిన పంటకు ధర నిర్ణయించి, వద్దు వద్దంటూనే పంటంతా కొలుచుకొనిపోయిన రామశేషయ్యను, అప్పులతో నిలబడిన నారప్పను పక్కపక్కగా నిలబెట్టి చూసిన ఏ పాఠకుడికైనా ప్రభుత్వ పక్షం ఏదో, ఎవరి శ్రేయస్సు కోసం పాలకులు నిలబడతారో వాచ్యంగా చెప్పాల్సిన అవసరం లేకుండానే తన కథాకథనంతోనే తన పాఠకుల్ని తాను చైతన్యవంతం చేసుకొని తన సైన్యాన్ని తానే సమర్చుకోగలిగిన సాహిత్య యోధుడు సింగమనేని అనడంలో ఏ మాత్రం సందేహంలేదు.


రాయలసీమ రైతును దగాచేసే మార్కెట్ వ్యవస్థలో భాగమైన ప్రతి ఒక్కరూ రైతుల రక్తం పీల్చేవాళ్ళని నిరూపించిన కథ "అడుసు". రాయలసీమలో వ్యవసాయం చేయడమంటే 'అడుసు'లో కాలుపెట్టినట్లే అనే సామెతతో వ్యవసాయ మార్కెట్ వ్యవస్థలో వచ్చిన మార్పుల్ని ధరల నియంత్రణాధికారం లేని రైతుల సమస్యల్ని చర్చించిన కథ ఇది. రాయలసీమ జిల్లాల్లో రైతులు తమ కన్నబిడ్డల కంటే జాగ్రత్తగా పెంచిన బత్తాయి చెట్లను తన చేతుల్తోనే ఎందుకు నరికేస్తున్నారో ఈ కథలో సింగమనేని నారాయణ బట్టబయలు చేయగలిగారు. లారీ బ్రోకరు మొదలుకొని, వేలంపాటగాళ్ళవరకూ అందరూ అడుగడుగునా మోసంచేసిన మూకుమ్మడి దళారీ వ్యవస్థను ఎదుర్కోలేని నారాయణప్ప నిస్సహాయత తన చేతులతో పెంచి, పెద్దచేసిన చీనాచెట్లను నరికివేసినట్లుగా రచయిత చిత్రించారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు నాగపూర్ దళారీల నక్కజిత్తుల మార్కెట్ వ్యవస్థ అన్నీకూడా రైతు సంక్షేమాన్ని చూసేవి కావనే వాస్తవాన్ని నారాయణప్ప పాత్ర చూపించిన ధర్మాగ్రహం ద్వారా రచయిత రైతుల్ని పట్టించుకోని ప్రభుత్వ వైఫల్యాన్ని, ఈ వ్యవస్థకు పట్టబోయే గతిని సూచనప్రాయంగా చెప్పినట్లనిపిస్తుంది. **"యజ్ఞం"** కథలోని సీతారాముడు తమ బ్రతుకుల్ని నాశనం చేస్తున్న శ్రీరామానాయుణ్ణి ఏమీ చేయలేక తన సొంత కొడుకు తల నరికేయడంలోని సూచనే, నారాయణప్ప బిడ్డల్లాగా పెంచుకున్న చీనాచెట్లను నరకడంలో కూడా వ్యక్తమౌతుంది.

రైతు పట్ల, రైతు జీవితం పట్ల రైతు శ్రేయస్సు పట్ల అవగాహన నిబద్ధతలు కలిగిన సింగమనేని **'విముక్తి'** కథలో భూమికి – రైతుకు ఉన్న సంబంధాలలో ఉన్న ప్రాంతీయ వైవిధ్యాల్ని విభిన్నంగా

ఆవిష్కరించగలిగారు. తెలంగాణా పోరాటంలో భూమి సంపాదించుకోవడమే వ్యవసాయ కూలీల జీవితాలకు "విముక్తి" అయితే, రాయలసీమలో భూమిని వదిలించుకోవడమే 'విముక్తి" అన్న ధ్వనితో రాసిన కథ. ఇది రాయలసీమ మరో పార్శ్వంలో వ్యక్తం అయ్యే జీవన వైరుధ్యాన్ని తన కథలో చిత్రించారు. వరుస కరువులతో వ్యవసాయం చేసి అప్పుల పాలవడం కన్నా ప్రభుత్వం కల్పించే కరువు పనులకు కూలీలుగా పోవడం మంచిదన్న సందేశం ఉంది. నిజానికి భూమి కలిగి వుండటంలో సంక్షోభానికి గురైన, భూమి ఉత్పత్తి శక్తిగా, ఆర్థిక వనరుగా ఆత్మ విశ్వాసాన్నిస్తుంది. భూమికున్న ఆర్థిక విలువలో ప్రాంతాలను బట్టి వ్యత్యాసాలున్నప్పటికీ, కుల అస్తిత్వానికి అదో రకమైన భరోసానిస్తుంది. ఈ కథలో వెంకటప్ప చేస్తున్న సేద్యాన్ని వదలుకొని కరువు పనులకు దినకూలీగా వెళ్లాలని నిర్ణయించుకోవడంలో రెండు దశాబ్దాలుగా వ్యవసాయ రంగంలో వస్తున్న పరిణామక్రమాన్ని ఈ కథ పట్టిస్తుంది. మధ్యతరగతి వ్యవసాయదారులు సన్నకారు రైతులు కూడా కూలీలుగా మారుతున్న వైనాన్ని ఈ కథ చెప్పగలిగింది. నిజమే వ్యవసాయ సంక్షోభాన్ని ఈ స్థాయిలో రుచి చూసిన వారెవరికైనా ఇలాంటి పరిష్కారాలే కనిపిస్తాయి. కానీ ఉత్పత్తి సంబంధాలలో భూమి పాత్రను గత నాలుగయిదు దశాబ్దాలలో రాయలసీమ వ్యవసాయిక పరిస్థితులలో వస్తున్న మార్పులు చూసినప్పుడు ఇలాంటి ఎమోషనల్ టెంపరమెంట్స్‌కు లోనుకావడంలో ఆశ్చర్యం లేదు. సింగమనేని కథలలో ఈ వ్యవసాయిక సంక్షోభం అనేక రూపాలలో ప్రతిఫలించాయి. ఉదాహరణకు పశువులకు గడ్డి కూడా దొరకకపోవడం, కబేళాలకు తరలించడం, కుటుంబాలకు కుటుంబాలు వలస పోవడం, పొలాల్ని వదిలి ఫ్యాక్టరీలలో కరువు పనుల్లో కూలీలుగా చేరడం, అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం వరకు జరిగిన సంఘటనలు ఈయన కథల్లో చాలా ఎక్కువగానే చోటు చేసుకున్నాయి.

రాయలసీమ గ్రామీణ జీవితంలో పూర్వం ఫ్యాక్షన్ అనేది పల్లెల్లో పెత్తనం కోసమే వుండేది. ఇవ్వాళ అది అక్రమార్జనకు, అధికార దుర్వినియోగానికి, గ్రామీణ ప్రాంతాల్లో మాఫియా ముఠాలు పెంపొందడానికి వుపయోగపడుతోంది. ఫ్యాక్షనిస్టులు రాజకీయాల్లో సారా వ్యాపారాల్లో, సివిల్, అటవీ, ఇసుక కాంట్రాక్టులలో, ఎన్ని అడ్డదారులుంటే అన్నింటినీ అవలంబిస్తూ తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకొనే ప్రయత్నాలు జరుగుతున్న సామాజిక సందర్భం రికార్డ్ చేశారు. చట్టాన్ని అమలు చేసే ప్రభుత్వ యంత్రాంగం కూడా కేవలం ప్రేక్షక పాత్ర దహిస్తాయి. ఫాక్షనిస్టులు కేవలం హంతకులు, భూస్వాములు, సారా కాంట్రాక్టర్లుగా వుండడం మాత్రమే కాక ప్రత్యుర్థుల్ని మట్టుబెట్టడానికి ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రులను వుపయోగించుకుంటారు. రాజకీయ పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు,




మంత్రులు లేదా వారి అండదండల్లో వుండేవారు. ఇంకా చెప్పాలంటే, ప్రత్యర్థి వర్గం వాళ్ళు కూడా ఈ విష వలయంలో భాగస్వాములే అని నిరూపించిన కథలు చాలానే వున్నాయి. అలాంటి కథల్లో సింగమనేని నారాయణ రచించిన **"ఫిరంగిలో జ్వరం"** అనే కథ ప్రధానమైనది. ఇందులో ఈ పై అంశాలనే జాతీయ అంతర్జాతీయ నేపథ్యంలో చోటు చేసుకుంటున్న రాజకీయ మార్పులను, వాటి ఫలితంగా ప్రాంతీయ అంశాలలో నెలకుంటున్న అనిశ్చిత స్థితిని ఈ కథ ప్రతీకాత్మకంగా దృశ్యమానం చేస్తుంది.

కడప, కర్నూలు ముఠా తగాదాలలో కనిపించని వైవిధ్యం అనంతపురం ముఠా తగాదాలలో కనిపిస్తుంది. చెట్లను నరకడం మూఠా రాజకీయాలలో ప్రత్యర్థి పంటచేలను, వారి దొడ్లను నాశనం చేయడమే కాక, సంవత్సరాల తరబడి పెంచి పోషించిన పచ్చని చెట్లను నరికివేయడం, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాక వ్యవసాయ **"జూదం"**లో పావులుగా మారిన రైతులు మార్కెట్ సంక్షోభంలో కూరుకొని పోయారు. తమ చేతులతో తామే బిడ్డల్లా పెంచిన చెట్లను తాము చేతులతో తామే నరికివేస్తున్న పరిణామం రాయలసీమ జీవిత స్థితిగతుల్లోని వైరుధ్యాలకు ప్రతిరూపం. ఈ వైరుధ్యాలకు వెనుక వున్న కారణాలను విశ్లేషించే ప్రయత్నం ఈ కథలో కనబడుతుంది.

తమ వర్గాన్ని గెలిపించుకోవటానికి ప్రతి సంవత్సరం జరిగే సమితి ఎన్నికలలో ఎవరికి వాళ్ళు వ్యూహాలతో, ఎత్తుగడలలో ప్రత్యర్థి వర్గాలను దెబ్బ తీసేందుకు కావలసిన మందీ మార్బలం నమకూర్చుకునేందుకు డబ్బులు వెదజల్లి ముఠాలను తయారు చేస్తున్నారు. ఆయుధాలు కూడా సమకూర్చుకుంటున్నారు. ప్రత్యర్థి వర్గాన్ని బలహీన పరచడం కోసం, చిన్న గీతను పెద్దది చేసుకునేలాగా తమ ముఠాల్ని విస్తృతం చేసుకుంటున్నారు. పల్లెల్లో బాంబుల మోతలతో, తుపాకీ ధ్వనులతో ఎవరికి ఎవరూ తీసిపోని విధంగా బలపడిన నేపథ్యంలో గణేనాయక్ అనే సుగాలీ తాండా నాయకుడు ప్రవేశిస్తాడు. వెంకట నాయుడు అతన్ని ఒక ఆయుధంగా మార్చుకొని, తాండావాసులు తన సైన్యంగా గుర్తింపు పొందాలన్న ఆకాంక్ష

నాయుడిలో బలంగా వుంది. అందుకే అతడు తనను కాపు సారా వ్యాపారంలో సపోర్టు కోరిన గణేనాయక్‌తో ఇలా అంటాడు.

**"నాయక్ ఇప్పటి నుండీ నువ్వు నీ మనుషులూ నా వాళ్ళుగా వుండిపోండి. నా నియోజక వర్గంలోనే కాదు జిల్లా మొత్తం మీద మీ వాళ్ళందరికీ నా అండ కల్పిస్తాను. నీ సాయం నాకు కావాలి. ముఖ్యంగా వీరా రెడ్డి విషయంలో"** (పేజీ. 238 నీమ కక్ష్యల కథలు – "ఫిరంగిలో జ్వరం, సింగమనేని నారాయణ సంపాదకత్వం సూకా రాంప్రాద్ రెడ్డి (ఫ్రేము – 2004) అంటూ అసలు రాజకీయ వ్యూహంలోకి లాగే ఎత్తుగడ వేస్తాడు. గణేనాయక్ బలగం ప్రవేశంతో వీరారెడ్డి వర్గం క్రమంగా బలహీనపడింది. ఈ సందర్భంగా గణేనాయక్ అపారమైన ఆయుధ సంపత్తినీ, ధన సంపత్తినీ కూర్చుకొని మరో ముఠా నాయకుడిగా మారుతాడు.

ఏ సారా వ్యాపారం కారణంగా గణేనాయక్‌కూ, నాయుడికీ సంబంధ బాంధవ్యాలు మొదలయ్యాయో ఆ సారా వ్యాపారం కారణంగానే వాళ్ళ మధ్య వైరం కూడా తారాస్థాయికి చేరుకుందని గమనించవచ్చు. సారా కాయడంలో పోలీసుల దాడి నుండి, వీరారెడ్డి దౌర్జన్యాల నుండి తప్పించేందుకే నాయుడితో చేతులు కలుపుతాడు నాయక్. కానీ నాయుడు తనపైన దాడులు చేయించడంతో అతని బత్తాయి తోటనే విధ్వంసం చేసేంత ముఠా స్థాయికి బలపడతాడు.


రెండు దశాబ్దాల వుమ్మడి రాష్ట్ర రాజకీయ చరిత్రను ఈ కథలో ప్రస్తావించడం విశేషం. ఎన్.టి. రామారావు తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేత బట్టి మహిళల అభీష్టం మేరకు చేపట్టిన మద్యపాన నిషేధ చట్టం వచ్చిన తరువాత సారాయి కాసే నాయక్ లాంటి వాళ్ళ పరిస్థితితో సమానమైన సంఘటనలు అనేకం వున్నాయి. ముఠా నాయకుల ప్రాబల్యంలోకి వెళ్ళని స్వతంత్ర జీవితం గడిపే వాళ్ళు సుగాలీలు. సున్నపు బట్టీలు, మేకల పెంపకం, కట్టెల అమ్మకం, సారా కాచడం వాళ్ళ వృత్తి. అలాంటి సుగాలి తాండాలన్నింటికీ అప్రకటిత నాయకుడిగా గణేనాయక్ వ్యవహరిస్తుంటాడు. సుగాలీ తాండాలలో అతనికున్న పట్టుకు నిదర్శనంగా రచయిత అతని పాత్రను, నాయకత్వ లక్షణాలను వర్ణించడంలో గిరిజన జాతుల జీవనశైలిని, వారి మనస్తత్వాన్ని దగ్గరగా పరిశీలించినట్లు తెలుస్తుంది. రచయిత సృజన చేసిన ఈ గణేనాయక్ పాత్ర చిత్రణ ద్వారా రచయిత ఏ వర్గంవారి వైపో కూడా పాఠకులకు అర్థమవుతుంది. అట్లని రచయితకు గల రాజకీయ నేపథ్యంలోంచి ఈ పాత్ర చిత్రణ జరిగిందా? అంటే, సింగమనేనికి గల వామపక్ష రాజకీయ సంబంధాల లోంచి జరగలేదని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. గణేనాయక్ బత్తాయి తోటను నరకడాన్ని రచయిత సమర్థిస్తున్నాడని అనిపించినా, అతనికి గల రాజకీయ దృష్టికోణం నుంచి చూసినపుడు, ముఠా తగాదాల పట్ల అతనికి గల వ్యతిరేక వైఖరే మనకు తెలుస్తుంది. మరయితే గణేనాయక్ పాత్ర చిత్రణలో తొంగి చూసిన ప్రేమ గణేనాయ చర్యలన్నింటిని సమర్థించటం కాదు కదా! కేవలం స్వతంత్ర జీవనం కలిగిన సుగాలీలు సైతం ముఠా రాజకీయాలలోకి ప్రవేశించాల్సిన అనివార్యతను మాత్రమే రచయిత చిత్రించటం జరిగిందని చెప్పవచ్చు.

అలాగే వెంకట్రామ నాయుడు, వీరారెడ్డి పాత్రలను అంతర్జాతీయ పాత్రలైన అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ తోనూ, చంద్రబాబు నాయుడుతోనూ, గణేనాయక్ పాత్రకు బిన్లాడెన్ పాత్రతోనూ ప్రతీకాత్మకంగా రచయిత చిత్రించడం ద్వారా రాయలసీమ స్థానిక రాజకీయాలు ఈనాటి జాతీయ, అంతర్జాతీయ రాజకీయ ఎత్తుగడలతో ఏ మాత్రం తీసిపోనితనాన్ని వ్యక్తీకరించడమే కాక స్థానికతలో వ్యక్తమయ్యే సార్వజనీనతకు ఈ కథ నిదర్శనంగా నిలుస్తుంది. సమ కాలీన జీవన స్థితిగతుల్ని మాత్రమే కాక రాయలసీమ నిర్దిష్ట ఆర్థిక రాజకీయ జీవితాన్ని చిత్రించడంలో ఈ కథ విజయవంతమైంది.

1980లలో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా వున్నపుడు ప్రవేశపెట్టిన మద్యపాననిషేదం చట్టం ఆ తరువాత ముఖ్యమంత్రైన చంద్రబాబునాయుడు మద్యనిషేధ చట్టాన్ని పాక్షికంగా అమలు చేయడంలో భాగంగా సడలించి, మద్యం షాపులకు పర్మిట్లు ఇవ్వడం ద్వారా వెంకట్రామ నాయుడు, గణేనాయక్ ల మధ్య వైరం ఏర్పడింది. వ్యక్తుల మధ్య స్నేహాలలో, ప్రతీకారాలలో రాజకీయాలు నిర్వహించే పాత్రను, వాళ్ళ సామాజిక జీవితంలో భాగం చేయడంలో, సింగమనేని నారాయణకు రాజకీయ ఉద్యమాలతో వున్న అవగాహన వలననే సాధ్యమైందని చెప్పడం సమంజసం.

ఆనాటి ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు, రక్షణ శాఖా మాత్యులుగా వున్న దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఒక ఉప సంఘాన్ని నియమించి శాంతి, సామరస్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సిఫారసులు చేయాల్సిందిగా కోరినారు. ఆ సిఫారసుల మేరకు మంత్రి శివాజీ అధ్యక్షతన ఫ్యాక్షన్‌కు వ్యతిరేకంగా చేసిన రాష్ట్ర పర్యటనలో జరిగిన సూచనల మేరకు పల్లెల్లోని ముఠా నాయకుల మధ్య మైత్రీ సంబంధాలు నెలకొల్పే నిమిత్తం జరిగిన చారిత్రక సన్నివేశం ఈ కథా నేపథ్యం. ముఠానాయకులైన వీరారెడ్డి, వెంకట్రామ నాయుడుల మధ్య గణేనాయక్‌ను హతమార్చేందుకు వ్యూహం ఏర్పాటైనట్లుగా చిత్రించడం ద్వారా ముఠా రాజకీయాల వర్గ స్వభావాన్ని సైతం ఈ కథ ప్రతిబింబించింది.

అనంతపురం జిల్లాలో గత దశాబ్దకాలంలో జరిగిన రాజకీయ పరిణామాలు, పార్టీల స్థితిగతులు ముఠా నాయకుల ఆధిపత్య పోరులో లేని ఘర్షణలు, ప్రభుత్వం చేసిన నూతన మద్యనిషేధ చట్టం, దాని పర్యవసానాలు, దాన్ని అమలు చేయడంలో ప్రభుత్వ వైఫల్యం అన్ని అంశాలతో పాటు ముఠా తగాదాల దివాళాకోరు రాజకీయాలను ప్రశ్నించే పూర్తి స్థాయి రాజకీయ కథ **"ఫిరంగిలో జ్వరం"** అనడానికి ఏమాత్రం సందేహం లేదు.




సీమ కథకులు రాయలసీమ కరువు కాటకాలను సీమ భౌగోళిక నైసర్గిక నేపథ్యంలోనే చిత్రించారు. రాయలసీమ వ్యవసాయ కథకు మార్కెట్ ఎక్స్‌టెన్షన్‌ను సింగమనేని ఇవ్వగలిగారు. ఆయనకు గల మార్క్సిస్ట్ దృక్పథం వల్లనే వ్యవసాయంలో మార్కెట్ సంక్షోభ స్వరూపాన్ని సరిగ్గా అంచనా వేయగలిగారు. పాఠకుల ఆలోచనలకు, సమస్యా పరిష్కారాల అన్వేషణకు ఈ కథలో దారులు వేయగలిగారు.

వ్యాపార రంగం పూర్తిగా సరళీకరించటం, సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఆర్థికమాంద్యం నెలకొన్న నేపథ్యంలో వాణిజ్య సరళీకరణలు ప్రపంచ వినియోగ మార్కెట్లు రైతాంగాన్ని విచ్చలవిడిగా దోచుకొన్నాయి. సింగమనేని 'జూదం', 'అడుసు', 'విముక్తి' కథలు మార్కెట్ సంక్షోభాన్ని చిత్రిస్తే, 'ఫిరంగిలో జ్వరం' కథ ప్రపంచ పెట్టుబడిదారి దేశాలలో వచ్చిన వాణిజ్య సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావం అంతర్జాతీయంగానే కాక జాతీయ, ప్రాంతీయ, దేశీయ మార్కెట్‌ను, రాష్ట్రరాజకీయాలను సైతం ఎలా ప్రభావితం చేసిందో చిత్రించింది. ఆ పరిణామ మూలాలు రాయలసీమ ముఠా తగాదాలను కూడా ఎలా ప్రేరేపించాయో ఈ కథ బహిర్గత పరిచే ప్రయత్నం చేసింది. ఆర్థిక సరళీకరణ ఫలితంగా వ్యాపార పంటలు సాగుచేసే సన్నకారు రైతుల ఋణభారం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఆస్తులు హరించుకు పోయి దారిద్ర్యాన్ని మిగిల్చింది. కొంతమంది రైతులు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు.

ఈ పరిణామాలన్నీ వ్యవసాయ సంక్షోభ తీవ్రతను సూచిస్తు న్నాయి. ఒక దశాబ్ద కాలంలో కొత్తగా వచ్చిపడిన జీవనోపాధుల సంక్షోభం ద్రవ్యోల్బణానికి దారి తీసింది. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రత్యామ్నాయ సహాయ చర్యలను అందించడంలో సంక్షేమ రాజ్యలక్ష్యం విఫలమైంది.

రాయలసీమ సాగునీటి సేద్యం తక్కువైనా ఎరువుల వినియోగం బాగా పెరిగింది. దిగుబడులు ఈ మోతాదులో పెరగలేదు. సజ్జ, రాగి, వేరుశనగ, పొద్దు తిరుగుడు, పప్పుధాన్యాల దిగుబడులు కూడా చాలా తక్కువగా వున్నాయి.

గత పదిహేనేళ్ళుగా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా దెబ్బ తింటున్నాయి. గ్రామీణ జనాభాలో మూడవ వంతు వ్యవసాయ కార్మికులు తమ జీవనం కోసం ఇతర ఉపాధులపై ఆధార పడుతున్నారు. ఒక్క సంవత్సరంలోనే గ్రామీణ ఉపాధి 60 శాతం నుంచి 50 శాతానికి ఎలా దిగజారిపోయిందో 2004, 2005 ఆర్థిక సర్వే తెలిపింది. (పే .235 సునీత్ చోప్రా, ఉదారవాద విధానాలతో ఉపాధికి ప్రమాదం భూసంస్కరణలు వ్యవసాయరంగం - ప్రజాశక్తి బుక్ హౌస్ -2008) యాంత్రిక, కార్పోరేట్ వ్యవసాయం వచ్చిన తరువాత ప్రజల జీవనోపాధి అవకాశాల పతనం పెరుగుతూ వచ్చింది. సన్నకారు రైతులను చేతి వృత్తుల వారికి చేనేత కార్మికులకి, వ్యవసాయ కార్మికులకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లిపోయాయి. సన్నకారు రైతులు కూలీలుగా మారే క్రమం రాయలసీమ రైతాంగాన్ని నిర్వీర్యం చేసింది. ఒక వైపు భౌగోళిక పరిస్థితులు మరోవైపు సరళీకృత ఆర్థిక విధానాలకు తోడు వాటిని ఎండగట్టే రైతు సంఘాల ప్రాతినిధ్యం లేకపోవడం రాయలసీమను మరింతగా కరువువాత పడేసింది. వ్యవసాయరంగంలో యంత్రాల ప్రవేశం పురుగుమందుల వాడకం ఆహార పంటల నుండి వాణిజ్య పంటలకు మారడం కూడా ఒక కారణం.

ఒక వైపు ఎరువులు మరోవైపున ఋణవ్యయం అధికం కావడంతో రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. రైతుల దుస్థితికి కారణాలు అనేకానేకం. రైతులకు గిట్టుబాటు ధరలు దాదాపు మిథ్యగానే మారాయి. ధాన్యం కనీస మద్దతు ధర వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా పెరగడం లేదు. కనీసం మద్దతు ధరను లెక్కించేటప్పుడు తలసరి ఆదాయాన్ని ప్రధానంగా తీసుకోవడం లేదు. అలాగే ఇంతకు ముందు గ్రామీణ జీవితంలో ఎదురుకాని ఖర్చులు పట్టణ నాగరిక జీవితాలలో వచ్చిన మార్పులు, ప్రసార మాధ్యమాల ద్వారా గ్రామాలకు చేరడం వల్ల జీవన సరళిలో మార్పులొచ్చాయి. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వ్యవసాయ ఆదాయంలో మార్పు రాకపోవటం అనేది కూడా వ్యవసాయ సంక్షోభానికి దారితీస్తుంది. ఈ మార్పులకు రాయలసీమ వ్యవసాయ పరిస్థితి కూడా అతీతం కాదు.

గ్రామీణాభివృద్ధికి కేటాయించిన అరకొర నిధులు ఏ పేద ప్రజల కోసమైతే ఉద్దేశించబడ్డాయో వారికి అందకుండా దళారుల, పెత్తందార్ల జేబుల్లోకే చేరడం చేదు నిజం. ఈ నేపథ్యంలో రైతులకు, బ్యాంకులకు మధ్య పని చేసే దళారి వ్యవస్థను ఈయన కథలు ప్రతిఫలించాయి. దుర్భర పరిస్థితుల్లో చిక్కుకున్న రైతులకు, వ్యవసాయ కార్మికులకు బ్యాంకులు ఋణ సదుపాయం అందించాలి. ఇలాంటి కార్యక్రమ రూపకల్పనలో క్రింది స్థాయివాళ్ళకు అందేలా మెరుగుపరచినప్పుడు కొంతలో కొంతైనా రాయలసీమ వ్యవసాయ సంక్షోభం తగ్గుముఖం పట్టొచ్చని సింగమనేని కథలు తెలియజేస్తాయి.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 (42) హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# ఇతిహాసములు – మానవతా విలువలు

డా. పంజాల శ్రీనివాస్, ఫోన్ : 817 915 9267

భారతదేశం అనేక ప్రత్యేక విశేషాలు కలిగిన భూమి ఇక్కడ వేదాలు వెల్లివిరిశాయి. వేదాలలో గురువులు తమ శిష్యులకు జ్ఞానం బోధించే పరంపర ఉంది. అందుకే వేదాలను **"అపౌరుషేయాలు"** అన్నారు. ఈ వేదాలు సంస్కృతంలో కఠినంగా ఉన్నందున సామాన్య జనాలకు అర్థం కాకపోయేవి. అందుకనే వాటిని అర్థం చేసుకొన్న వారు వేదాలకు భాష్యం రాయడం ప్రారంభం చేశారు. అలా చాలామంది వేదాలకు భాష్యాలు రాయడం జరిగింది. ఆ తరువాత పురాణాలు రాయడం జరిగింది. వాటి తర్వాత ఉపనిషత్తులు రాయడం జరిగింది. ఈ విధంగా సామాన్య ప్రజలకు అర్థం అయ్యే భాషలో రామాయణం, మహాభారతం, భాగవతం రచనలు చేయడం జరిగింది.

మానవుడు తన జీవనగతిలో ప్రవర్తించే విధానాన్ని వివరించ డానికి ఈ రామాయణం, మహాభారతం, భాగవతాలు తోడ్పడుతాయి. అవి దారిని చూపుతాయి. మానవతా విలువలను ఆయా గ్రంథాలలో పాత్రల ద్వారా ప్రబోధించడం జరిగింది. వీటిని ప్రాచీన సాహిత్యం అంటారు. ఇవి ప్రాచీన సాహిత్యమే అయినప్పటికి ఆధునిక కాలంలోని మానవులకు అనేక మార్గదర్శక సూత్రాలను బోధిస్తున్నాయి. ప్రాచీన కాలం నాటి గ్రంథాలు ఈ కాలంలో ఏం ఉపయోగపడుతాయి అనే అనుమానం వస్తాయి. కాని ఈ ఆధునిక యుగంలో కూడా మనిషి వ్యవహరించవలసిన విధానాలను, పాటించవలసిన విలువలను గురించి ఈ గ్రంథాలు ప్రబోధిస్తాయి. రామాయణం రాముని జీవిత చరిత్ర, భాగవతం శ్రీకృష్ణుని జీవన చిత్రణ, మహాభారతం పాండవ కౌరవుల గురించి ఉన్నప్పటికి ఈ



గ్రంథాలలోని వారివారి జీవితాలను, మనం అధ్యయనం చేస్తే మనిషి జీవితం ఎలా ఉండాలో తెలుపుతుంది. అలాగే జీవితంలో అనేక సందర్భాలలో మనం వ్యవహరించవల్సిన విధానాలు అర్థమవుతాయి. ఆచరణయోగ్యమవుతాయి. అందుకే నేటికి అవి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

కేవలం భారతదేశమే కాదు ప్రపంచ ప్రజలందరూ ఈ గ్రంథాలను ఆదర్శంగా తీసుకుంటుంటే వాటి ప్రాధాన్యత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఇతర దేశాల ప్రజలు ఇతర మతాలను అవలంభిస్తున్న వారు అయినప్పటికి వారి మతాలతో కొన్ని గ్రంథాలు ఉన్నప్పటికి, భారతదేశంలో రాయబడిన ఈ గ్రంథాలను వారు చదివి, అర్థం చేసుకొని దానిని అవలంబిస్తున్నారంటే, నేటి ఆధునిక యుగంలో ఆ గ్రంథాల ప్రాధాన్యత ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఇలా రామాయణ, భారత, భాగవతాలు మానవతా విలువలు ప్రబోధించడానికి రచించబడినవి.

రామాయణం అనగా రాముని ప్రగతి అని అర్థం. రాముని జీవితం ఎలా ముందుకెళ్ళిందో వివరించేదే రామాయణం. రాముని అవతారం త్రేతాయుగంలో జరిగింది. సాక్షాత్ శ్రీమహావిష్ణువే రాముని అవతారంగా భూమిపైకి వచ్చాడని జనుల విశ్వాసం. సాక్షాత్తు భగవంతుని అవతారం అయిన్పటికీ, రాజవంశంలో జన్మించినప్పటికీ సాధారణ మానవునిగా జీవించాడు శ్రీరాముడు. దశరథ మహారాజు పెద్ద కుమారుడైన శ్రీరాముడు తన జీవితంలో అనేక మానవతా విలువలను ప్రబోధించాడు.

చిన్ననాటినుండే గొప్ప సంస్కారం కలిగిన రాముడు 12 సంవత్సరాల వయస్సులోనే విశ్వామిత్రుని యాగరక్షణకు బయలు దేరుతాడు. అప్పుడే విశ్వామిత్రుని ద్వారా అనేక ధర్మసూక్తులను నేర్చుకుంటాడు. మొట్టమొదట తాటకి అనే రాక్షసిని సంహరించి, తన ధర్మరక్షణా కార్యానికి శ్రీకారం చూడతాడు శ్రీరాముడు. యాగముకు ఇబ్బంది పెడుతున్న మారీచుడిని, సుబాహుడిని తన బాణపు దెబ్బలతో పార ద్రొలినవాడు శ్రీరాముడు. దీని ద్వారా ధర్మరక్షణ కోసం అవసరమైతే రాక్షస సంహారం తప్పదని శ్రీరాముడు నిరూపించాడు.

రాజ్య పట్టాభిషేకం కోసం ఏర్పాటు చేయగానే, రాజు కావలసిన అవకాశం ఉన్నప్పటికి అలా కాకుండా 14 సంవత్సరాలు వనవాసం చేయడానికి వెళ్ళాడు రాముడు. తండ్రి ఆజ్ఞను జవదాటకూడదు అనే విషయాన్ని రాముడి జీవితం చూసి నేర్చుకోవచ్చు. యాగరక్షణకు

వెళ్ళమని చెప్పి, పట్టాభిషేకం చేస్తానని చెప్పినా, లేదు వనవాసానికి వెళ్ళమని చెప్పి, అన్నింటిని సమానంగానే స్వీకరించాడు రాముడు. దేనికి ఎదురు చెప్పలేదు. తండ్రి మాట పట్ల కుమారుడు ఎలా వ్యవహరించాలో చేసి చూపాడు రాముడు.

నేటి యువత తల్లిదండ్రులను విస్మరిస్తున్న తరుణంలో రాముడు వ్యవహరించిన తీరును మనం అవగతం చేసుకోవచ్చు. తల్లి పట్ల ప్రేమ ఎలా ఉండాలో కౌసల్య రాములను చూస్తే అర్థం అవుతుంది. కేవలం తన తల్లినే కాదు పినతల్లుల పట్లకూడా సమాన ఆదర, ప్రేమాభిమానాలను, గౌరవాలను చూపాడు రాముడు. రాజ్యపట్టాభిషేకాన్ని త్యజించి వెళ్ళిన రాముడు తన ధర్మరక్షణ కార్యంలో ముందుకెళ్తాడు. భరతుడు వచ్చి మళ్ళీ పట్టాభిషేకం చేసుకొమ్మని చెప్పిన సందర్భంలో అన్నదమ్ముల మధ్య ప్రేమ ఎలా ఉండాలో తెలుస్తుంది.

నేడు అన్నదమ్ముల గొడవలు ఏ రీతిలో ఉన్నాయో చూస్తే, ఆనాటి రాముడు తన తమ్ములతో చూపిన ప్రేమను అర్థం చేసుకొని, నేటి అన్నదమ్ములకు ఆ రామాయణంలోని ఘట్టాలు ఎంత ఆదర్శమో మనం గమనించవచ్చు. రాముని వనవాసంలో ప్రజలతో రాముడు ప్రదర్శించిన ఆదరణ అమోఘమైనది. సాధారణ గిరిజన స్త్రీ అయిన 'శబరి'ని అనుగ్రహించి, దర్శనం ఇవ్వడం, అహల్య శాప విమోచనం చేయడం, గుహున్ని కౌగిలించుకోవడం ఇలాంటి ఘట్టాలను పరిశీలించినప్పుడు ఆనాడు రకరకాల వృత్తుల కులాలు, ఉన్నప్పటికి అందరూ సమాన గౌరవాన్ని పొందేవారని అర్థం అవుతుంది.

రాజవంశంలో జన్మించిన రాముడు అందరిని సమానంగా చూసిన తీరు అమోఘమైనది. నేడు కులాల పేరుతో, వర్గాల పేరుతో, వైషమ్యాల పేరుతో మారుతున్న ప్రజలు రాముడు అందరిపట్ల సమాన అదర అభిమానాలు ఎలా చూపాడో మనం అర్థం చేసుకోవచ్చు. నేడు సమాజంలో లోపిస్తున్న సమానత్వం మనం సాధించవల్సిన తీరును అర్థంచేసుకోవచ్చు. ఋషులను, మునులను కాపాడటం కోసం రాముడు జీవించాడు.

సీతారాముల జీవనం, వారి అన్యోన్యత ఈనాటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నది. పాశ్చాత్య ధోరణిలో కొట్టుమిట్టాడుతున్న ఈనాటి భార్యభర్తల సంబంధాలు మారిపోతున్న తరుణంలో ఆనాడు సీతారాముల జీవనాన్ని చూసి మనం ఎలా ఉండాలో నేర్చుకోవచ్చు. ఇలాంటి మానవతా విలువలను రామాయణంలో మనం చూడవచ్చు. భర్తతో వనవాసానికి కూడా బయలుదేరడం, అనేక కష్టాలను భరించడానికి తయారుగా ఉండడం నేటి సమాజంలో స్త్రీలు ఆదర్శంగా స్వీకరించాలి. భార్యభర్తల బంధానికి ఉదాహరణ సీతారాములు కేవలం రాముడే వనవాసానికి వెళ్ళడం గురించి కోరినప్పటికీ, సీత కూడా వెళ్ళడం, నారచీరలు ధరించడం, ఇలా



భర్తకు ప్రతి పనిలో వెన్నంటి ఉండడం సీతను చూసి నేటి సమాజం నేర్చుకోవాలి. లక్ష్మణుడు రాముని పట్ల సోదర భక్తి నేర్పిస్తాడు. అన్నదమ్ములు ఎలా ఉండాలో మనకు నేర్పిస్తారు.

నేడు ఆస్తిపాస్తుల కోసం, భూముల కోసం తగాదాలు పడుతున్న సంఘటనలు చూస్తున్నప్పుడు రామలక్ష్మణుల బంధం నేటి సమాజానికి ఎంత అవసరమో అర్థమవుతుంది. జటాయువు అనే పక్షికి అంత్యక్రియలు నిర్వహించడం వలన పశుపక్ష్యాదుల పట్ల ఎలా వ్యవహరించాలో నేర్పిస్తాడు రాముడు. రావణుడు సీతను అపహరించినపుడు రాముడి వేదన వర్ణనాతీతం. తనను మోహించిన శూర్పణఖ పట్ల ఏ విధమైన మోహం చూపలేదు శ్రీరాముడు. ఇతర స్త్రీల పట్ల ఎలా ఉండాలో నేర్చుకోవాలి. సీతను వెతుకుతూ రాముడు ఏడ్చిన తీరు బాధాకరం. సుగ్రీవునితో మైత్రి, హనుమంతునితో స్నేహము ఇవన్ని గమనిస్తూ అనేక మానవీయ విలువలను నేర్చుకోవచ్చు.

సంవత్సరం పాటు రావణుని చెరలో ఉన్నప్పటికీ ఏమాత్రం ఇతర ఆలోచనలకు తావునివ్వని సీత మహాపతివ్రత. రావణుని ఒక గడ్డిపోచతో పోలుస్తుంది. రాముడు తన భార్య కోసం రామసేతువు నిర్మాణం చేసి యుద్ధం చేసి సీతను విడిపించడం, రాజ్య పట్టాభిషేకం ఒక చాకలి నిందను విని సీతను అడవులకు పంపడం, అలా పంపినా సీత రామున్ని నిందించకపోవడం ఉంటుంది. రాముడు రాజుగా తన పాలన గొప్పగా చేయడం రామాయణం సారాంశం.

ఈ విధంగా ఒక మంచి బాలుడుగా, పుత్రుడుగా, యువకుడుగా, సోదరుడుగా, స్నేహితుడుగా, భర్తగా, రాజుగా, చక్రవర్తిగా ఇలాంటి అన్ని పాత్రలలో కూడా సాధారణ మానవుడిలా జీవిస్తూ ఆదర్శాన్ని చూపెట్టడం జరిగింది. మానవ సంబంధాలు మంటగలుస్తున్న నేటి ఆధునిక పాశ్చాత్య జీవన విధానంలో అనేక మానవీయ విలువలను సమాజానికి అందించిన తీరు మానవాళికి మార్గదర్శనము అవుతుంది అనడంలో సందేహం ఎంత మాత్రం లేదు.

మహాభారతం గురించి పరిశీలిస్తే మానవ జీవితమే ఒక మహాభారతమని పెద్దలు అంటారు. మహాభారతంలోని ఘట్టాలు నేటి మానవ సమాజం అనేక విషయాలు నేర్చుకోవాలి. మానవీయ



విలువలు నేర్చుకోవచ్చు. ఇది ద్వాపరయుగంలో జరిగిన సంఘటనలు అయినప్పటికి కలియుగంలో మానవ సమాజం నేర్చుకుంటున్న విషయాలు మనం గమనించాలి.

ధృతరాష్ట్రుడు, పాండురాజుల కుమారులైన కౌరవ, పాండవులు రాజ్యాల కోసం పడిన గొడవల సారాంశమే మహాభారతం. ఈనాడు అన్నదమ్ముల మధ్య, తమ సంతానం కోసం వెంపర్లాడే పెద్దల ఉదాహరణలు చూస్తే ఆనాడు కూడా ఇలాంటి పరిస్థితులు ఉండేవన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది. వ్యాధిగ్రస్థుడైన పాండురాజు అంధుడైన ధృతరాష్ట్రుడు వారి కుమారుల కోసం, అధికారాన్ని కట్టబెట్టడం కోసం చేసే ప్రయత్నాలు ఉంటాయి. పాండురాజు చనిపోయిన తర్వాత ధృతరాష్ట్రుడు కుమారుల పట్ల పక్షపాతాన్ని చూపడం వలన పాండురాజు పుత్రులు తమకు రావలసిన రాజ్యం గురించి జరిపిన సంఘర్షణనే మహాభారతం. పాండవులు తమ వద్ద శక్తియుక్తులు ఉన్నప్పటికీ, తమ పెద్దతండ్రి అయిన ధృతరాష్ట్రుడి పట్ల గౌరవ ప్రవృత్తులు, ప్రదర్శించడం, ఆయన నిర్ణయం కోసం వేచి చూడడం కుంతీదేవి మాతృవేదన కనిపిస్తుంది.

మహాభారతంలో ఏకచక్రపురం గ్రామంలోని ప్రజల్ని కాపాడడం కోసం తన కుమారుడైన భీమసేనున్ని బకాసురుని దగ్గరకు పంపడం, తనకు వివాహం కాకముందు జన్మించిన కర్ణుడిని నదిలో వేయడము, పాండవుల కోసం ఆమె భర్త (పాండురాజు) చనిపోయిన తర్వాత వారిని కంటికి రెప్పలా కాపాడటం (శ్రీకృష్ణుని అండ పాండవులకు ఎల్లవేళలా ఉన్నప్పటికీ) కుంతికి తప్పలేదు.

పాండవులు వారి రాజ్యం కోసం వారు ప్రయత్నాలు చేసినప్పటికీ సమాజంలో మానవీయ విలువలను గురించి సమస్త మానవాళికి వివరించి నేర్పించడం జరిగింది. కర్ణుని దానగుణం కూడా నేర్చుకోవాల్సిన విషయమే. సమాజంలో అనేక రకాల వ్యక్తులుంటారని మహాభారతమును చూసి తెలుసుకోవచ్చు. ఒకే వంశంలో జన్మించినప్పటికీ వారి మధ్య వైషమ్యాలు ఎలా ఉంటాయో మహాభారతంలో కళ్లకు కట్టినట్లు వివరించాడు.

మహాజూదంలో ధర్మరాజుని ఓడించడం, ద్రౌపది వస్త్రాపహరణము ఇవి గమనిస్తే మానవునిలోని రాక్షస ప్రవృత్తి తెలుస్తుంది. స్త్రీ రక్షణ కొరకు మనం పూనుకోవాలని నేర్చుకోవాలి. 12 సంవత్సరాల వనవాసంలో పాండవులు గడిపిన విషయాలు మానవత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ధర్మరక్షణ కోసమే వారి జీవనం గడిపినట్లు అర్థమవుతుంది. వనవాసంలో స్థాయిలో జాతి అనే తేడాలు లేకుండా ప్రజలతో వారు కలిసి జీవించిన విధానం మార్గదర్శకమవుతుంది.

పాండవులు వనవాసం పూర్తి అయినప్పటికీ వారి రాజ్యం ఇవ్వకపోవడం, శ్రీకృష్ణుడు రాయబారం చేయడం విశ్వరూపాన్ని ప్రదర్శించడం, కురుక్షేత్ర సంగ్రామం జరగడం, ఇలా అన్ని ఘట్టాలలో మానవీయ విలువలు దర్శనమిస్తాయి.

కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునునికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించడం ఒక అపూర్వ ఘట్టం. ధర్మసూక్ష్మాలను, మానవ జీవన లక్ష్యాలను అనేక మానవతా విలువలను ప్రబోధించడం జరిగింది. భగవద్గీత యావత్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమవుతుంది నాటి నుండి నేటికి. ఈ విధంగా మానవ జీవితమే ఒక మహాభారతం. మహాభారతంలో పాత్రద్వారా మానవతా విలువలను గురించి ప్రబోధించడం జరిగింది.

భారతంలో శ్రీకృష్ణుని జీవనం ఎలా పరిణతి చెందిందో తెలుస్తుంది. శ్రీకృష్ణుని బాల్య క్రీడల లీలలుగా దర్శనమిస్తాయి. పోతన రాసిన భాగవతంలోని పద్యాలు పండిత, పామర జనరంజకంగా ఉంటాయి. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మం కోసం శ్రీకృష్ణుడు సాగించిన సంగ్రామము సామాజిక సమరత, సాటి మనుషులను తనతో సమానంగా చూడటం, జీవనంలో ఉన్నతస్థితికి, వ్యక్తిత్వ వికాసానికి, జీవన పరిణతికి ఈ ప్రాచీన సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుంది.

**అధార గ్రంథాలు**

1. సంస్కృత సాహిత్య చరిత్ర – ముదిగంటి గోపాలరెడ్డి, సుజాతరెడ్డి.
2. రామాయణ సారస్వత దర్శనం – అల్లంసెట్టి అప్పయ్య
3. రామాయణంలో విశిష్ట పాత్రలు – ఆకుండి రామశర్మ
4. ఆంధ్ర మహాభారతంలో ధర్మసూక్ష్మములు – యమ్జిపీ శ్రీరామచంద్రమూర్తి
5. భారతంలో రాజనీతి విశేషాలు – సంధ్యావందనం గోదావరి భాయి
6. ఆంధ్రమహభారతం – ధర్మతత్త్వం – విద్యేశ్వరి

# నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త 'కందుకూరి'

## కందాటి ధనశ్రీ



నవ్యాంధ్ర సాహిత్య ప్రక్రియలకన్నిటికి స్థితిని, ప్రాచుర్యమును కల్గించిన అఖండ సాహితీ స్రష్ట, సంఘసంస్కరణ దీక్షాదక్షులు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. వీరేశలింగం పంతులు పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు 1848 ఏప్రిల్16న జన్మించారు.

కందుకూరి వీరేశలింగం తెలుగులోని ఆధునిక ప్రక్రియలలో చాలామటుకు **'నేనే మొదట రచించితి'**నని స్వీయచరిత్రలో పేర్కొన్నారు. **తొలి స్వీయచరిత్ర, తొలినాటకం, తొలి ప్రహసనం, తొలి వచన ప్రబంధం, తొలి కవుల చరిత్ర, తొలి శాస్త్రీయ గ్రంథాల నిబంధనం** – కందుకూరి రాసినట్లు స్వీయ గ్రంథాల నిబంధనం – కందుకూరి రాసినట్లు తెలుస్తున్నా, అంతకుముందే నాటక రచన, వచన ప్రబంధ రచన లేకపోలేదు. అయితే వివిధ ప్రక్రియల్ని చేపట్టి, వాటికి ప్రాధాన్యాన్ని, ప్రాచుర్యాన్ని కలిగించింది కందుకూరి మాత్రమే. ఆ దృక్పథంతో ఆధునిక సాహిత్య యుగకర్త పేర్కొనటం సమంజసమే.

వీరేశలింగం తొలి రచనలు పద్యకావ్యాలే అయినా 'కవి'గా ప్రఖ్యాతి రాలేదు. తొలినాళ్ళలో శివ కేశవులపై **"మార్కండేయా", "శ్రీ రాజ మహేంద్రవరపుర గోపాల"** అనే మకుటాలతో రెండు శతకాలు రాశారు. **"శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం"** అనే మూడు ఆశ్వాసాల కావ్యాన్ని నలచరిత్రతో రాశారు. ప్రాచీన కావ్యరీతిలో రచింపబడిన ఈ కావ్యాన్ని శివునికి అంకితమిచ్చారు. కందుకూరి వారి శుద్ధాంధ్ర భాషా ప్రయోగానికి ఒక ఉదాహరణ.

**"తిగకొటికలదాయా తెల్లయేరున్న రాయా**
**సెగకను గల దంటా చేదు గొన్నట్టి జంటా**
**సొగసుల తలకట్టా సూదులంగొట్టు దిట్టా**
**జిగయఱ చెలితేదా చిల్కరా రౌతు సూదా"**

దృశ్య కావ్య ప్రధాన ప్రయోజనమైన ప్రదర్శనకి ప్రాధాన్యం ఇచ్చిన నాటకాన్ని రచించడంలో కందుకూరి ప్రథములు. 1880లో పంతులు **'ది కామెడి ఆఫ్ ఎర్రర్స్'** నాటకాన్ని **"చమత్కార రత్నావళి"** అనే పేరుతో అనువదించి విద్యార్థులతో ప్రదర్శింపజేశారు. కాళిదాసు శాకుంతల నాటకాన్ని అనువదించారు. అది చాలా ప్రసిద్ధి చెందింది. **'రత్నావళి'** అనే సంస్కృత రూపకానువాదం కూడా చేశారు. పౌరాణిక ఇతివృత్తంతో **'దక్షిణ గోగ్రహం', 'సత్యహరిశ్చంద్ర'** అనే నాటకాలు రచించారు. **'మాళవికాగ్ని మిత్రం'** మొదలైన పన్నెండు నాటకాలలో **బ్రహ్మవివాహం, స్త్రీ పునర్వివాహం, సభానాటకం** వంటి సాంఘిక రూపకాలు ఉన్నాయి. అసంపూర్ణంగా రాసిన నాటకాలను లెక్కిస్తే మొత్తం దాదాపు ఇరవై నాటకాలు రచించినట్లు రమాపతి రావుగారు పేర్కొన్నారు.

కందుకూరి నవలా రచనలో ప్రథములని చాలామంది అభిప్రాయం. నరహరి గోపాల క్రిష్ణమ్మశెట్టి రచించిన 'శ్రీ రంగ రాజ చరిత్రము, తొలి తెలుగు నవల అని కొందరి అభిప్రాయం. కాని వీరేశలింగం రచనలపై పరిశోధన చేసిన అక్కిరాజు రమాపతి రావు తొలి సాంఘిక నవల "రాజ శేఖర చరిత్ర'' అని సోదాహరణంగా, తులనాత్మకంగా వివరించారు. పంతులు గారి నవలలు – **(1) రాజశేఖర చరిత్ర (2) సత్యరాజా పూర్వదేశయాత్రలు (3) సత్యవతీ చరిత్రము (4) చంద్రమతీ చరిత్రము.** "రాజశేఖర చరిత్ర" నవలకి తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం వుంది. 'రాజశేఖర చరిత్ర' నవలకి ఇంగ్లీషులో గోల్డ్‌స్మిత్ రచించిన ''The vicar of wakefield" సహకరించిదనీ, అయితే దానికీ దీనికీ సంబంధంలేదనీ, నూతన విషయాలతో రచింపబడిందనీ పంతులుగారే చెప్పుకున్నారు. సాంఘిక దురాచారాన్ని, ప్రజల మూఢనమ్మకాల్ని విమర్శించుటయే పంతులుగారి నవలా రచనోద్దేశంగా కనబడుతుంది. తెలుగుదేశం లోని సామెతలు, లోకోక్తులు ప్రయోగించి తెలుగువారి ఆచార వ్యవహారాలను చక్కగా వర్ణించి తమ ప్రతిభ చూపారు. పంతులుగారి మహాయశస్సునకు శరత్కౌముది వంటిది. వారి రాజశేఖర చరిత్రము ప్రభవించిన నాటి నుంచి నేటి దనుక తెలుగు నవలా రచనమునకు మార్గదర్శకత్వమును వహించును. అన్న రమాపతిరావు మాటల్లో నిజం లేకపోలేదు.



"Written by a native gentleman of refinement and education, the book is fine and invaluable as an impartial study of native character as seen by native eyes" అని ఇంగ్లీషు విమర్శకులు కితాబు ఇచ్చారు. సాహితీపరుల ప్రశంసలతో ఇప్పటికీ పదిసార్లు పైగా పునర్ముద్రించ బడిన నవల రాజశేఖర చరిత్ర పంతులుగారు తమ ఆశయాలను ప్రబోధించటానికే ఈ నవలలు రచించారు.

తెలుగులో ప్రహసనాలకు కందుకూరి వారే ఆద్యులు. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల రాజకీయ సాఫింక దురాచారాలను వినోదకరంగా, సంభాషణాత్మకంగా వివరించి మాన్పించాలనే సంఘసంస్కరణ దృష్టివల్ల కందుకూరి ప్రహసనాలు రచించారు. చాలా ప్రహసనాలు తమ 'వివేకవర్ధిని' పత్రికలో ప్రచురించారు. పరిశోధకుల ప్రకారం ప్రకటించబడిన 44 ప్రహసనాలలో పదిహేను మూఢ విశ్వాసాలను హేళన చేసేవి. ఇరవై ఒకటి సంఘ సంస్కారాన్ని బోధించేవి. మిగిలిన ప్రహసనాలు నవనాగరికత, స్వార్థం, అమాయకత్వం మొదలైన అంశాలపై హాస్యంతో కూడుకొన్నవి. స్త్రీ విద్యపై హాస్యంగా రాయబడిన ప్రహసనం **"భ్రాంతి తరంగిణి".** కందుకూరి వారి ప్రహసనాల రచనా పరంపరను చిలకమర్తి వారు కొనసాగించారు.

పంతులు కథా రచనని ప్రధానంగా మహిళాభ్యుదయం కోసం చేపట్టారు. స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి, సాంఘిక దురాచారాల్ని తెలియజేయడానికి **'నీతికథలు'**గా రచించారనిపిస్తుంది. స్త్రీల పత్రిక **'సతీహితబోధిని'** నడిపి ఈ కథల్ని అందులో ప్రచురించేవారు. స్త్రీల కోసం, బాలబాలికల కోసం నీతిబోధ ప్రధానంగా **"నీతి కథామంజరి"** ని చిత్ర పటాలతో రెండు భాగాలుగా ప్రచురించారు. మొత్తం 158 కథలతో, ప్రతి కథ చివర ఒక నీతి పద్యంతో మనోహరంగా రచింప బడినట్లు విమర్శకులు ప్రశంసించారు. ఈసప్ కథల్ని తొలుత పంతులుగారు అనువదించారు. ఈసప్ కథల్లాగా మరికొన్ని కథల్ని పిట్టకథల్లా రచించారు. పరోపకారం, మూడు తియ్య మందులు, బాదము కాయ మొదలుగునవి.

కందుకూరి వారు వివిధ అంశాలపై రచించిన వ్యాసాలు నూటతొంబై దాకా వున్నాయి. సత్యవాదిని, వివేకవర్ధిని, సతీహిత బోధిని, చింతామణి మొదలైన పత్రికలలో ప్రచురింపబడిన వ్యాసాలు తర్వాత సంపుటాలుగా ప్రచురింపబడ్డాయి. పంతులుగారి వ్యాసశీర్షికలు కొన్ని **'చదువెఱగని స్త్రీలు తమ బిడ్డలకు శత్రువులు, అత్తగారి కోడంటికము, భార్యభర్తల ఐకమత్యము, ఆభరణములు'** మొ॥ వీరేశలింగం గారి వ్యాసాలలో ఆనాటి సాంఘిక సమస్యలు కనిపిస్తాయి. ముఖ్యంగా సంస్కార దృష్టితోనే వ్యాసరచన చేశారు.

ఆంధ్రవాఙ్మయమునకు పంతులుగారి కవులచరిత్రము వెలలేని భూషణము. సమగ్రమైన, పరిశోధనాత్మకమైన, ప్రణాళికాబద్ధమైన, కవుల చరిత్ర రచనముకు పంతులుగారే ఆద్యులు, అన్న రమాపతిరావు మాటలు అక్షర సత్యాలు, వివిధ గ్రంథాలయాలలోని పుస్తకాలను విశ్లేషించి, కైఫియత్తులను పరామర్శించి – ఆధారాలలో 'కవుల చరిత్ర'ను రచించడం విశేషం.

తెలుగులో స్వీయ చరిత్రలు రచించిన వారిలో కందుకూరే ప్రథములు. **"స్వీయ చరిత్ర వచన రచనమును వీరేశలింగము మార్గదర్శియే. అంతకు ముందున్న స్వీయ చరిత్రలు పద్యాత్మకములు. వీరేశలింగం తన స్వీయచరిత్రను నిష్పక్షపాతముగ రచించి రెండు సంపుటములుగా నాంధ్రలోకమున కొసగెను"** అని నిడదవోలు వెంకటరావు కీర్తించారు.

కందుకూరి వారి రచనలపై విమర్శలు వెలువడ్డాయి. అప్పుడు కందుకూరి వారే ఈ విధంగా తెలిపారు. **"పండిన వృక్షమునకే ఱాతిదెబ్బలన్నట్లు, పుస్తకములు వ్రాయు వారికే విమర్శనములను రాళ్ళు తాకును. అయినవి మొదలం గొంత నొప్పిగలిగించియు గ్రంథకర్తను గాల క్రమమున గట్టివానిం గావించుటయే కాక యాతని మహోన్నతు జేసి విమర్శలనముల గుణికందని వానిగ జేయును. లోకములో నెవ్వరును సర్వజ్ఞులు కాజాలరు. ఎంతటి విద్వాంసులు చేసిన పుస్తకములలోను తప్పులుండవచ్చును'** అని చాలా గొప్పగా చెప్పారు. తన తరువాత కవులకు ఒక మార్గదర్శిగా అయ్యారు. పైన చెప్పిన కందుకూరి మాటలు గమనిస్తే అతను గర్వం లేని వ్యక్తిగా, అహంకారం లేని రచయితగా కనిపిస్తారు.

నాకు మించిన కవిగానీ, రచయితగానీ, జ్ఞాని గానీ లేరని విర్రవీగే పండితులకు కందుకూరి మాటలు (మందు) ఒక దివ్య ఔషధంలాగా పని చేస్తాయని చెప్పవచ్చు. కందుకూరి వారిని ఆంధ్ర సాహిత్యము నకు సోపానం వేసిన ఒక గొప్ప వ్యక్తిగా చెప్పవచ్చు.

# రసకేతనం ఎగురవేసిన ధర్మ "రక్షాబంధం"

**సూలూరి శివ సుబ్రహ్మణ్యం,** మిర్యాలగూడ, ఫోన్ : 990 880 0244

**"వాక్యం రసాత్మకం కావ్యమ్"** అన్నది ఆలంకారిక వచనం. సాహిత్య దర్పణకారుడైన విశ్వనాథ కవిరాజు నిర్వచనమిది! జగన్నాథ పండితరాయలు దీనికే మెరుగుపెట్టి, మరింత స్పష్టతనిస్తూ **"రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్"** అని పేర్కొన్నాడు. ఏది ఏమైనా కావ్యం రచించాలంటే ఆ రమణీయములైన శబ్దార్థాలెంత అవసరమో – వాటికి ఆధారభూతమైన ఇతివృత్తమూ అంతే అవసరం! అంతమాత్రమే కాదు! కావ్య శోభాహేతువులైన అలంకారాదులు మొదలైన ఇతర కావ్యసాధన సామగ్రులకు కూడా అత్యంత ముఖ్యమైనది ఇతివృత్తమే! అది లేకుండా రసోత్పత్తి కూడ జరగదు కదా!. ఆధారం అదే కాబట్టి! ఒక ఉత్తమ కావ్యం లోక ప్రసిద్ధిని పొందడానికి ప్రధానపాత్ర పోషించేది ఇతివృత్తమే అని చెప్పడానికి రామాయణ, భారతాది మహాకావ్యాలే సాక్ష్యాలు! ఒక్కమాటలో చెప్పాలంటే భూమి వంటిది ఇతివృత్తం అయితే దానిపై ఆధారపడి నిర్మించే వివిధాకృతుల సుందర భవనాలే కావ్యాలు మొదలైన ఇతర రచనలు!!

సమాజాన్నీ – ఇంకా చెప్పాలంటే ఈ అనంతమైన సృష్టినీ – చక్కగా ప్రతిబింబించేవి కళలు. ఆ కళలలో ప్రథమపంక్తిలో నిలిచే ఒక ఉత్తమకళ సాహిత్యకళ! సృష్టిలోని ఏ ఒక్క అంశాన్నైనా ఎంత సమర్థవంతంగా ప్రతిబింబింపగలిగితే – చిత్రించగలిగితే – అది అంత గొప్ప సాహిత్యం అవుతుంది. సృష్టినీ – సాహిత్యాన్నీ బింబ ప్రతిబింబాలుగా చెప్పుకోవచ్చు! భారతీయుల ఉత్తమ ధార్మికతను, ఆదర్శ మానవీయతను, సత్యసంధతను, ఆర్తత్రాణ పరాయణతను... ఇంకా ఇలాంటి ఉన్నత నైతిక విశిష్ట గుణాలను ఎన్నింటినో చక్కగా ప్రతిబింబించిన దృశ్యకావ్యమే ఈ **'రక్షాబంధం'.**

ఈ రక్షాబంధం – చారిత్రాత్మక పద్యనాటకం. **'పురుషోత్తముడు'** మహాకావ్యానికి నాటకీకృతి. ఆ మహాకావ్యం 2008వ సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందింది. దాని రచయిత – ఈ నాటక రచయిత తండ్రిగారు **'కవిరాజశేఖర, 'కవి సుధాకర' బిరుదాంకితులైన కీ.శే. శ్రీమాన్ చిటిప్రోలు కృష్ణమూర్తిగారు.** తండ్రిగారి మహాకావ్యంలోని పద్యాలనే యథాతథంగా, సందర్భోచితంగా జోడిస్తూ 'రక్షాబంధం' నాటకాన్ని అత్యంత సమర్థవంతంగా రచించారు **చిటిప్రోలు వేంకటరత్నంగారు.** వీరు తెలుగు విశ్వవిద్యాలయ 'సాహితీ పురస్కార' గ్రహీత. డిగ్రీ కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు!

**'నాటకాంతం హి సాహిత్యం'** అని ఆర్యోక్తి. శ్రీ చిటిప్రోలు వేంకటరత్నంగారు 'తెలుగు లెంక' తుమ్మల సీతారామమూర్తిగారి **'బాపూజీ ఆత్మకథ'**పై ఒక పరిశీలనా వ్యాసం యం.ఫిల్ పరిశోధనాంశంగా సమర్పించడమే కాకుండ ఎన్నో సాహిత్య వ్యాసాలు, వ్యాస కవితా సంపుటులు వెలువరించారు. **'అశోకపథం'** అన్న చరిత్రాత్మక పద్యనాటకాన్ని రచించారు. అది రంగస్థలంపై ప్రదర్శితమై రసజ్ఞుల ప్రశంసల్ని అందుకున్నది కూడ. **'అమ్మకథ'** అన్న పేరుతో **'మదర్ థెరిసా'** జీవిత చరిత్రను ఆంగ్లమూలంలో ఉన్నదానిని గేయరూపంలో బృహద్గ్రంథంగా అనువదరించి ఎందరో సాహితీమూర్తుల మెప్పులకు పాత్రులైనారు. సాహితీవేత్తగా లబ్ధప్రతిష్ఠులైనారు. ఇప్పుడు వారి చరిత్రాత్మక పద్యనాటకం విశిష్ట నాటక రచనా సంవిధానంతో అందరినీ అబ్బురపరచే విధంగా వెలువడింది. సరళశైలిలో, వ్యావహారిక భాషలో కూర్చిన సంభాషణలు మూలరచయిత పద్యధారతో చక్కగా కలిసిపోయి రసానుభూతిని కలిగిస్తున్నాయి.

నాందీ పద్యం **"ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశో వాఽపి తన్ముఖమ్"** అన్న నాటక లక్షణానికి తగినట్లుగా ఉంది.

**"శా ॥ సత్యాలాపన, నార్త రక్షణను, శశ్వద్ధర్మ సంరక్షణన్**
**నిత్యంబుం జరియించుచున్.........."**

ఈ పద్యంలో నాయకుడు పురుషోత్తముడు రూపు కడుతున్నాడు. ధీరోదాత్తుడైన అతడు **'సుస్నిగ్ధాశయోపేతుడు!', 'స్తుత్యోదంచిత భారతాంబ మది సంతోషంబు నిండార నౌన్నత్యంబుగను'** భారతీయ రాజేంద్రుడు!! భారతీయ జని !!! **'భారతీయ జనబృందంబుల్ విరాజిల్లుతన్'** అన్న కవి ఆశయం ఆశీస్సమన్వితంగా ఉంది. భారతదేశంలో పుట్టిన ప్రతివారు (భారతీయ జనులు) పాలక వరేణ్యుడైన పురుషోత్తముని వలె ఆయా సల్లక్షణాలు కలిగి విరాజిల్లాలనేది కవి ఆశయం! కథాసూచన కూడా ఈ పద్యంలో గర్భితమై ఉండి, ఆలంకారిక నిర్దిష్టమైన రెండు లక్షణాలను కలిగి ఉండి, సామాజికుడికి నాటక ప్రవేశాన్ని సుగమం చేసే ద్వారంలా ఉన్నది!

నాందీ – ప్రస్తావనలను నేటి నాటక రచయితలు అంతగా పట్టించుకోరు. ఎవరూ రచించడం లేదు. రచించినా ప్రదర్శనకు నోచుకోవడం లేదు. పతివ్రత నుదుటి కుంకుమలాగా అలరారుతూ, ఉదాత్త భావనను కల్పించి, ప్రేక్షక సహృదయుల్ని రసప్రవాహంలో మునుకలు వేయించి, ఆనందపరవశుల్ని చేయడానికి ఇవి ఎంతైనా అవసరం! ఈ నాటకం ఆ అక్కరను తీర్చింది!

సాధారణంగా నాయక – ప్రతినాయకులలో ఎవరో ఒకరు ప్రథమాంకంలో తప్పనిసరిగా కనిపిస్తారు. నాటకం చివరివరకు

ప్రేక్షకుల్ని అలరిస్తారు. కాని ఈ నాటకంలో 'అంభి' పాత్రతో ప్రథమాంకం ప్రారంభమైంది. ఇది ఒక ప్రత్యేక విధానం! తన స్వార్థ సాధన కోసం పురుషోత్తముడిపై ద్వేషంతో అంభి విదేశీయుడైన అలెగ్జాండర్‌కు స్వాగతం పలకడానికి సిద్ధపడతాడు. అటువంటి దేశ ద్రోహికి తోబుట్టువు ప్రార్థనాదేవి దేశభక్తురాలు! ఇద్దరూ తమ అభిప్రాయాలను మార్చుకోవడానికి ఇష్టపడనివారే! ఒకరు దేశద్రోహానికి చిహ్నమైతే మరొకరు దేశభక్తికి చిహ్నము! ఆ ఇద్దరి మధ్యా రచించిన సంభాషణలు రసస్ఫోరకాలై, ప్రేక్షకులలో ఉత్కంఠతను రేకెత్తిస్తున్నాయి. తరువాతి కథాగమనం ఎలా ఉంటుందో అన్న ఔత్సుక్యాన్ని కలిగిస్తున్నాయి. రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలు ఛీకొట్టినా సిగ్గుపడని అంభి మాతృదేశ ద్రోహచింతన ఏ స్థాయిలో ఉందో ప్రార్థనాదేవి అన్న ఈ ఒక్కమాట చక్కగా వ్యక్తీకరిస్తున్నది.

**"ఒక దుష్టుడు తల్లిని చెరబట్టడానికి రావడం కళ్ళారా చూస్తూ కూడా నీచాలోచనతో కాలక్షేపం చేస్తూ చీమ కుట్టినట్లైనా లేని మగబిడ్డను – ఈనాటికి చూస్తున్నాను. హుఁ .. అచంచల శౌర్య ధైర్య సాగరులై రణవిద్యా ధురంధరులై అసమయశస్తేజస్వంతులైన పుత్రులు పుట్టారు. ఏమి దౌర్భాగ్యమో. (కళ్ళనిండా నీళ్ళు నిండుతాయి)."** ప్రార్థనా దేవికే కాదు ఈ ఘట్టం ప్రతి భారతీయుని కళ్ళనూ తడి చేస్తుందనడం అతిశయోక్తి కాదు! పైగా అంభి **"అబలవు నీకు రాజకీయాలెందుకమ్మా!..."** అంటే ప్రార్థనాదేవి ఇచ్చిన ప్రత్యుత్తరం నారీమణులకు స్ఫూర్తిదాయకమే కాక దేశద్రోహులైన మగవారికి చెంపపెట్టుగా కూడా ఉంది. అన్నను ప్రతిఘటిస్తూ ప్రార్థనాదేవి **".... ఏమిటీ! అబలకు రాజకీయాలెందుకంటున్నావా.**

**"మగతనం బొప్ప మగవారు మలయుచున్న
మగువలకు రాజకీయముల్ తగవు గాక
మగతనం బేది మగవారు మందులైన
మగువలును మిన్నకున్న నేమగును జాతి?" (పుట.17)**

అంటూ తన నిర్ణయాన్ని నిర్ద్వంద్వంగా వెల్లడించి, **".... దేశం శాంతిభద్రతలతో విరాజిల్లుతున్నప్పుడు సుఖంగా కాలం గడపడంలో దోషం లేకపోవచ్చు గాని గాలికంటే అత్యవసరమైన స్వేచ్ఛకు ప్రమాదం కలిగినప్పుడు ఎండ కన్నెరుగని రాచకన్నెలకైనా బయట పడక తప్పదు గదా.... నాడే నీ భ్రాతృత్వం కూడ విలువ లేనిదైపోయింది. ఇక భారతమాత కనుగొలకులలో రక్తాశ్రువులు నింపడానికి నువ్వు వెళ్లు. శత్రు రక్త ప్రవాహంతో భారతీయ రాజ్యాలకు చేవ పెంచడానికి, ఆమెకు ఆనందం కలిగించడానికి నేను వెళ్తాను. సెలవు...."** అంటూ రక్తబంధాన్ని కూడా త్యజించడానికి వెనుకాడని ప్రార్థనాదేవి అన్ననూ, రాజ్యాన్నీ వదిలి వెళ్లిపోతుంది. దేశభక్తికి పరాకాష్ఠ ప్రార్థనాదేవి! ఆ పాత్రచిత్రణ ఈ నాటకానికే శిఖరాయమాణం!

నాటక రచన ఆసాంతమూ రసరమ్యంగా సాగినా అది రక్తి కట్టడానికి కొన్ని ఘట్టాలు ఎంతగానో సహకరిస్తాయి. అటువంటి కీలకమైన ఘట్టాలలో అంభి – అలెగ్జాండర్ల సమావేశం ముఖ్యమైంది. దేశద్రోహుల స్వార్థచింతన దురాక్రమణపరులకు ఎలా కొంగు బంగారమౌతుందో ద్వితీయాంకం మొదటిరంగం చక్కగా నిరూపిస్తున్నది. దేశద్రోహానికి ఒడిగట్టిన అంభి ప్రవర్తనలోని పలుచదనం స్పష్టంగా తెలుస్తున్నది. అతని ప్రతిమాట స్థాయిని దిగజార్చుకొనే విధంగా ఉంది. శత్రురాజైన అలెగ్జాండర్ తన విజయావకాశాలను ఎలా పెంచుకోవాలనుకుంటున్నాడో – అంభితో మాట్లాడిన మాటలు చక్కని సంభాషణలలో ఒదిగి రసజ్ఞుల హృదయాలను హత్తుకుంటున్నాయి.

కావ్యంలో మధ్యమధ్య తన అభిప్రాయాల్ని వ్యక్తపరచే స్వాతంత్ర్యం కవికి ఉంటుంది. కాని దృశ్యకావ్యంలో ఆ హక్కు కవికి ఉండదు. తన అభిప్రాయాలను పాత్రల ద్వారా మాత్రమే వ్యక్తీకరించవలసి ఉంటుంది. కాని తను స్వయంగా తలదూర్చకూడదు. ఈ నాటకంలో ద్వితీయాంకం రెండోరంగంలో అంభి – అలెగ్జాండర్‌ల సంభాషణల ద్వారా ఆ పాత్రల మనస్తత్వ చిత్రీకరణ చక్కగా జరిగింది. కవి **'చేయి తిరిగినతనం'** ఇక్కడే విస్పష్టమౌతుంది. అంభి ద్వారా పురుషోత్తముడి వివరాలన్నీ రాబట్టుకుంటాడు అలెగ్జాండర్. తన స్వార్థ సాధన కోసం అంభి దేశద్రోహమని కూడా ఆలోచించకుండ పురుషోత్తముడి వివరాలన్నీ బట్టబయలు చేస్తాడు. తమ మాతృభూమిపై దండెత్తివచ్చిన అలెగ్జాండర్‌కు – తాను మొదటిసారి కలిసిన దగ్గర నుండీ అతివినయం ప్రదర్శిస్తూ వస్తాడు అంభి. ఈ విషయాన్ని మొదట్లోనే గ్రహించిన పరదేశ పాలకుడైన అలెగ్జాండర్ ద్వితీయాంకం – రెండో రంగంలో చివరి తన స్వగతంలో చక్కగా విశ్లేషించుకుంటాడు. అణువణువునా అంభి స్వార్థపూరిత వ్యక్తిత్వాన్నీ, ప్రవర్తననూ వ్యక్తీకరిస్తాడు. అంభిపై తనకేర్పడిన చులకన భావం ఇక్కడ సుస్పష్టం చేస్తాడు. పురుషోత్తముడి దేశభక్తీ – అంభి నక్క వినయం కవి సహృదయుల హృదయాలను చక్కగా అందించడంలో కృతకృత్యులైనారు.

రాజుల్ని చారచక్షువులు అంటారు. గుప్తవేషాలలో శత్రురాజ్యంలో సంచరిస్తూ అక్కడి విశేషాల్ని ఎప్పటికప్పుడు చారులు రాజుకు తెలియజేస్తూ ఉంటారు. కాని పాలకుని ప్రజ్ఞాపాటవాలు, నాయకత్వ లక్షణాలు ఇతర సందర్భాలలో కూడా బయటపడుతూ ఉంటాయి. అలెగ్జాండర్ ఆవిధంగా గూఢచారులపైనే ఆధారపడకుండా తానే స్వయంగా **'అలెగ్జాండర్ దూత'**గా పురుషోత్తముణ్ణి దర్శించాలని కోరుకుంటాడు. దానికి కారణం పాంచాల రాజ్యంలోని సత్యనారాయణపురంలో మారువేషాలలో అమాత్యునితో కలిసి తాను సంచరించి రావడమే! వారిద్దరి సంభాషణల ద్వారా పురుషోత్తముని ధర్మ ప్రవృత్తీ, న్యాయపరిపాలనా, ఆ రాజ్యంలోని ప్రజల ధర్మనిరతీ

వెల్లడౌతున్నాయి. విదేశీయుడైనా అలెగ్జాండర్ పురుషోత్తముణ్ణి మనసారా మెచ్చుకుని ప్రశంసిస్తాడు. అంతటి విదేశీ దురాక్రమణ పరుని చిత్తాన్ని కూడా రంజింపజేయగలిగినవాడు పురుషోత్తముడు! ద్వితీయాంకం మూడోరంగం చివర్లోని అలెగ్జాండర్ స్వగతం అతని ధీరోదాత్తతకు అద్దం పడుతున్నది. కవి రచనకు నికషోపలమైన ఘట్టం ఇది. ఇక్కడ ప్రతినాయకుని పాత్ర చిత్రీకరణ అద్వితీయం!

ఇక నాటకం నామౌచిత్యం ప్రేక్షకులకు తేటతెల్లం చేసేది తృతీయాంకం మొదటి రంగం. **'రక్షాబంధం'** ధర్మదీక్షాబంధంగా మరాడానికి వేదికగా నిలిచింది ఈ రంగమే! నాయకుడు పురుషోత్తముని ఉత్తమగుణాలన్నిటికీ అద్దం పడుతూ అతణ్ణి **'ధర్మవీరునిగా'** నిరూపించింది కూడా ఈ రంగమే! రాజు వీరుడు మాత్రమే కాదు ఆర్తత్రాణ పరాయణుడూ, ప్రజారంజకుడూ అయి ఉండాలనీ గట్టిగా ఉద్ఘాటిస్తూ, అటువంటి పాలకుడే నిజమైన దేశభక్తుడనీ, అమలిన కీర్తిని పొందగలడనీ నిరూపించింది ఈ రంగమే! రుక్సానా తన ప్రియుడైన అలెగ్జాండర్‌ను కాపాడమని – పురుషోత్తముడికి రక్షాబంధం కట్టడం ద్వారా అర్థించింది. తన మాతృభూమి స్వేచ్ఛను హరించడానికి వస్తున్న విదేశీ శత్రువు ప్రాణాల్ని కూడా హరించకుండా సోదర బంధాన్ని తగిలించింది రుక్సానా – శత్రువు ప్రియురాలు! ఇంకా రుక్సానా ఇలా అంది –

**"ఆగడము మీర నిమ్మహా యోగభూమి**
**భరతఖండంబు దెసకు నప్పార్థివేంద్రు**
**నడుగు లెన్నెన్ని పడియెనో యన్ని యన్ని**
**పిడుగు లీ లేమ గుండెలోఁ బడియె నన్న!" (పుట. 43)**

**"కోపించి నీట ముంచెదొ**
**భూపాలవరేణ్య! మ్రొక్కి మొఱలిడు దీనన్**
**దీపించి పాల ముంచెదొ**
**నీ పాలంబడిన దాన నీ యిష్టమికన్!" (పుట. 43)**

అంటూ పురుషోత్తముణ్ణి గొప్ప ధర్మసంకటంలో పడవేసింది. ఈ సందర్భంలో పురుషోత్తముని సుదీర్ఘ స్వగతం అతణ్ణి ధర్మాధర్మ నిర్ణయం ఎంతటి సందిగ్ధానికి గురిచేసిందో తెలియజేస్తుంది. కాని అతని ఔచితీమహిత విశ్లేషణ ధర్మసూక్ష్మం వైపు మొగ్గు జూపి అతణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేయడం అతని ధార్మికతకు మచ్చుతునక! పురుషోత్తముని నిర్ణయాన్ని విన్న రుక్సానా **"(ఉప్పొంగిపోతూ) హృదయాన్నే పోగుగా తీసి కట్టిన సూత్రాని కిప్పుడు ప్రయోజనం కలిగింది ప్రభూ! నీ ఔదార్యం ప్రపంచమంతా హారతి పట్టదగింది"** అంటూ మురిసిపోవడం. ఆమె అమలిన ప్రేమపూరిత హృదయానికి నిదర్శనం! ఇంకా ఆమె "(ఆనందంగా) **ధర్మస్వరూపుడైన పాంచాలరాజు గృహం పుట్టినిల్లుగా, మోక్షలక్ష్మీ విహారస్థలమైన భారతదేశం మాతృదేశంగా ప్రాప్తమయ్యాయి. ఇంక నాకు లోటేమిటి!..."** అనడంలో ఆమె విశాల హృదయం వ్యక్తం అవడమే కాకుండా పురుషోత్తముడి ఆర్తత్రాణ పరాయణత్వాది సుగుణాలతో సమ్మిళితమైన ధర్మనిబద్ధత శిరమెత్తి నిలవడం కూడ విశదమౌతున్నది. ఈ విషయాన్ని మొదట్లో వ్యతిరేకించిన కొడుకుల్నీ, నిరుపమాన దేశభక్తికి రూపెత్తిన ప్రార్థనాదేవినీ తన మాటల్తో ముగ్ధుల్ని (అంగీకృతుల్ని) చేసిన పురుషోత్తముడి దీక్షాదక్షత ప్రశంసనీయమైనది! చివరికి అతనిలా అంటాడు –

**"నీచతర ప్రవృత్తి మహనీయ మనుష్యత నుజ్జగించి పె**
**ల్లేచిన రక్తదాహమున నింత దురాగతుడైన గ్రీకురా**
**జీ చెలిచెల్మి నోచుకొన నిందు సుబాహుడు గాకయుండ, మా**
**రీచుని జేయనేరవొ యరిందమ భారత రామ బాణముల్!"**
**(పుట. 49)**

ధర్మ నిర్వహణకు నీరాజనమెత్తిన ఈ పద్యం కావ్యకన్యక కిడిన చూడామణి అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

పురుషోత్తమ ప్రభువు ఎంత రాజనీతిజ్ఞుడైనా – ప్రజాభిప్రాయ సేకరణ కోసం సమావేశాన్ని ఏర్పాటు చేయడం అతని విజ్ఞతకు చిహ్నమే కాకుండ ప్రజా ప్రభుత్వ విశిష్టతను గుర్తించిన అంశంగా చెప్పుకోవచ్చు! రైతులూ, కార్మికులూ, మహిళలూ, కళాకారులూ మొదలైన అన్ని వర్గాల ప్రజలూ తమ సహకారాన్ని ప్రభువుకు అందిస్తామని చెప్పడం (పుట 56,57) వారికి గల ప్రభుభక్తినీ, మాతృదేశానురక్తినీ తెలియజేయడమే. విశేషమేమిటంటే అదే సమావేశంలో మారువేషంలో దూతగా వచ్చిన అలెగ్జాండర్ కూడ ఉంటాడు. దూతగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ అలెగ్జాండర్ తమ ప్రభువు గొప్ప యోధ అనీ, అతనికి లొంగిపొమ్మనీ పరిపరి విధాల చెప్తాడు. సభాసదులతనికి తగినవిధంగా సమాధానమిస్తారు. అతనే అలెగ్జాండర్ అన్న అంశాన్ని కుండబద్దలు గొట్టిన పురుషోత్తముడు ప్రపంచ విజేత కావాలన్న అతని అధికారవాంఛనూ, అతనికి మార్గదర్శనం చేసిన అతని గురువునూ నిరసిస్తూ –

**"ఈశ్వరుండు దక్క నీ ప్రపంచము నెల్ల**
**నొక్క మర్త్యుడేల నోపునొక్కొ!**
**యేలుమనెడు వాడు నీలెద ననువాడు**
**నీ యథార్థమును గ్రహింపరేల?" (పద్యం 22, పుట 62)**

అంటాడు. తరువాత పురుషోత్తముడికీ, అలెగ్జాండర్‌కూ జరిగిన సంభాషణలు రాజధర్మ నిరూపకాలు! చివరికి దూతవేషంలో వచ్చిన అలెగ్జాండర్ పురుషోత్తముడితో ఇలా అంటాడు. **"ప్రభూ! నువ్వు వీరశిరోమణివని విన్నాను. ఇప్పుడు నీలో ఒక మహనీయ ధార్మికుణ్ణి చూస్తున్నాను...**

**"అఖిల లోకంబుల........**
**... నీకు నీవె తుల్యుండ వో నృపవరేణ్య!"(పద్యం 24, పుట. 64)**

ఈ పలుకులు పురుషోత్తముని ధర్మనిరతి విశిష్టతనే కాకుండ – మొదట సైనిక బలసంపదతో అహకంరించినా తరువాత ధార్మిక బల ప్రాధాన్యాన్ని గుర్తించిన అలెగ్జాండర్ విజ్ఞతను కూడ అద్దం పట్టి చూపుతున్నాయి. (వశిష్ట – విశ్వామిత్రుల ఉదంతం స్ఫురిస్తున్నది)

తరువాత నాటకం పరస్పర జయాభిలాషతో సాగుతుంది. మహాభారత యుద్ధంలో అభిమన్యుడు మరణించిన విధంగానే అమరసింహుడు కూడ యుద్ధంలో అమరుడౌతాడు. తరువాత ఉభయపక్షాలూ యుద్ధ సన్నద్ధమౌతాయి. ప్రార్థనాదేవి, రుక్సానాల అభిప్రాయాలను పురుషోత్తముడు అడుగుతాడు. అంభి, అలెగ్జాండర్ల అపజయాన్నే ఇద్దరూ ఆశిస్తారు. ఇక్కడ రుక్సానా వెల్లడించిన అభిప్రాయం కందపద్యంలో అందగించింది.

**"విజయము మిమ్ము వరించుత**
**ధ్వజినీ వ్యూహములతో నతండింటి దెసన్**
**గజిబిజియై క్రమ్మరుతన్**
**వృజినం బీ కృత్యమని గ్రహించుత గురుడున్"**

**అలా జరగాలి. నా కళ్ళు ఆనందంతో మెరవాలి."** ఇందులో రుక్సానాతో సహా అందరి ధర్మపక్షపాతం, అధర్మం పరాజయం పాలు కావాలన్న తపనా స్పష్టమౌతున్నది.

చివరికి సప్తమాంకం ఐదోరంగంలో యుద్ధం చివరిదశకు చేరుకుంటుంది. ఆ సమయంలో ఇద్దరు ముసుగు మనుష్యులు యుద్ధరంగంలో ప్రవేశించి యుద్ధానికి స్వస్తి పలుకుతారు. వారిరువురూ ప్రార్థనాదేవీ, రుక్సానాలు!. పురుషోత్తముడి ధర్మదీక్షా దక్షతను అంతకుముందే ఎరిగి ఉన్న అలెగ్జాండర్ – పుత్రశోకాన్ని సహిస్తూ కూడా "రక్షాబంధం' విలువలకు కట్టుబడి, శత్రువుపై కరుణజూపిన అతని (పురుషోత్తముని) ఔదార్యాన్ని మెచ్చుకుంటాడు. జయజయధ్వానాలతో రుక్సానా – అలెగ్జాండర్, ప్రార్థనా సమరసింహుల వివాహ ప్రస్తావనతో కథ సుఖాంతమవుతుంది. ధీరోదాత్త నాయక లక్షణాలు పరిపూర్ణంగా కలిగిన పురుషోత్తముడ ఈ పలుకులు ఈ సందర్భంలో ఉటంకించటం ఎంతైనా సందర్భోచితం!

**".... మార్గం దుర్మార్గమైపోయింది గానీ లేకపోతే ప్రపంచమంతటి జేజేలందుకో దగ్గవాడితడు...."** సుందరకాండలో రావణాసురుణ్ణి చూచి ఆంజనేయుడు తనలో అనుకున్న మాటల్ని గుర్తుకు తెస్తున్నాయి ఈ మాటలు!

చివరగా చెప్తున్నా. ముందుగా చెప్పదగిన ఒక ముఖ్యమైన అంశం...నాటకాల్ని అంకాలుగా, రంగాలుగా ఏర్పరచి, కథా గమనాన్ని రచయిత ముందుకు నడిపిస్తాడు. కొన్ని సందర్భాలలో ప్రదర్శింపవలసిన అవసరం లేని కథాభాగాన్ని వాటిలో చెప్పకుండా – ప్రేక్షకులకు కథావగాహన కలిగించటం కోసం ప్రాచీనాలంకారికులు 'అర్థపక్షేపకాల'ను (ప్రవేశకాదులను), వాటి లక్షణాలను వివరంగా తమ లక్షణ గ్రంథాలలో పేర్కొన్నారు. ప్రాచీన నాటక రచయితలు (కవులు) తమ నాటకాలలో సందర్భోచితంగా వాటిని రచించారు కూడా! కాని నేడు నాటకరంగం సాంకేతికంగా ఎంతో ఎదిగింది. ఆనాడు ప్రదర్శనకు సాధ్యం కావనుకున్నవాటిని నేటి నాటకరంగ దర్శకులు రంగస్థలంపై సమర్థవంతంగా ప్రదర్శిస్తున్నారు కూడా!. శ్రీ చిటిప్రోలు వేంకటరత్నంగారు తమ నాటకంలో ఆ అర్థోపక్షేపకాల ప్రయోజనాన్ని గేయాలు, గీతాల రూపంలో చక్కగా రచించి సాధించారు. ఇవి (గేయాలు – గీతాలు) అన్నీ నేపథ్య గేయాలు – గీతాలుగా సామాజికుడికి తమ ప్రయోజనాల్ని అందించడంలో సాఫల్యం సాధించాయి.

అంభి మరియు ప్రార్థనాదేవి స్వభావాలకు అద్దం పడుతూ గేయం 1 (పుట.19), పురుషోత్తముడికి రక్షాబంధం కట్టిన తరువాత రుక్సానాకు కలిగిన మానసిక సాంత్వనను విశదీకరిస్తూ గీతం 1 (పుట.51), పురుషోత్తముడు తన కొలువుకూటంలో సామాన్య పౌరులకు కూడా చోటు కల్పించి, వాళ్ళ అభిప్రాయాలను కూడ శ్రద్ధగా వింటాడనటానికి గేయం 2 (పుట.58), రాజులు ఏర్పరచుకున్న దేశరక్షణ వలయాన్ని శత్రు సైనికులు ఎలా ఛేదించి తమ లక్ష్యాన్ని చేరుకుంటారనే విషయాన్ని వివరిస్తూ గేయం 3(పుట.76), అమరసింహుణ్ణి అక్రమంగా మూకుమ్మడి దాడి చేసి చంపిన తరువాత ఆ సంఘటన అలెగ్జాండర్ను మానసిక సంఘర్షనకు గురిచేసి తలవంచుకునేలా చేసిన విషయం గీతం 2 (పుట.87), సమరభూమికి కదలిన పురుషోత్తమ, సమరసింహులను గేయం 4 (పుట.96), పురుషోత్తముడు – సికందరులను గేయం 5, (పుట.105) చక్కగా వివరిస్తున్నాయి. అవి ప్రాచీనాలంకారికులు చెప్పిన నాటక ప్రయోజనాల్ని పరిపూర్ణంగా సాధించాయని చెప్పక తప్పదు! గేయ – గీత రచనలో శ్రీ చిటిప్రోలు సిద్ధహస్తులని ఈ నాటకం చదివిన (చూచిన) వారెవ్వరైనా ప్రశంసింపక మానరు!!

నాటకం రక్తి కట్టాలంటే – జీవితంలో లాగానే ఘాత, ప్రతిఘాతాలెంతైనా అవసరం! వీర (ధర్మవీర) రస ప్రధానమైనా – ఆనందప్రదాయకమైన శాంతరసం (కొందరి దృష్టిలో శాంతం రసం కాకపోవచ్చు!) వైపు మొగ్గు జూపుతూ 'రక్షాబంధం' నాటకం ప్రేమ బంధానికి, అనురాగ బంధానికీ పట్టం కట్టింది. అశాంతిని రేపే యుద్ధం కంటే ఆనందాన్నిచ్చే ప్రశాంతతకే ప్రాధాన్యమివ్వాలన్న సంకేతాన్నిస్తూ, వ్యక్తిగత సౌఖ్యం కంటే దేశశ్రేయస్సు ద్వారా లభించే (ప్రజా) సౌఖ్యమే ముఖ్యమన్న సందేశాన్ని అందించడంలో నాటకం సఫలీకృతమైంది. శ్రీ చిటిప్రోలు వేంకటరత్నంగారి సాహితీ పరిశ్రమ తీర్చిదిద్దిన అమరశిల్పమే ఈ 'రక్షాబంధం'... "ధర్మ రక్షాబంధం"

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# సాహిత్యపు అస్తిత్వాన్ని చూపే దర్పణమే "తెలుగు సాహిత్యం – మరో చూపు"

ఎం. కురుమయ్య, ఫోన్ : 77 99 55 3493

20వ శతాబ్దపు పూర్వ భాగం దాకా సాహిత్యాన్ని కేవలం **"శైలి, అలంకారం, రసం"** మొదలైన కళాత్మక విలువల దృష్ట్యా మాత్రమే పరిశీలించడం జరుగుతూ వస్తున్నది. దానివల్ల సాహిత్యం ప్రామాణికతకు కొంత దూరమైంది. దీనిని పరిగణలోకి తీసుకొని **"సామాజిక,రాజకీయ, చారిత్రక భూమిక"**తో తెలుగు సాహిత్యాన్ని పరిశీలించాలనే దృక్పథంతో రంగనాథ చార్యులు రాసినదే **"తెలుగు సాహిత్యం– మరో చూపు"** అన్న రచన. ఆనాటి సాహిత్య చరిత్రకు ఆవల ఉన్న వాస్తవిక సాహిత్య చరిత్రను చూపే దర్పణమే ఈ "తెలుగు సాహిత్యం– మరో చూపు" అన్న రచన. వీరు సాహిత్యాన్ని అందరు విమర్శకుల లాగా భావజాలం లక్షణ నియమాల ఆధారంగా కాక సాహిత్యం పై గల దేశ–కాల, మత, ఆర్థిక సామాజిక వాస్తవిక అంశాల ప్రభావం దృష్ట్యా పరిశీలించారు.

ఒక భాష యొక్క విశిష్టతను, గొప్పతనాన్ని తెలిపేది ఆ భాషలో వెలిసిన సాహిత్యమే. సాహిత్యం అంటే సంస్కృతిని ప్రతిబింబింపచేసేది అని అర్థం. ఒక జాతి, దేశ,సంఘం యొక్క జీవన విధానాలు, వారి ఆచార వ్యవహారాలు, సామాజిక–ఆర్థిక స్థితిగతులు, కట్టుబాట్లు, కళలు మొదలగు అన్నింటి సమన్వయమే సంస్కృతి. అటువంటి సంస్కృతికి రూపం ఇచ్చి, వాటిని భద్రపరిచి, భవిష్యత్ తరాలకు సజీవంగా అందించేది సాహిత్యం మాత్రమే.

ముఖ్యంగా ఆ కాలం నాటి భారతదేశంలోని ప్రాంతీయ భాషా సాహిత్యాలు ఆస్థాన, ఆస్థానేతర సాహిత్యాలుగా అభివృద్ధి చెందాయి. ఆస్థాన సాహిత్యం ఫ్యూడల్ వ్యవస్థకు అనుకూలమై, దానిని బలపరచడానికి ఉపయోగిస్తే, ఆస్థానేతర సాహిత్యం ఫ్యూడల్ వ్యవస్థను, దాని కనుకులమైన కుల వ్యవస్థనూ వ్యతిరేకిస్తూనో, భక్తి సాహిత్యంగానో జనంలో వ్యాపించింది. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేకమైన చారిత్రక కారణాలవల్ల, ఫ్యూడల్ వ్యవస్థ ప్రభావం వల్ల కొన్ని భాషల్లోని లిఖిత సాహిత్య చరిత్రలో ఆస్థాన సాహిత్యానికి ప్రాధాన్యం ఏర్పడగా, కొన్ని భాషల్లో ఆస్థానేతర సాహిత్యానికి సమప్రాధాన్యం, మరికొన్ని చోట్ల అధిక ప్రాధాన్యం కనబడు తుంది. ఆస్థాన సాహిత్యానికైనా, ఆస్థానేతర సాహిత్యానికైనా మతమే ప్రధాన ప్రాతిపాదికగా కనిపిస్తుంది.

ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాల్లో కాలక్రమంలో వచ్చిన పరిణామాన్ని చెప్పటమే దేశ చరిత్ర అయితే, ఆ సంబంధాలు సాహిత్యంలో ఎలా ప్రతిబింబించాయో, దాని కనుగుణంగా సాహిత్య రూపాలు ఎలా సంతరించు కున్నాయో చెప్పటమే సాహిత్య చరిత్ర. శిష్ట సాహిత్య రూపాన మనకి అందుబాటులో ఉన్న ఈ సాహిత్యం సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఎంతవరకు ఉపకరిస్తుందో చెప్పటం కష్టమే. ఎందుకంటే ఆనాటి సంస్కృతిలో ఆధ్యాత్మిక విలువలు ప్రధానంగా ఉండి మతం, తత్వం, చట్టం, సాహిత్యం, సంగీతం, చిత్రకళ మొదలగు ఉపరితల విషయాలన్నింటిలోనూ ఆధ్యాత్మికతే ప్రతిబింబిస్తుందనే ఒక అభిప్రాయం కలదు. కానీ సంస్కృతి అంటే ఒక సమాజపు సంపూర్ణత్వాన్ని విశదీకరించగలగాలి. ఇది సగటు మానవుని సామాజిక, వాస్తవిక జీవన పరిస్థితులను,ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, భావజాలం వంటి మౌలికాంశాలన్నింటి మధ్య గల సమన్వయ చిత్రీకరించగలగాలి. తొలినాళ్ళలో సాహిత్యం మత ఆధిపత్యానికి లోనైతే, తర్వాతి కాలంలో ఆర్థిక ఆధిపత్యానికి గురవ్వాల్సి వచ్చింది. ఆర్థిక ఆధిపత్యం మతం కంటే బలవత్తరమైనది.

ఒక విషయాన్ని అభివ్యక్తికరించే పద్ధతిలోని కళాత్మక విలువలను బట్టి ఒక రచనను సృజనాత్మక రచన అని సాహిత్య రచన అని వర్గీకరిస్తారు. సృజనాత్మక రచనలో కేవలం రసానుభూతి, భావనశక్తి మాత్రమే ప్రధానంగా ఉంటాయి. సాహిత్య రచన అనేది సంస్కృతిని, సామాజిక అంశాలను మిళితం చేసిన సృజనాత్మక రచన. ఇందులో రసానుభూతి, భావనశక్తితో పాటు సమకాలీన సామాజిక స్పృహ, వాస్తవికత వంటి అంశాలు అంతర్లీనంగా ఉంటాయి. సాహిత్య చరిత్ర రచనలో సింహభాగం ఇవ్వాల్సింది సాహిత్య రచనావళికే కానీ సృజనాత్మక రచనలకు కాదు. అయినప్పటికీ ఒక విషయాన్ని అభివ్యక్తికరించే పద్ధతిని, రచన రూపాన్ని నిర్ణయించేది కవి యొక్క సాంఘిక అస్తిత్వం, కవి ఆశించే ప్రయోజనం మాత్రమే. నన్నయ మహాభారతాన్ని తెలుగులోకి అనువదించాలను కున్నప్పటికీ అందులో సంస్కృత ప్రభావం, బ్రాహ్మణ మత ధర్మాలు గల ఒక లౌకిక కావ్య అంశాలు అధికంగా కనిపించడానికి కారణం ఆనాటి సమాజంలో అధికంగా గల సంస్కృత భాష, వర్ణ వ్యవస్థ యొక్క ప్రభావమే. శివకవి యుగంలో వచ్చిన అనుభవ సాహిత్యం, దేశి సాహిత్యం, వీరశైవ మత ప్రభావం ఫలితంగానే పాల్కురికి సోమన్న తన రచనలలో దేశీయతను, అచ్చ తెలుగును పరచగలిగారు. అంతేకాక బసవ్వ వంటి సామాన్య వ్యక్తులను కన్నప్ప వంటి అటవీకులను, గంగిరెద్దులవారు మొదలగు జానపద కళాకారులను కథా వస్తువులలో భాగంగా ఎంచుకోవటం, సమాజంలోని అస్పృశ్యతను, వర్ణ వ్యవస్థను నిరసించడం వంటివి వారు ఆశించిన సంస్కరణ తత్వ ప్రయోజనాన్ని వెల్లడిస్తున్నాయి.

ఒక సాహిత్యం లోని మౌలిక సాహిత్య గ్రంథాలను సామాజిక

విపరిణామం దృష్ట్యా పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. దానిని చూసే దృష్టిని మార్చుకుంటే సరిపోతుంది. అందులో సమకాలీన సమాజానికి/సాహిత్యానికి అవసరమైన అంశాలను వెతుక్కోగలగాలి. చారిత్రక ఆధారాలు, గ్రంథాలు లభించిన సందర్భాలలో ఈ సాహిత్య గ్రంథాలే చరిత్ర రచనకు/ఆనాటి ప్రజల జీవన విధానాన్ని తెలుసుకోవడానికి ఉపకరిస్తాయి.

**"జొన్నకలి జొన్నయంబలి**
**జొన్నన్నము జొన్న పిసరు జొన్నలె తప్పన్**
**సన్నన్నము సున్నసుమీ**
**పన్నుగ బల్నాటి సీమ ప్రజలకు నెల్లన్"**

పై శ్రీనాధుని పద్యాన్ని చదివితే ఆనాటి ప్రజల ఆహార విధానాలు, వారి జీవన శైలి మనకు ప్రస్ఫుటంగా కనబడుతుంది.

సురవరం ప్రతాపరెడ్డి గారు రాసిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర అన్న గ్రంథానికి ఉపయుక్త ఆధారం ఆనాటి కొఱవి గోపరాజు గారు రాసిన సింహాసన ద్వాత్రంశిక అన్న గ్రంథమే.

కవి తాను నివసిస్తున్న సమాజం, నాటి పరిస్థితులు, తాను ఎంచుకున్న సాహిత్య రచనకు మధ్య గల పరస్పర వైరుధ్యాలు కవిని నిరంతరం వెంటాడతుంటాయి. తన కాలంనాటి సమాజం ఒకరకంగా ఉంటే తాను కోరుతున్నది, సాధించాలని ఆశిస్తున్న సిద్ధాంతాలు, భావాల మధ్య వైరుద్యాలు అతని లక్ష్యాన్ని కొంత అయోమయానికి గురి చేయవచ్చు. ఈ వైరుధ్యాలను గుర్తించి వేరు చేయగలిగినప్పుడే తన లక్ష్యానికి పరిపూర్ణత చేకూర్చగలరు.

పాల్కురికి సోమన్న దేశీ మార్గమని ద్విపదను అనుసరించినా, తొమ్మిది రసములు కొలుకాదు దాని, యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణమగు నలంకారం బులసలారు దాని, దిగునార్ధ భావములు దీటుకొనంగ అని సంస్కృత అలంకార శాస్త్ర మర్యాదల్ని పేర్కొనకుండా ఉండలేకపోయారు. అల్పాక్షరముల ననల్పార్ధ రచన, కల్పించుటయే కాదే కవి వివేకంబు అంటూనే అలాంటి రచన చేయలేక పోయాడు. జాను జానుగు ప్రసన్నతకు కారణం అంటూనే సంస్కృత భూయిష్ఠమైన పండిత భాషనే వాడాడు. సమకాలంలో కవి అస్తిత్వం పైన ఆధారపడిన భావజాలం అందులో కనిపించే వైరుధ్యాలు సాహిత్యంలో ఎలా ప్రతిబింబిస్తాయో, సాహిత్య రూపాన్ని నిర్ణయించడంలో ఎలా ప్రధాన పాత్రను వహిస్తాయో చెప్పడానికి సోమన సాహిత్యం ప్రధాన నిదర్శనం.

తెలుగు లిఖిత సాహిత్యం ప్రధానంగా ఆస్థాన సాహిత్యంగా, పండిత సాహిత్యంగా మొదలైనప్పటికీ ఆధునిక కాలంలో సామాజిక విలువలు, సమ సమాజ స్థాపనే ప్రధాన భూమికగా పరిణతి చెందింది. ఒక దశలో చాలా కృత్రిమంగా పరిణమించినా ఆస్థాన సాహిత్యం లోనూ కళా విలువలు ఉన్నతంగా రూపొందిన మాట కాదనటానికి వీల్లేదు. మధ్యలో సామాన్యుల కోసం శివకవులు తీర్చిదిద్దిన దేశీ కవిత్వం, అచ్చ దేశీయమైన భాషలో, జానపద బాణిలలో గీతాలు, కీర్తనలు రాసిన అన్నమయ్య వంటివారు, నిజమైన ప్రజాస్వామిక నిర్మాతలైన వేమన, వీరబ్రహ్మం వంటి వారు ప్రాచీన సాహిత్యంలోనూ ఆధునిక సంస్కరణ భావాలనీ తీర్చిదిద్దారు.

సమాజం–సాహిత్యం రెండు పరస్పర ఆధారితాలు. వ్యక్తులనే కాదు సమూహాలను, సమాజాలను సైతం ఆకర్షించగల శక్తి ఒక్క సాహిత్యానికే ఉంది. అందుకే శివకవులు, అన్నమయ్య, వీరబ్రహ్మం, వేమన వంటి వారు తమ భావజాల ప్రసరణకు సాహిత్యాన్నే మాధ్యమంగా ఎన్నుకున్నారు. అంతే కాదు వేమన, తిక్కన, గురజాడ కందుకూరి వంటి ఎంతోమంది కవులు సమాజంలోని అసమానతలు, కుల మత భేదాలను, లింగ అసమానతలు నిర్మూలించడానికి, తమ సంస్కరణ వాదానికి సాహిత్యాన్నే ఆయుధంగా మలుచుకున్నారు. ఎందుకంటే–

**సాహిత్యం మనసుకు మత్తుమందు చల్లడమే కాదు,**
**సమాజానికి శస్త్ర చికిత్స చేయగలరు !!**



**ప్రసిద్ధ విమర్శకులైన ఘట్టమరాజు అశ్వత్థనారాయణకు** 2023 మార్చి 28న మధ్యాహ్నం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని అందజేసారు. **పిల్లల మర్రి వేదవతి – జగన్నాథం** పేరిట ఇస్తున్న ఈ కీర్తి పురస్కారం ప్రధాన అతిథి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ప్రొ. డి. రవీందర్ గారు అందజేశారు. గత నలభైఐదు సంవత్సరాలుగా **తెలుగు సాహిత్య విమర్శనా రంగంలో** అకుంఠిత దీక్షతో కృషి చేస్తున్న ఘట్టమరాజు గత కొన్ని నెలలుగా మూసీ మాస పత్రికకు **'గ్రంథాంతరంగం'** పేరిటి ప్రతినెల ఒక ప్రాచీన పుస్తకాన్ని పరిచయం చేస్తున్నారు. వారికి ఈ సందర్భంగా 'మూసీ' పత్రిక పరివారం అభినందనలు తెలుపుతుంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6 (53) హైదరాబాద్ ఏప్రిల్ : 2023

## కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 31

# స్వరాభిషేకం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

'కె. విశ్వనాథ్ చలనచిత్రాలు – సామాజిక అవలోకనం' నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"స్వరాభిషేకం".** ఈ చిత్రం 2004 వ సంవత్సరంలో విడుదలైంది. 2000 సంవత్సరం తర్వాత కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. ఆయన మార్క్ చిత్రాల్లానే సంగీతానికి పెద్దపీట వేస్తూ ఈ చిత్రం రూపొందించారు. కె. విశ్వనాథ్ దర్శకుడిగా, నటుడిగా, కుటుంబ కథా చిత్రానికి సంగీతాన్ని అంతర్లీనంగా జోడించి రూపొందించారు. శ్రీకాంత్, లయ, శివాజీ మొదలగువారు ప్రధాన తారాగణంగా నటించారు. ఈ చిత్రం ఉత్తమ చలన చిత్రంగా జాతీయ పురస్కారాన్ని పొందింది. మరియు ఈ చిత్రానికి సంగీతం అందించిన సి. హెచ్. విద్యాసాగర్‌కు సంగీతపరంగా జాతీయ పురస్కారంతో పాటు నంది పురస్కారాలు లభించాయి.



**చిత్ర కథ :**

శ్రీరంగం సోదరులు శాస్త్రీయ సంగీతం నందు మంచి ప్రావీణ్యం కలిగిన వారు. వారి ప్రతిభ, కృషికి తగ్గట్టునే శాస్త్రీయ సంగీత నేపథ్యంలో కొనసాగే తెలుగు చలన చిత్రాలకు సంగీతం అందిస్తూ గొప్ప పేరు, ప్రఖ్యాతులు సంపాదిస్తారు. శ్రీరంగం సోదరులలో పెద్ద 'శ్రీనివాసరావు' (కె. విశ్వనాథ్). ఆయన పద్ధతులు, సంప్రదాయాలకు తోడు వ్యక్తిత్వం కల్గిన మనిషి. అతని భార్య రుక్మిణి (ఊర్వశి). వారి అన్యోన్య దాంపత్యానికి ఒకే ఒక లోటు సంతానం లేకపోవడం. రెండవ వ్యక్తి 'రంగ' (శ్రీకాంత్). రంగ తన అన్న శ్రీనివాసరావు బాటలో నడుస్తూ ఆయన మాటను మంత్రంగా పాటిస్తూ సంగీతంలో చేదోడువాడుగా వుంటాడు. రంగకు వివాహం అయి సంతానం వున్నప్పటికీ భార్య మరణంతో ఏకాకిగా జీవనం సాగిస్తుంటాడు. రంగ సంతానాన్నే తమ సంతానంగా స్వీకరించి శ్రీనివాసరావు దంపతులు కాలం వెళ్ళదీస్తుంటారు. కాని రంగకు ఒక మంచి అమ్మాయితో వివాహం చేసి తోడును తీసుకురావాలని ఆ దంపతుల అభిలాష.

చెప్పులు కుట్టి జీవనం సాగించే వారు సుబ్బలక్ష్మి (జయలక్ష్మి) దంపతులు. తీర్థయాత్రలకు వెళ్ళిన సమయంలో సుబ్బలక్ష్మి దంపతులకు శ్రీరంగం సోదరులతో పరిచయం ఏర్పడుతుంది. ఆ సోదరుల సంగీత పాండిత్యానికి ముగ్ధులైన సుబ్బలక్ష్మి దంపతులకు వారంటే గౌరవం, భక్తి ఏర్పడుతుంది. సుబ్బలక్ష్మి దంపతులు చిన్న చెప్పుల కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తుంటారు. ప్రతి సంవత్సరం శ్రీరంగం సోదరులు సుబ్బలక్ష్మి దంపతులకు బట్టలు పెట్టి సత్కారం చేస్తుంటారు. కారణం గతంలో ఆ దంపతులు చేసిన చిన్న సహాయం వలననే శ్రీరంగం సోదరుల శాస్త్రీయ సంగీత ప్రతిభ ప్రపంచానికి తెలియజేయబడ్డుంది. తదనంతర కాలంలో శ్రీరంగం సోదరులు సంగీత సామ్రాజ్యంలో సామాన్య స్థాయి నుండి అసామాన్య స్థాయికి ఎదుగుతారు. శ్రీనివాసరావు రకరకాల వ్యాధులతో తన వద్దకు వచ్చిన రోగులకు సంగీతంతో మ్యూజిక్ థెరపీ చేస్తుంటాడు.

చందు (చంద్ర శేఖర్) (శివాజీ)కి సంగీతం అంటే ఇష్టం. ఏరోజుకైనా వర్తమాన గాయకుడిగా ఎదగాలని ప్రయత్నిస్తుంటాడు. అందరి ముందు వేదికపై పాడుతుంటే అతడి పాటకు ప్రేక్షకులు చేసే హర్షధ్వానాలు వినాలని కలలు కంటూ వుంటుంది అంధురాలైన అతడి తల్లి. చందు ఎలాగైనా శ్రీరంగం సోదరుల వద్ద శిష్యరికం చెయ్యాలని విఫల ప్రయత్నాలు చేస్తూ వుంటాడు. సురేఖ(లయ) విదేశాలలో పెరిగి పెద్దదై ఇండియాకు వచ్చిన అమ్మాయి. ఆర్థికంగా బలమైన కుటుంబం. ఆ కుటుంబ వ్యవహారాలన్నీ వృత్తిరీత్యా వైద్యురాలైన ఆమె తల్లి చేతుల మీదుగా జరుగుతుంటాయి. సురేఖ ఒక టీవీ ఛానల్‌లో యాంకర్‌గా పని చేస్తూ వుంటుంది. ఒకసారి శ్రీరంగం సోదరులు చేసే ఒక సంగీత విభావరి కార్యక్రమానికి సురేఖ యాంకర్‌గా వ్యవహరిస్తుంది. ఈ క్రమంలో సురేఖ తెలుగు సినీ సంగీత లోకంలో శ్రీరంగం సోదరులు ఎంత ప్రఖ్యాతిగాంచిన వారో తెలుసుకుంటుంది. అదే సందర్భంలో సురేఖకు శ్రీరంగం వారి కుటుంబంతో సన్నిహిత పరిచయం ఏర్పడ్డుంది.

శ్రీరంగం సోదరుల కుటుంబానికి సురేఖ దగ్గరైన తర్వాత శ్రీనివాసరావు భార్య రుక్మిణికి, భార్య మరణంతో ఒంటరివాడైన




రంగకు సురేఖతో వివాహం చేస్తే అతడికి మంచి తోడు తెచ్చిన వాళ్ళమవుతాం అనే భావన కల్గుతుంది. తన ఆలోచనను భర్తకు చెప్పి ఒప్పిస్తుంది. కాలం గడిచేకొద్దీ ఆమె అనుకున్నట్లుగానే రంగ– సురేఖల మధ్య ప్రేమ చిగురిస్తుంది. అది కాస్తా ఏడడుగుల బంధానికి దారులు వేస్తుంది. కాని సురేఖ తల్లి మాత్రం రంగతో సురేఖ వివాహాన్ని వ్యతిరేకిస్తుంది. అయినప్పటికీ రంగ–సురేఖలు వివాహ బంధంతో ఒక్కటై దాంపత్య జీవితం ప్రారంభించడమే కాక శ్రీరంగం వారి కుటుంబ జీవనం చూడముచ్చటగా కొనసాగుతూ వుంటుంది.

ఒకరోజు చందు, తనను గాయకుడిగా చూడాలని కలలు కనే అంధురాలైన తన తల్లి కోరిక నెరవేరింది అనే విధంగా ఆమె ముందు చిన్న డ్రామా ప్లే చేసి ఆమెను సంతోష పెడతాడు. దానికోసం ఒక టేపురికార్డర్లో పాటను, ప్రజల హర్షధ్వానాలను రికార్డు చేసి ఆమె ముందు తాను వేదికపై పాడాననే అనుభూతిని కల్పించేలా చేస్తాడు. ఇదంతా అక్కడే వుండి యాదృచ్ఛికంగా గమనించిన రంగ, చందు తాపత్రయాన్ని అర్థం చేసుకొని తన అన్నతో మాట్లాడి అతడిని వారి బృందంలో చేర్చుకుంటాడు. దాంతో చందు జీవన ప్రయాణం సాఫీగా సాగబోతోందనగా అనుకోకుండా అతడి తల్లి మరణిస్తుంది. చందు తనతోపాటే తనకు అన్ని వేళల్లో తోడూనీడగా వుండే తనతో బంధుత్వం, స్నేహం కల్గిన అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. మరోవైపు శ్రీరంగం సోదరులు అమితంగా ఇష్టపడే సుబ్బలక్ష్మి భర్త హఠాన్మరణం చెందుతాడు. ఆ సమయంలో శ్రీరంగం సోదరులు వారు సంగీత ప్రపంచంలో ఎదగడానికి సుబ్బలక్ష్మి భర్త చేసిన సహాయాన్ని గుర్తుచేసుకోవడమే కాక దగ్గరుండి అంత్యక్రియలు జరిపిస్తారు. అంతేకాక సుబ్బలక్ష్మిని తమ కుటుంబంతో పాటే వుండమంటూ ప్రతిపాదన చేస్తారు.

శాస్త్రీయ సంగీతంలో కృషి చేసినందుకు శ్రీనివాసరావుకు పద్మశ్రీ అవార్డు లభిస్తుంది. అంతా శ్రీనివాసరావును ప్రశంసల్లో ముంచెత్తు తుంటారు. ఇదంతా చూస్తున్న రంగ భార్య సురేఖకు బావ అయిన శ్రీనివాసరావుపై అసూయ కల్గుతుంది. కారణం శ్రీనివాసరావు సంగీత ప్రస్థానంలో తన భర్త రంగ కృషి కూడా వున్నప్పటికీ అతడికి తగినంత పేరు రాలేదనేది ఆమె అభిప్రాయం. దానికి తోడు సురేఖ తల్లి అడపాదడపా సురేఖను సూటిపోటి మాటలతో మెట్టినింట్లో నీ స్థానమెప్పుడూ **"సెకండ్ గ్రేడ్ సిటిజన్ లాంటిదే"** అంటూ విమర్శిస్తూ వుంటుంది. ఆమె మాటలకు తగ్గట్టుగానే కొన్ని సందర్భాలు సురేఖకు తన తల్లి వాదనను బలపరిచేలా కన్పిస్తాయి. ఈ విషయాలన్నింటినీ మనసులో పోగుచేసుకున్న సురేఖ తన భర్త రంగకు, బావ శ్రీనివాస రావుకు మధ్య విభేదాలు వచ్చేలా చేస్తుంది. అతి స్వల్పకాలంలోనే శ్రీనివాసరావు దంపతులకు ఇంట్లో జరుగుతున్న విభేదాలపై స్పష్టత వస్తుంది. దాన్ని దృష్టిలో వుంచుకుని శ్రీనివాసరావు దంపతులు తీర్థయాత్రల పేరుతో ఇంట్లో నుండి వెళ్ళిపోతారు. అంతేకాక శ్రీనివాసరావు రంగాకు తనపై కోపం వచ్చేలా ప్రవర్తించి తన తమ్ముడికి దూరం అవుతాడు. కాని శ్రీనివాసరావు దూరం అయిన తర్వాత 'రంగా' సంగీత ప్రపంచంలో వెనకబడిపోతాడు. వ్యక్తిగతంగా ఏకాకిగా మారడమే కాక ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోకి జారుకుంటాడు. అన్నకు దూరమైన భాదతో తనకు తాను వ్యక్తిగతంగా కృంగి, కృషించి పోతాడు. గొంతులో పటుత్వం తగ్గి సంగీత ప్రపంచంలో ప్రభ కోల్పోవడమే కాక అవకాశాలు తగ్గిపోతాయి. ఇదంతా చూసిన సురేఖ తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెందుతుంది. ఇదంతా జరగడానికి తనే కారణం అని గ్రహించిన ఆమె తిరిగి శ్రీరంగం సోదరులను కలిపే ప్రయత్నం చేస్తుంది. శ్రీనివాసరావు సోదరులు ఒక్కటై అందరూ కలిసిపోవడంతో కథ సుఖాంతం అవుతుంది.


**చిత్ర విశేషాలు**

జాతీయ ఉత్తమ చలనచిత్రంగా, సంగీత చిత్రంగా అవార్డులను అందుకున్నప్పటికీ "స్వరాభిషేకం" ప్రధానంగా కుటుంబ కథా చిత్రం. ఉమ్మడి కుటుంబాల నుండి చిన్న కుటుంబాల వైపు మొగ్గు చూపుతున్న సమాజానికి కలిసి వుండడంలో వుండే బలాన్ని చూపిన చాలా చిత్రాల్లానే స్వరాభిషేకం కూడా కుటుంబ వ్యవస్థను వ్యాఖ్యానించిన చిత్రం. సంగీతాన్ని అంతర్లీనంగా మిళితం చేసి కె. విశ్వనాథ్ తన మార్కును వదలకుండా చక్కని కుటుంబ కథా చిత్రాన్ని తీసే ప్రయత్నం చేశారు. కాని సాధారణ కుటుంబాల్లా కాకుండా సంగీతంతో సంబంధమున్న కుటుంబం యొక్క కథను చెప్పడం వల్ల ప్రేక్షకుడు తమ కుటుంబానికి దగ్గరగా పోల్చుకునే అవకాశాలు మూసుకుపోయాయి. దాని వల్ల చిత్రం వ్యాపారపరంగా, స్థాయి పరంగా అంతకుముందు చిత్రాల స్థాయిలో విజయం సాధించ లేకపోయింది.

'శ్రీనివాసరావు' పాత్రలో కె. విశ్వనాథ్ గారు నటించారు. శుభసంకల్పంతో నటుడిగా ప్రారంభమైన కె.విశ్వనాథ్ దర్శకత్వంలోనే కాక నటుడిగానూ ప్రేక్షకుల మనసును దోచుకున్నారు. శ్రీనివాసరావు పాత్రలో శాస్త్రీయ సంగీత విద్వాంసునిగా, మరియు కుటుంబ పెద్దగా రెండు పార్శ్వాల్లో నటించారు. శ్రీనివాసరావు పాత్ర ద్వారా 'మ్యూజిక్ థెరపీ' అనే విషయాన్ని బహిర్గతం చేసి సంగీతానికి రోగాలను సైతం ఉపశమనం కల్గించే శక్తి వుందని చెప్పడం కొత్త విషయం. మ్యూజిక్ థెరపీకి సంబంధించి పలువురికీ పలు అభిప్రాయాలు వున్నప్పటికినీ దానికి సంబంధించిన చర్చ అప్రస్తుతం. ఇక 'రంగా' పాత్రలో శ్రీకాంత్ నటించారు. అన్నయ్య చాటు తమ్ముడిగా గౌరవం, భక్తి, వినయం, ప్రేమ వంటి భావోద్వేగాలు చూపడం నుండి ఒకానొక సమయంలో అన్నను అసహ్యించుకుని తనకు దూరం చేసుకుని ఒక్కడిగా సంగీతంలో తన ముద్రను చూపే దిశగా సాగే పాత్రలో నటించారు. అంతేకాక అన్నను దూరం చేసుకున్నాక తన బలాన్ని కోల్పోయి నిస్సహాయ స్థితిలోకి జారుకుని స్వయంగా తనను తాను విధ్వంసం చేసుకునే పాత్రలో శ్రీకాంత్ నటన అద్భుతం.


సురేఖ పాత్రలో లయ నటించారు. నిజానికి శ్రీరంగం సోదరుల మధ్య ప్రధాన సంఘర్షణకు కారణం సురేఖ పాత్రయే. అయితే ఆ సంఘర్షణకు ఆజ్యం పోసే పరిస్థితులకు ఉత్ప్రేరకంగా పనిచేసేది మాత్రం సురేఖ యొక్క తల్లి పాత్ర. సురేఖకు అమ్మ పాత్రలో సన నటించారు. సురేఖ పాత్రలో అల్లరితనం, ప్రేమ, అసూయ, పశ్చాత్తాపం వంటి భావోద్వేగాలు మిళితమై వుంటాయి. నిజానికి అన్నదమ్ముల మధ్య పొరపొచ్చాలనేవి ప్రతి ఇంటిలోనూ సర్వ సాధారణమే. కాని దానికి కారణమయ్యేవి మాత్రం అసూయ, అపార్థం చేసుకోవడం వంటి అంశాలు. సరిగ్గా 'అసూయ' అనే సహజ దుర్గుణాన్ని కథలో మేళవింపు చేసి సంఘర్షణను రేకెత్తించారు దర్శకుడు. కాని కథలో సమస్య ఏమిటంటే? కథలో ప్రధాన సంఘర్షణ అనేది చిత్రంలోని సుమారు మూడు పాళ్ళ సమయం పూర్తయిన తర్వాత మొదలవడం. అంతకు ముందు వరకు ప్రేక్షకుడు కథాగమనంలో లీనమైనా అది ఏ దిశగా సాగుతుందనే అంశం పట్ల స్పష్టత రాదు. దానివల్ల కథలో ఉత్సుకత కొరవడినట్లు కనిపిస్తుంది. లయ లాంటి నటి ఈర్ష్య, అసూయలు కలగలసిన పాత్రకు సరితూగ లేకపోయారు.

చందు పాత్రలో శివాజీ నటించారు. వేదికపై పాట పాడుతున్నప్పుడు తన గొంతు వినాలని ఆరాటపడే అంధురాలైన తల్లి కలను నెరవేర్చడానికి తాపత్రయం చెందే పాత్ర అది. శ్రీరంగం సోదరుల వద్ద శిష్యరికం చేయడానికి చందు విఫల ప్రయోగాలు చేస్తూ వుంటాడు. తన తల్లి ముందు వేదికపై పాట పాడుతున్నట్లుగా పాటను రికార్డ్ చేసి వినిపించే సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. శ్రీరంగం సోదరుల వద్ద చందు శిష్యరికం




సంపాదించానని తల్లికి చెప్పబోయే సమయానికి ఆమె మరణించడం ప్రేక్షకుల హృదయాలు చెమర్చేలా చేస్తుంది. సుబ్బలక్ష్మి భర్త హఠాన్మరణం తర్వాత శ్రీరంగం సోదరులు దగ్గరుండి అంతక్రియలు నిర్వహించే సన్నివేశం ప్రధాన సన్నివేశాల్లో ఒకటి. ఎంత ఎదిగినా పొందిన సహాయానికి కృతజ్ఞతగా వుండాలనే విషయాన్ని ఈ సన్నివేశం వ్యక్తపరుస్తుంది. కథాగమనం ఎన్ని దిశల్లో సాగినా సంగీత ప్రతిభ గల ఇద్దరు సోదరులు కలిసి వుంటే ఏ స్థాయి విజయాలు అందుకున్నారు, విడిపోయి ఎలా పతనమయ్యారు, ఎలాంటి ఆత్మ సంఘర్షణలకు, వేదనలకు లోనయ్యారు అనే విషయాన్ని నొక్కి చెప్పిన చిత్రం "స్వరాభిషేకం".

| | | |
|---|---|---|
| **చలన చిత్రం** | : | **స్వరాభిషేకం** |
| **విడుదల** | : | **నవంబర్ 5, 2004** |
| **ప్రొడక్షన్** | : | **రాజరాజేశ్వరీ కంబైన్స్** |
| **తారాగణం** | : | **కె.విశ్వనాథ్, శ్రీకాంత్, శివాజీ, లయ, ఊర్వశి, సన, నరేష్ తదితరులు** |
| **సంగీతం** | : | **విద్యాసాగర్** |
| **సాహిత్యం** | : | **సిరివెన్నెల సీతారామశాస్త్రి, వేటూరి** |
| **మాటలు** | : | **రమేష్ గోపి** |
| **నిర్మాత** | : | **కౌసలేంద్ర రావు** |
| **కథ, దర్శకత్వం** | : | **కె.విశ్వనాథ్** |



# లోకం గొడ్డువోయింది

అవును
ఈ కాలం గొడ్డువోయింది
మా తాత లాంటి ముద్దు బిడ్డను గోల్పోయి లోకం
గొడ్డువోయింది.
బహు చక్కని రూపం
నెరిసిన జుట్టు
చూసిన అనుభవించిన
ఆ లోకం తీరుకు నిలువుటద్దం.
ఎనెన్ని బాధలు భరించినవో
ఎన్ని ఒడిదుడుకులను ఎదుర్కున్నవో
ఆ నుదిటిన పడ్డ మడతలు సెప్తయ్.
ఎన్ని పంటలు పండించినవో
ఒంగిన నడుమే సెప్తది
దళారి దోసుకున్న నీ కష్టానికి
ఎండిన నీ డొక్కే ప్రతీక
నీలాంటి శ్రమజీవిని కోల్పోయి
ఈ లోకం గొడ్డువోయింది తాత..!

నీకు అన్నింటా తోడున్న రుమాలు,
సేతిల కట్టే, తెగిపోయిన తోలు సెప్పులు,
బొడ్లే జోపుకున్న జకుముకు రాయి,
గుప్పున గుబాలించే సుట్ట అన్నీ నీ నేస్తాలు
నిను నిత్యం కాపాడుకున్న సేవకురాళ్లు
నీ లాంటి జానపదున్ని గోల్పోయి
లోకం గొడ్డువోయింది.

అసలు నీ ఆహార్యమే వేరు
యోగి తత్వం నాటినుండే తెలుసేమో
ఏనాడు నిండు బట్ట కట్టలే!
నెత్తికి రేగడి మట్టి, ఒంటికి సాబది బండ
ఏంటో నీ తత్వం ఏనాడూ భోదపడలే!
నీ లాంటి మట్టి మనిషిని గోల్పోయి
లోకం గొడ్డుబోయింది.



గోరుకొయ్యలు మొలువంగా, తొలికోడి కూయంగా
మోటగొట్టిన రోజులన్నీ చిన తాత చెప్పిందు,
నువ్ పాడిన ఒక్కొక్క పాటని అవ్వ మళ్ళా గుర్తుజేసింది,
ఎడ్ల బండి మీద నువ్ అస్తున్న తీరు సెప్తూ
పోశాలు తాత మీసం దిప్పిందు,
పూడిసేసిన మన పెద్దబాయి
నీ గురుతులన్నీ దాసుకున్నదట నాయన సెప్పిందు,
పాలుబోసి ఎవలికాడ పావలా తీసుకోలేదట
మన బోడావు స్వయానా జెప్పింది,
నీ సేతికి ఎముకే లేదట
బైండ్లోల్ల ఇద్దయ్య తాత జెప్పిందు,
నీలాంటి మంచిని కోల్పోయిన
ప్రతీసారి ఈ లోకంమంతా చిన్నబోతది తాత
మనోళ్లు గూడా దాన్ని గుర్తు పట్టలేరు.
నాడు జోకొడుతూ నువ్ చెప్పినవన్నీ కథలనుకున్న
కానీ అవి నీ వ్యథలు అని నేడే తెలిసింది
నిన్ను ఇంకోసారి జూస్తనన్న ఆశలుడిగినయ్,
నీ రూపం మళ్ళా పుట్టుకొస్తదనే నమ్మకంలేదు,
మరుపురాని మనిషి కోసం
ఈ జీవితమంతా ఎదురుచూపే
తిరిగి రాకుండా నిన్ను గోల్పోయి
లోకం మొత్తానికే గొడ్డువోయింది తాత!!

డా. వడ్కాపురం కృష్ణ
ఫోన్ : 96666 02670

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2023

# తెలుగు సాహిత్యం – పర్యావరణం (సిటీ కళాశాల జాతీయ సదస్సు నివేదిక)

**వర్ధ వేణు,** తెలుగు పరిశోధకుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 9963 81 54 84

సిటీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో డా.జవ్వాజి నీరజ, డా.కోయి కోటేశ్వరరావు గార్ల కృషితో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సు మొదటిరోజు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుల్తానా మేడం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఐఏఎస్ అరవింద్ కుమార్ గారు, ఐఏఎస్ వాణీ ప్రసాద్ గారు, మామిడి హరికృష్ణ, దుస్సల సత్యనారాయణగార్లు పాల్గొన్నారు. ప్రధాన వక్తగా వైజ్ఞానిక గ్రంథాల రచయిత నాగసూరి వేణుగోపాల్ గారు ఉన్నారు. శ్రీ అరవింద్ కుమార్ మాట్లాడుతూ హెచ్.ఎం.డి.ఏ. వారితో మాట్లాడి సిటీ కాలేజ్ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వాణీ ప్రసాద్ గారు మాట్లాడుతూ అందరికీ అమ్మ చెట్టు మాత్రమే అని చెబుతూ 10 మందిలో తొమ్మిదిమందికి స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడానికి అవకాశం లేదని, విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన ఉంది. కానీ దాన్ని పాటించడం లేదు అని మనము అమెరికా వాళ్ళ లాగా బ్రతకాలంటే ఈ భూమికి నాలుగువంతులు భూమి కావాలని, ప్రకృతిని తిరిగి కాపాడుకోవాలని దీనికి కవులు రచయితలు పర్యావరణంపై రచనలు చేయాలని మాట్లాడారు.

మరో అతిథి మామిడి హరికృష్ణ మాట్లాడుతూ మానవుడు ఆధునికంగా మారి 5000 సంవత్సరాలు అయితే తన స్వార్థం కోసం ఈ ప్రకృతిని నాశనం చేస్తున్నాడు అని, మంచుకొండలు కరిగి పోతున్నాయని, భూకంపాలు వస్తున్నాయని, తీర ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉందని, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని తెలిపారు. దీనికి పరిష్కారం ఒకే మంత్రం ఒకే ఒక హీరో చెట్టు మాత్రమే అని చెప్పారు ప్రకృతిని చూసి స్పందించని వాడు కవి కాడు అని ప్రతి కవి ప్రకృతిని ప్రేమిస్తాడని వృషాధిప శతకంలో పాల్కురికి సోమన ప్రకృతి వర్ణనలు చేశాడని హరికృష్ణ గారు మాట్లాడారు.

దుస్సల సత్యనారాయణ మాట్లాడుతూ, 'కోతులు అన్నాయట మాకు లేని ఇల్లు మీకెందుకు' అని హాస్యంగా మాట్లాడారు. చెట్లను నరికితే పోలీసువాళ్ళు అధికారులు దెబ్బలు కొడతారని భయపడేవారు. దీనివల్లనే అడవి బ్రతుకుతున్నది అని మాట్లాడారు.

ప్రధానవక్త నాగసూరి వేణుగోపాల్ పర్యావరణంపై విద్యార్థులు వ్యాసాలు రాయాలని, పిల్లలకు శిక్షణ ఇవ్వాలని సూచనలు ఇచ్చారు. మన భారతదేశంలో ఏ పని చేసిన లాభదాయకంగానే చూస్తున్నారు. కానీ ఏ ఒక్కరు కూడా పర్యావరణం గురించి మాట్లాడడం లేదు అని వాపోయారు.

మొదటి సమావేశంలో ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు తమ అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ చెట్టు నరికితే నరకానికి పోతామని భయాన్ని నేర్పిన సంస్కృతి మనది. ప్రబంధాలలో వృక్షాల గురించి వర్ణించారు అని పద్మినీ జాతి స్త్రీ స్పర్శ వలన ఒక భాగం స్పర్శ వలన ఒక్కొక్క చెట్టు సృష్టిస్తుందని పేర్కొన్నారు.

సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ తాను రాసిన 'నేను అడవిని మాట్లాడుతున్నాను' అనే పుస్తకం గురించి, పర్యావరణం గురించి మాట్లాడుతాను అంటూ మీరు ఒక్కసారి సిటీ నుంచి అడవిలోకి వెళ్లి చూడండి అని అడవి ఎలా ఉందో అంటూ తల్లి ప్రసవిస్తే ఆ తల్లి బొడ్డు తాడు తానే కోసుకుంటుంది, తానే పసరు పోసుకుంటుంది అని, 100 మందిలో బిడ్డకు పాలు ఇవ్వడానికి బిడియపడని మాతృమూర్తి నా అడవి బిడ్డ, అంటూ అడవిలో గిరిజనుల గురించి అడవి బిడ్డల గురించి మాట్లాడుతూ చింత గింజలను కాల్చి దంచి అంబలి కాచుకొని ఆకలిని పోగొట్టుకుంటుంది నా బిడ్డ అడవి బిడ్డ. చర్మవ్యాధులు తగ్గించడానికి ఆకుల పసరుతో గాయాలు మాన్పించే నా అడవి బిడ్డ ఎంబీబీఎస్ అని చెట్టు చెట్టుకు ఆధార్ కార్డు, అడవికి ఆరోగ్యశ్రీ గురించి మీ చట్టసభల్లో ఎందుకు మాట్లాడరు. చట్టం ఎందుకు తీసుకురారు అని ప్రభుత్వాన్ని కోరుతూ దేశం అంటే మనుషులేనా, దేశమంటే మట్టి కాదా, దేశమంటే చెట్టు కాదా, దేశమంటే పక్షి కాదా, దేశమంటే పుట్ట కాదా అని ప్రశ్నిస్తూ మాట్లాడారు.



ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ శివలింగం ఆకృతి ఎలా ఉంటుందో భూగోళం ఆకృతి కూడా అట్లాగే ఉంటుందని, శివుడికి మూడు రకాల చలనాలు ఉంటాయి కాబట్టి త్రయంబకుడు అని, చంద్రుడు ఉపగ్రహం కాబట్టి చంద్రశేఖరుడు అంటారని, మూడింతలు భూమిపై జలం ఉండటం వల్ల గంగాధరుడు అని అంటారు. వైదిక సాహిత్యంలో శ్రీసూక్తంలో శ్లోకాలను వర్ణిస్తూ బిల్వ వృక్షం, తులసీ మొక్కల యొక్క గొప్పతనాన్ని మాట్లాడుతూ బిల్వవృక్షం పెంచడం వలన దాని ఎండిన ఖండాలు హోమంలో వేయడం వలన దానినుంచి వచ్చే పొగతో చుట్టూ ఉండేటువంటి పర్యావరణాన్ని కాపాడుతుంది అని, బిల్వవృక్షం ఆకులను తేనెలో ముంచి హోమంలో వేయడం వల్ల ఆ చుట్టూ ఉన్న పర్యావరణం రక్షించ బడుతుంది అని, బిల్వవృక్షం ఎక్కువగా ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తుంది అని ఎక్కువగా ఈ చెట్లను పెంచడం వల్ల ఆక్సిజన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుందని మాట్లాడారు.

ఆచార్య పులికొండ సుబ్బాచారి గారు మాట్లాడుతూ గాలిని కాలుష్యం ఎక్కువగా చేస్తున్నామని చెప్తూ పర్యావరణ జానపద విజ్ఞానం చైతన్యం అనే అంశంపై మాట్లాడుతూ పర్యావరణం ఒకప్పుడు వేరే అర్థంలో ఉన్నా, ప్రస్తుత అర్థం మాత్రం వేరే అని కాలుష్యం బారిన పడినదే పర్యావరణం అని ప్రకృతి విధ్వంసం ఇలాగే కొనసాగితే సముద్ర తీర ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

లక్ష్మణ చక్రవర్తి గారు ప్రాచీన సాహిత్యంలో వేదాలలో భూమిని కాపాడుకోండి నీటిని రక్షించుకోండి అనే పదాలు కనిపిస్తున్నాయని, సస్యానందంలో దోనయామాత్యుడు వివరించారు. శివుడు కంఠంలో విషాన్ని దాచుకోకుంటే ఎంత జలకాలుష్యం జరిగేదో మనం ఆలోచించాలని చెప్పారు.

మధ్యాహ్నం రెండవ సమావేశానికి ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి గారు అధ్యక్షత వహించారు. గోరేటి వెంకన్న ఓ నల్ల తుమ్మ పాటల గురించి వివరణ ఇస్తూ ప్రజావాగ్గేయకారుల గురించి మాట్లాడారు. 1972లో యూ.యన్.ఓ.లో పర్యావరణానికి తలపెడుతున్న హాని గురించి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలి అని పిలుపునిచ్చారు. నిజానికి ఈ భూమండలం మానవులది కాదు వైరస్‌ది అని కూడా పేర్కొన్నారు. పల్లెల్లో వచ్చే మార్పులు, ప్రకృతిపై ప్రభావాలను ప్రజావాగ్గేయకారులు ఎలా చిత్రిస్తున్నారో తెలిపారు.


డా. ఎస్. రఘుగారు లఘు కవిత్వంలో పర్యావరణ చైతన్యంపై మాట్లాడుతూ మనిషి వైజ్ఞానిక అభివృద్ధి పేరుతో తెచ్చుకున్న పర్యవసానం ఇది అని చెబుతూ, మినీ కవితల్లో **'చెట్లు మన ఊపిరితిత్తులు వాటిపై దూయకండి కత్తులు'** అని కవి వర్ణించిన తీరును పేర్కొన్నారు. ఒక అరగంట మనం ఒక దగ్గర కూర్చోలేం కానీ చెట్టు జీవితాంతం నిలబడుతుంది. అటువంటి చెట్టును మనిషి నరికి వేస్తున్నారు. వీరికి పర్యావరణంపై స్పృహ లేకపోవడమే అని పేర్కొన్నారు.

ఆచార్య సూర్య ధనుంజయ్ గారు గిరిజన సాహిత్యం పర్యావరణ చైతన్యం అంశంపై మాట్లాడుతూ వీరు అంతా అడవి బిడ్డలు అని, ప్రకృతిని ఎక్కువగా కాపాడేది గిరిజనులే అంటూ, వీరు మొదలుపెట్టిన ప్రతి పనికి ముందుగా ప్రకృతిని పూజిస్తారని చెప్పారు.

మరో ప్రముఖ పర్యావరణ వేత్త కస్తూరి మురళీకృష్ణ గారు సైన్స్ ఫిక్షన్ పర్యావరణ చైతన్యం మీద మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే విషయాన్ని ముందే ఊహించి చెప్పేది సైన్స్ ఫిక్షన్ అంటారు అని పేర్కొన్నారు. యుద్ధాలు చేయడం వలన అణుబాంబులు వేయడం వలన వచ్చే మార్పులు తెలియజేసినారు. భూమిలో ప్రతిదీ మార్పు జరుగుతుందని బొద్దింకలు మనుషులను


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**




తింటాయని పక్షులు జంతువులను తింటాయని భవిష్యత్తులో జీవితం ఎలా ఉంటుంది అని వివరించారు. మనిషి జీవితంలో వేరే గ్రహాలను వెతుక్కోవాల్సి వస్తుందని, మానవుని మార్పును సైన్స్ ఫిక్షన్‌గా వివరించారు.

**రెండవ రోజు సమావేశము**

ఈ సమావేశానికి ఆచార్య కాశీం గారు అధ్యక్షత వహించారు. వీరు సిటీ కాలేజ్ విద్యార్థుల గురించి మాట్లాడుతూ 1952లో నాన్ ముల్కీ గో బ్యాక్ అనే ఉద్యమం వచ్చింది. ఇక్కడ నుండే ముల్కీ ఉద్యమం నడిచింది అని గుర్తు చేశారు. సిటీ కాలేజ్ అనగానే ఈ రెండు విషయాలు గుర్తు వస్తాయని సిటీ కాలేజ్‌ని కాపాడుకోవడం కూడా పర్యావరణంలో భాగమే అని చెప్పారు.

వెల్దండి శ్రీధర్ గారు పంచభూతాలను మనిషి నాశనం చేస్తున్నాడు అని తెలుపుతూ మనిషి తాను కూర్చున్న చెట్టును తానే నరుకుతున్నాడు అని చెబుతూ 'మనిషి ఎంతవరకు తనను తాను కూర్చున్న చెట్టును నరుక్కున్నాడో అనేది పరిశీలించడమే ఈ అంతర్జాతీయ పర్యావరణ సదస్సు' అని పేర్కొన్నాడు.

జె. భారతి గారు చిగురుమామిళ్ల శ్రీనివాస్ శతకం గురించి మీరు మాట్లాడుతూ వీరి శతకాలన్నీ ఆటవెలదిలో రాసారని వీరు 'వృక్ష శతకం' మకుటంలో మొక్కలు నాటాలని నేలతల్లి శతకంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వీరు పేర్కొన్నారు.

డా. అట్టెం దత్తయ్య గారు "వర్తమాన పద్య కావ్యాలు పర్యావరణం చైతన్యం" అన్న విషయం మీద మాట్లాడుతూ వాహనాల పొగ, ఫ్యాక్టరీల పొగ గురించి నగరాల్లో విషవాయువు ఏ విధంగా పెరుగుతుందో పర్యావరణం గురించి చక్కని విశ్లేషణ చేశారు.

సత్య శ్రీనివాస్ గారు ప్రముఖ పర్యావరణవేత్త. 1908లో మూసీ వరదలు వచ్చినప్పుడు ఉస్మానియా హాస్పిటల్‌లో చింతచెట్టు 120 మందిని కాపాడింది అని చెబుతూ పర్యావరణం అనేది సబ్జెక్టు కాదు పర్యావరణం అనేది ఒక అధ్యాయం నిరంతర పరిశోధనగా చదవాలి అని పేర్కొన్నారు.


**రెండవ రోజు రెండవ సమావేశము**

గోరేటి వెంకన్న తన పాటలో పర్యావరణ విషయాలు గురించి, వృత్తుల గురించి, చెట్లు, పక్షుల గురించి, చెరువుల గురించి, పాటలో వివరించారు. మొదట పర్యావరణ స్పృహ లేకుండా రాశాను తర్వాత ఎంత పర్యావరణం ఉందో నాది నాకే అద్భుతంగా అనిపిస్తుందని, కృష్ణశాస్త్రి కవిత్వంలో పర్యావరణ ప్రకృతి అనంతంగా ఉందని పేర్కొన్నారు.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఎన్. గోపి జలగీతం పుస్తకంలో కవిత్వం గురించి, పర్యావరణం గురించి, చెరువుల గురించి, కాలువల గురించి పర్యావరణ పరిరక్షణ ద్వారా నీటిని కాపాడుకోవాలని



పేర్కొన్నారు. నారాయణ శర్మ గారు **"పురాణాలు పర్యావరణ చైతన్యం"** అనే అంశం మీద మాట్లాడారు. మామిడాల రమేష్ బాబు గారు **"గోరేటి వెంకన్న సాహిత్యం పర్యావరణ చైతన్యం"** గురించి మాట్లాడుతూ వారి పాటలో ప్రకృతి సాహిత్యం ఉందని అన్నారు. రెంటాల జయదేవ్ గారు సినిమా సాహిత్యం పర్యావరణం అంశంపై, ఎన్. మృదుల **సంస్కృత సాహిత్యంలో పర్యావరణం** అంశంపై, కె.పి. అశోక్ కుమార్ గారు **నవల పర్యావరణ చైతన్యం** గురించి మాట్లాడుతూ వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం, జల కాలుష్యం ఉన్నాయంటే ఇంకా వేరే కాలుష్యం ఉన్నాయని చెప్పారు. కృష్ణ కౌండిన్య గారు **కరోనా పాటలు పర్యావరణ చైతన్యం**పై, అంబటి వెంకన్న **నా పాట పర్యావరణం చైతన్యం**పై, దొరవేటి గారు **ఆధునిక శతకాలు పర్యావరణ చైతన్యం**పై, మట్ట సంపత్ కుమార్ రెడ్డి గారు **పల్లె భాష పర్యావరణ ప్రతీకాత్మకత** గురించి మాట్లాడారు. షేక్ బాబన్న **నా పాట పర్యావరణం చైతన్యం**పై, గౌరీ కృపానందం గారు **తమిళంలో పర్యావరణంలో నవలల**పై, మోక ప్రతాప్ కుమార్ గారు **ఆధునిక వచన కవిత్వం పర్యావరణ చైతన్యం**పై, నందిగామ నిర్మల, రాకేష్ భవాని, బూర్ల చంద్రశేఖర్, వరద వేణు, తిరునగరి శ్రీనివాస్, డా. వెంకటరమణ, వల్లూరి సునీల్, వడ్ల శంకర్, కమలా సుధారాణి, అజ్మీర సుజాత, బి. కేథరీన, అనంత లక్ష్మి మొదలైన వారు పర్యావరణం వివిధ అంశాలపై పత్రసమర్పణ చేసారు.





**ముగింపు సదస్సు**

కోయి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో వీరు సుద్దాల అశోక్ తేజ నేను అడవిని మాట్లాడుతున్న పుస్తకం మీద మాట్లాడుతూ సుద్దాల అశోక్ తేజ అడవి గురించి, పక్షుల గురించి, చెట్ల గురించి, జంతువుల గురించి అడవిని ఎలా కాపాడుకోవాలో పర్యావరణ స్పృహతో రాసినటువంటి పుస్తకం. ఇందులో అనేక విషయాల గురించి మీరు మాట్లాడారు. మట్టిలో కవిత్వం ఉందని కుమ్మరి కుండలో కవిత్వం ఉందని కమ్మరి కొలిమిలో కవిత్వం ఉందని చెబుతూ ఇవన్నీ పర్యావరణంతో సంబంధమున్నాయని పర్యావరణాన్ని కాపాడాలని అడవులను, చెట్లను, జంతువులను, చెరువులను, కుంటలను, చుట్టూ పరిసరాలను కాపాడుకొని పర్యావరణాన్ని రక్షించాలని చెప్పారు.

జవ్వాజి నీరజ 'కొల్లేటి జాడలు' అక్కినేని కుటుంబరావు రాసిన ఈ పుస్తకంలో పర్యావరణ సంబంధించిన కథను వివరిస్తూ పర్యావరణం పట్ల బాధ్యతగా ఉండాలని పర్యావరణాన్ని కాపాడుతూ చెట్లను పెంచాలని కొల్లేటి సరస్సు మంచినీటి సరస్సులు కాలుష్య బారిన పడుతున్నాయని వాటిని కాపాడుకుంటూ ప్లాస్టిక్ వంటి వాటిని నిషేధించాలని ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలను కాలువల్లో, చెరువుల్లో, నదుల్లోకి వెళ్ళడం వల్ల వాటి ద్వారా సముద్రాల్లోకి, సరస్సుల్లోకి వ్యర్థ పదార్థాలు వెళ్ళి వాటిని కలుషితం చేస్తున్నాయి. ఆ సరస్సులోని నీరు అనేక జంతువులు, పక్షులు తాగడం వల్ల అనేక రోగాల బారినపడి చనిపోతున్నాయని ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా జాగ్రత్త పడాలని పర్యావరణాన్ని బాధ్యతగా రక్షించాలని ప్రతి మనిషి తన కర్తవ్యంగా తీసుకొని ఈ సమాజాన్ని కాలుష్యరెతమైనటువంటి సమాజంగా మార్చాలని గాలి నీరు భూమి అడవులను కాలుష్యం చేయకుండా వాటిని కాపాడుకోవాలని మాట్లాడారు.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**
**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**
**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**
(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం 'కదంబం'.
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**


## స్వ'కృతి'



**ప్రసన్న భారతి "కథా మంజరి"**
కూర్పు : ద్విభాష్యం రాజేశ్వర రావు,
నిర్వహణ : సుధామ
వెల : 180 /-
**ప్రతులకు :** సుధామ, ఫోన్ : 98492 97958




**రాజనాల బండ (కథల సంపుటి)**
ఆర్.సి. కృష్ణస్వామి రాజు
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్, తిరుపతి - 517 507, ఫోన్ : 9393662821




**చిత్తరువు పద్య ద్విశతి**
డా. గన్నోజు శ్రీనివాసాచారి
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, మహబూబ్ నగర్,
ఫోన్ : 8888899493



**కార్వేటి నగరం కథలు** (బాలల బొమ్మల కథలు)
ఆర్.సి. కృష్ణస్వామి రాజు
వెల : 140 /-
**ప్రతులకు :** రచయిత, తిరుపతి,
ఫోన్ : 939 366 2821.



**కాళిదాస విరచిత "ఋతు సంహారః"**
స్వేచ్ఛాకవితానువాదం
రఘువర్మ (డా. టి. లక్ష్మీనారాయణ)
వెల : 125 /-
**ప్రతులకు :** రచయిత, 3-1-264, పురానిపేట, జగిత్యాల - 505 327.
ఫోన్ : 929 009 3933



**సాహితీ సుగంధం (డా.కర్నాటి లింగయ్య సాహిత్యం)**
కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి
వెల : 400 /-
**ప్రతులకు :**
నందనవనం (సాహితీ సమితి), హైదరాబాద్.
ఫోన్ : 8332947239


## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | |
|---|---|
| 1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. 2875 - 00 |
| 2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. 1200 - 00 |
| 3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. 350 - 00 |
| 4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. 100 - 00 |
| 5. శాసన సంపుటి | రూ. 150 - 00 |
| 6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి | రూ. 100 - 00 |
| 7. షబ్నవీస్ శతజయంతి సంచిక | రూ. 100 - 00 |
| 8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | 90 - 00 |
| 9. త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. 75 - 00 |
| 10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. 75 - 00 |
| 11. దేవాలయ వాస్తుశిల్పము | రూ. 50 - 00 |
| 12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. 50 - 00 |
| 13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. 75 - 00 |
| 14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. 100 -00 |
| 15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. 100 - 00 |
| 16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. 175 - 00 |


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# మరమ్మత్తులకు వేళయింది..!!





మాయమౌతున్న మట్టి మనిషిని
వెతుక్కుంటూ నేను వెళ్తున్నాను
మొనలు తేలిన రాళ్ళతో
తలలు తెగిన మెడలతో
అక్కడి భూమి అవిటిదై వుంది
నిజానికది ఒకప్పటి పసిడి సీమ
వాడని పువ్వులతో
ఆరని వెలుగులతో
ప్రజ్వరిల్లిన ప్రజారామ
చూస్తూ ఉండగానే ఎక్కడి పురుగో
వేయి పెట్టుడు రెక్కలతో వాలి
తన గూటి పలుకులతో
అదిగో... ఆ మిట్టమీద
గుట్టలు గుట్టలుగా అన్యాయం చెట్టుకు
అంకెల కాగితాలు
వేలాడదీసుండారనగానే
ఏళ్ల తరబడి తోడుగా నడిచిన సమాజాన్ని
ఖలుతత్వంతో ఎండపెడుతూ
మోడుబారిన రాతి గుంజలకు
విలువను, విజ్ఞానాన్ని కట్టిపడేసి
దేశాన్ని మనుషులుగా చేసిన
మహోన్నత సంస్కర్తల తరాన్ని
పూలదండల గుబాళింపుల్లో
నెరులెల్లిన గోడలకు వేలాడదీసి
రాజులుగా రాజ్యమేలాలని
రారాజులుగా బతుకునీడ్చాలని
ఉలికిపాటు ఉన్మత్తతో
ఎగబడిపోతున్న ఓ తరాజులారా!
నీ తల్లి నీ తండ్రి
నీ మట్టి నీ జాతి
పరాధీనతలో విలపిస్తూ
నీవైపు దీనంగా చూస్తుంటే
వెర్రిగా గొర్రెల మందలా
ఆ పరుగులెక్కడికి
విలాసాల పచారులాపి
వినోదాల గోష్ఠులు మాని
రండి! ఇటు మరలండి
మనల్ని మనం
మనుషులుగా చెక్కుకొని
మరో ప్రపంచాన్ని నిర్మించుకునే
మరమత్తులకు వేళయింది.

**డా. పాదిలి నాగరాజు**
905 203 8569


ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం
మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?
అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?
మీరు తీసుకునే ప్రతి నిర్ణయానికి మా ప్రేమ, సేవ అంకిత భావం మీకు తోడుగా ఉంటుంది.
సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్, ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్, స్త్రీలలో గర్భాశయ అండాశయ లోపాల నివారణ-చికిత్స, వెరికోసీల్, వీర్యకణాల లోపం, ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా లోపాల నిర్ధారణ -సవరణ, ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.
7416 106 106
www.ferty9.com
IUI
IVF
ICSI
IMSI
HSG
ఫర్టీ 9
హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం
మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...
విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్